www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 19-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 244 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 10.03 తదుపరి పంచమి; నక్షత్రం: ఆశ్లేష రా. 2.00 తదుపరి మఖ; వర్జ్యం: మ. 2.19-3.59; దుర్ముహూర్తం: ఉ. 10.22-11.06, మ. 2.45-3.29; అమృతఘడియలు: రా. 12.19-2.00; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 5.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



క్రికెట్‌కు అశ్విన్ గుడ్‌బై

హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించిన స్పిన్నర్

భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్ట్ డ్రాగా ముగిసిన అనంతరం జరిగిన మీడియా సమావేశంలో తన నిర్ణయం ప్రకటించాడు. 38 ఏళ్ల అశ్విన్.. తన 14 ఏళ్ల కెరీర్‌ను ముగించారు. 106 టెస్టులు, 116 వన్డేలు, 65 టీ20ల్లో భారత్‌కు అశ్విన్ ప్రాతినిధ్యం వహించాడు. టెస్టుల్లో 537 వికెట్లు పడగొట్టిన అశ్విన్.. అత్యధికంగా 619 వికెట్లు సాధించిన అనిల్ కుంబ్లే తర్వాతి స్థానంలో నిలిచాడు. 2011 వన్డే వరల్డ్‌కప్ సాధించిన జట్టులో అశ్విన్ సభ్యుడు. ఎంతో తెలివైన, సృజనాత్మకతగల బౌలర్‌గా గుర్తింపు పొందిన అశ్విన్.. స్వదేశంలో టెస్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు.

రచయిత పెనుగొండకు సాహిత్య అకాడమీ అవార్డు


పెనుగొండ లక్ష్మీనారాయణ

- లక్ష్మీనారాయణ వ్యాససంపుటి 'దీపిక' ఎంపిక
- పల్నాడులో జననం.. న్యాయవాదిగా ప్రాక్టీస్
- యాభై ఏళ్లకుపైగా తెలుగు సాహితీ సేద్యం
- అరసం జాతీయ అధ్యక్షుడిగా సేవలు
- వచ్చే ఏడాది మార్చి 8న అవార్డు ప్రదానం

2



14

హెచ్-1బీ వీసా నిబంధనలు సరళతరం

- ఎఫ్-1ను హెచ్-1బీగా మార్చుకునే చాన్స్
- అమెరికా కంపెనీల్లో విదేశీ నిపుణులను సులభంగా నియమించుకునే అవకాశం
- దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం
- బైడెన్ నిర్ణయం.. జనవరి 17 నుంచి అమలు
- లక్షల మంది భారత ఐటీ నిపుణులకు లబ్ధి

ఫెర్రీని ఢీకొన్న నౌకాదళ బోటు 13 మంది మృతి

- ప్రాణాలతో బయటపడిన 101 మంది
- ముంబైలో పడవ ప్రమాదం

14

● అధిక పెన్షన్ పథకం వివరాల సమర్పణకు గడువు పెంపు



జనవరి 31 వరకు అవకాశం: ఈపీఎఫ్‌వో

ఐటీ ఉద్యోగులకు 'సూపర్ ఇన్సెంటివ్'

- దేశంలో ఒక్క ఏపీ ప్రభుత్వమే ప్రకటించింది
- సీనియర్ ఉద్యోగులకు ఏడాదికి లక్ష ప్రోత్సాహకం
- వరుసగా మూడేళ్ల పాటు ఉద్యోగి ఖాతాలో జమ
- 2030 నాటికి లక్ష కోట్ల ఐటీ ఎగుమతులు లక్ష్యం
- టాప్-5 ఐటీ సిటీల్లో విశాఖను నిలబెడతాం
- ప్రభుత్వానిది ఐటీ అనుకూల విధానం
- ఏపీ డీటీఐఎల్ఎఫ్ కన్వీనర్ శ్రీధర్ కొసరాజు


ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

13

రంగంలోకి ఈడీ!

వైవీ తనయుడికి నోటీసులు!

కాకినాడ పోర్టు కేసులో మరో మలుపు





- మనీలాండరింగ్‌పై ప్రాథమికంగా నిర్ధారణ
- జగన్ హయాంలో చేతులు మారిన వాటాలు
- బెదిరించి, భయపెట్టి కొట్టేశారని ఫిర్యాదు
- విక్రాంత్ రెడ్డి, సాయిరెడ్డి తదితరులపై ఇప్పటికే సీఐడీ కేసు నమోదు
- పోర్టులో సోదాల్లో కీలక ఫైళ్లు స్వాధీనం

కేవీ రావు ఫిర్యాదు మేరకు సీఐడీ వై.విక్రాంత్ రెడ్డి (వైవీ సుబ్బారెడ్డి కుమారుడు)ని ఏ1గా పేర్కొంటూ కేసు నమోదు చేసింది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ, అరబిందో సంస్థను నిందితులుగా చేర్చింది. ప్రస్తుతానికి విక్రాంత్ రెడ్డికి మాత్రమే ఈడీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ సీపోర్టులో వాటాలను కారుచౌకగా కొట్టేసిన కేసు కీలక మలుపు తిరిగింది. ఇందులో లోగుట్టు వెలికి తీసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. జగన్ హయాంలో చోటు చేసుకున్న ఈ బలవంతపు డీల్ వెనుక భారీగా మనీ లాండరింగ్ జరిగిందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. కాకినాడ సీపోర్టు అసలు యజమాని కేవీరావును జగన్ సన్నిహితులు బెదిరించి, భయపెట్టి కారుచౌకగా వాటాలు కొట్టేసిన వైనంపై ఈడీకి పలు ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళ్లినట్లు తెలిసింది. వాటిని పరిశీలించిన ఈడీ... ఈ 'డీల్'లో మనీలాండరింగ్ చోటు చేసుకుందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు రాబట్టేందుకు విక్రాంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

విక్రాంత్ ప్రత్యక్ష ప్రమేయం...

జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అనేక ప్రాజెక్టులు, గనులు, పోర్టులు చేతులు మారిపోయాయి. అందులో.. కాకినాడ సీపోర్టు కూడా ఒకటి! ఇందులో 41శాతం వాటాను తాడేపల్లి పెద్దలకు బాగా దగ్గరైన 'అరబిందో' దక్కించుకుంది. తనను బెదిరించి, భయపెట్టి మరీ వాటాలు రాయించుకున్నారని పోర్టు యజమాని కేవీ రావు ఇటీవల సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీనికి

మిగతా 13వ పేజీలో...

ఛత్తీస్ టు ఆంధ్రా!

ఇదేం 'రేషన్' లింకు బాబోయ్

- ఛత్తీస్‌గఢ్ కంపెనీ సత్యం బాలాజీ లీలలెన్నో
- పోర్టు నుంచి అత్యధిక బియ్యం ఎగుమతి దానిదే
- ఛత్తీస్ నుంచి ధాన్యం తెచ్చి.. ఆడించి మిక్స్ చేస్తున్నారా?
- లేదంటే కాకినాడ కేంద్రంగానే సేకరించి తరలిస్తున్నారా?
- జూన్‌లో కంపెనీ గోదాములో పెద్దఎత్తున తనిఖీలు
- 6,332 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం.. కేసు
- మళ్లీ నౌకలోకి ఎక్కిస్తున్న 1,320 టన్నులు పట్టివేత
- ఐదేళ్లలో ఈ కంపెనీ రూ.4,788 కోట్ల ఎగుమతులు
- అందులో రేషన్ బియ్యం ఎన్ని వందల కోట్లో?

13



గనుల వెంకటరెడ్డిపై మరో కేసు!

- ఒకట్రెండు రోజుల్లో ఏసీబీ ఎఫ్ఐఆర్
- జగనన్న సర్వే రాళ్ల కటింగ్ పేరిట 100 కోట్లు కొట్టేసేందుకు స్కెచ్
- చైనా యంత్రాలు తెప్పించేలా బినామీ సంస్థతో పక్కా ప్లాన్
- రూ.కోటి టర్నోవర్ కూడా లేని ధన్వంతరికి 160 కోట్ల టెండర్
- అడ్డగోలుగా నిబంధనల ఉల్లంఘన
- ప్రాథమిక విచారణలో కీలక ఆధారాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల టెండర్లు, ఇసుక తవ్వకాల్లో భారీ అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి మెడకు మరో కేసు బిగుసుకుంటోంది. గత ప్రభుత్వంలో జగనన్న సర్వే రాళ్ల కటింగ్ పేరిట చైనా మిషన్ల కొనుగోలులో ఏకంగా రూ.100 కోట్లు కొట్టేసేందుకు వేసిన ప్లాన్ వెలుగులోకి వచ్చింది. నిబంధనలకు భిన్నంగా తన సన్నిహితుడి కంపెనీకి రూ.160 కోట్ల టెండర్ కట్టబెట్టారు. దీనికి సంబంధించి కీలక సమాచారాన్ని సేకరించిన అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఒకటి, రెండు రోజుల్లో వెంకటరెడ్డితో పాటు ఆయన బినామీ సంస్థగా

మిగతా 2వ పేజీలో...

హెల్మెట్ లేకపోతే ఉపేక్షించొద్దు



2

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాలి
- రోడ్లపైనే తనిఖీలు చేసి అక్కడికక్కడే చలాన్లు వేయాలి
- విజయవాడలోని వాహనదారుల్లో క్రమశిక్షణ లేదు
- చలాన్లు చెల్లించని వాహనాలను సీజ్ చేయాలి
- వాహనదారుల లైసెన్సులు ఎందుకు రద్దు చేయడంలేదు?
- చట్టం అమలుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?
- అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

హారన్లతో నరకం చూపుతున్నారు

విజయవాడ నగరంలో వాహనదారులకు క్రమశిక్షణ లేదు. ప్రపంచానికి ఇదే చివరి రోజు అన్నట్లుగా అనవసరంగా హారన్లు మోగిస్తూ ప్రజలకు నరకం చూపిస్తున్నారు. పోలీసులు కూడా వారిని నియంత్రించేందుకు ప్రయత్నించట్లేదు. నగరంలో ఎక్కడా నో హారన్ జోన్లు, సైన్‌బోర్డులు లేవు. స్పీడ్ గన్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. - హైకోర్టు ధర్మాసనం



అమరావతికి రారండి!

12

- జాతీయ, అంతర్జాతీయ కాంట్రాక్టర్లకు సీఆర్‌డీఏ ఆహ్వానం
- రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపు
- రూ.100 కోట్ల పైబడి ప్యాకేజీ పనుల అప్పగింతకు సిద్ధం
- రాష్ట్రంలో కాంట్రాక్టు సంస్థల రిజిస్ట్రేషన్‌కూ సహకారం



ఇప్పుడు ఇదొక ఫ్యాషన్‌గా మారిపోయింది..
అంబేడ్కర్, అంబేడ్కర్, అంబేడ్కర్,
అంబేడ్కర్, అంబేడ్కర్, అంబేడ్కర్...

వారు ఇన్ని సార్లు భగవంతుడి పేరు తలచుకొంటే ఏడేడు జన్మల స్వర్గవాసం లభించేది.. అంబేడ్కర్ పేరు తలచుకోవడం మాకూ ఆనందమే! కానీ... అదే సమయంలో మీరు (కాంగ్రెస్) ఆయన పట్ల అనుసరించిన వైఖరేమిటో ఇప్పుడు చెబుతా.. అంటూ హోంమంత్రి అమిత్‌షా మంగళవారం రాజ్యసభలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. భారత రాజ్యాంగ నిర్మాతను అమిత్‌షా అవమానించారని విపక్షాలు ఆరోపించగా... తన వ్యాఖ్యలను వక్రీకరించారని అమిత్‌షా మండిపడ్డారు. బుధవారం ఇదే అంశంపై రాజ్యసభ దద్దరిల్లింది. అమిత్‌షా క్షమాపణ చెప్పాల్సిందేనని ప్రతిపక్ష సభ్యులు గట్టిగా పట్టుబట్టారు. అమిత్ షా నోటి దురుసును దేశం సహించబోదని 'ఫేస్‌బుక్'లో రాహుల్ గాంధీ స్పష్టంచేయగా, కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్‌షాను తక్షణం తొలగించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. విపక్ష వాదనలను ప్రధాని మోదీ గట్టిగా తిప్పి కొట్టారు. అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు కాంగ్రెస్ కుట్రలు చేసిందని, ఆ బండారాన్ని అమిత్‌షా బయటపెట్టడంతోనే సరికొత్త నాటకానికి తెరతీసిందంటూ నిప్పులు చెరిగారు. అంబేడ్కర్ విషయంలో కాంగ్రెస్ పాపాల చిట్టానూ బయటపెట్టారు. తాను అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని, మాట్లాడబోననీ అమిత్ షా స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించి, తప్పుడు వార్తలను వ్యాపింపజేస్తోందన్నారు.

అంబేడ్కర్‌పై అమీతుమీ


పార్లమెంట్ ఆవరణలో ప్రియాంక, రాహుల్ తదితరుల నిరసన

అంబేడ్కర్‌కు అవమానం: విపక్షం.. నా వ్యాఖ్యలను వక్రీకరించారు: షా

కాంగ్రెస్ కొత్త నాటకాలు

- అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టే కుట్ర చేశారు!
- కాంగ్రెస్ బండారాన్ని అమిత్ షా బయటపెట్టారు
- అంబేడ్కర్‌ను కాంగ్రెస్ 2 సార్లు ఎన్నికల్లో ఓడించింది
- వ్యతిరేకంగా నెహ్రూ ప్రచారం.. 'భారతరత్న' ఇవ్వలేదు
- ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి: మోదీ
- అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఎన్నటికీ మాట్లాడను: షా

14

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- అంబేడ్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు: రాహుల్
- క్యాబినెట్ నుంచి షాను తక్షణమే తొలగించాలి: ఖర్గే
- మానవుల గౌరవానికి అంబేడ్కర్ ప్రతీక: ప్రియాంక
- ఇండీ కూటమి ఎంపీల నిరసన

'జల్‌జీవన్'లో జనం భాగస్వామ్యం

- వారి ఫిర్యాదులు, సూచనలకు పెద్దపీట
- గత పాలకుల తీరుతో పథకం అస్తవ్యస్తం
- 5 లక్షలతో అయ్యే పనులూ పెండింగ్‌లోనే..
- కోటి మందికి రక్షిత తాగునీరు కూటమి లక్ష్యం
- త్వరలో కేంద్రానికి 70 వేల కోట్లతో ప్రతిపాదనలు
- కొత్త నీటి వనరుల సృష్టికి సమష్టిగా పనిచేద్దాం
- వర్క్‌షాపులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు



నేను 2008లో ఆదిలాబాద్ తండాలో తిరుగుతున్నప్పుడు చూపులేని ఓ వృద్ధుడు ఎదురుపడ్డాడు. 'కాస్త నీళ్లిప్పించయ్యా...' అని నన్ను వేడుకున్నాడు. ఆ వృద్ధుడు అన్న మాట ఎప్పుడు గుర్తుకువచ్చినా, నా కళ్లలో గిర్రున నీళ్లు తిరుగుతాయి. నా శాఖల్లో అత్యంత కీలకమైంది... నాకు ఇష్టమైంది గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని అందించే ఆర్‌డబ్ల్యూఎస్. స్వచ్ఛమైన తాగునీరు అందిస్తే ప్రజల సంతోషానికి హద్దు ఉండదు. చాలా వరకు ఇతర సమస్యలు కూడా తొలగిపోతాయి. - పవన్ కల్యాణ్

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పనుల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. ఇప్పుడున్న నీటి వనరులకు కొత్త రూపు తీసుకురావడంతో పాటు కొత్త నీటి వనరులను సృష్టించుకోవడం ఈ పథకం లక్ష్యం కావాలని వివరించారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటుచేసిన జల్‌జీవన్ మిషన్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. నీటి నిర్వహణ, సరఫరా విషయంలో

మిగతా 12వ పేజీలో...

ఆక్రమించి.. అమ్మేసి!

వైసీపీ నేత చెరువు దోపిడీ

13

- జగన్ హయాంలో 5 కోట్ల విలువైన భూమిని కాజేసిన వైనం
- ప్రకాశం జిల్లా మార్కాపురంలో దర్జాగా ప్లాట్లు వేసి విక్రయం
- అప్పట్లో పట్టించుకోని యంత్రాంగం
- రెవెన్యూ సదస్సులో బహిర్గతం
- రంగంలోకి దిగిన అధికారులు
- రాళ్ల తొలగింపు.. కేసు పెట్టే చాన్స్



హోంగార్డులకు పచ్చజెండా

- నెరవేరనున్న కానిస్టేబుల్ కల.. తొలగిన న్యాయపరమైన చిక్కులు
- ప్రారంభమైన హాల్ టికెట్ల జారీ.. 30 నుంచి జిల్లా కేంద్రాల్లో పరీక్షలు
- 6,100 పోస్టుల భర్తీకి రెడీ.. ఐదేళ్లలో ఒక్క ఉద్యోగమూ ఇవ్వని జగన్

12

ప్రత్యేక కేటగిరీగా హోంగార్డులు



- కానిస్టేబుళ్ల నియామకాల్లో ప్రాధాన్యం.. 6 వారాల్లో ప్రత్యేక మెరిట్ లిస్ట్ సిద్ధం చేయాలి
- రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ఆదేశం

ఇంటర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

- 1 నుంచి అమలుకు నిర్ణయం
- నేడు క్యాబినెట్ ముందుకు ప్రతిపాదనలు
- వైసీపీ ప్రభుత్వంలో పథకానికి మంగళం
- పునఃప్రారంభిస్తున్న కూటమి ప్రభుత్వం
- 1.41 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- స్టూడెంట్ కిట్‌లో జేఈఈ, నీట్ మెటీరియల్

12

హైస్కూల్ ప్లస్‌లకు స్వస్తి!

- వాటి స్థానంలో జూనియర్ కాలేజీలు
- ఉన్నత పాఠశాలల ప్రాంగణాల్లోనే ఏర్పాటు
- కొత్తగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల నియామకం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి కో-ఎడ్యుకేషన్ విధానం అమలు

3

నెల్లూరు జిల్లాలో 'జికా' కలకలం

ఆరేళ్ల బాలుడికి వైరస్ లక్షణాలు

2

రచయిత పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

» లక్ష్మీనారాయణ వ్యాససంపుటి 'దీపిక' ఎంపిక



గుంటూరు, న్యూఢిల్లీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణకు 2024 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆయన రచించిన దీపిక అనే సాహిత్యవిమర్శ సంపుటికి ఈ పురస్కారం ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు బుధవారం ప్రకటించారు. దేశంలో 21 భారతీయ భాషల్లో సాహిత్య అకాడమీ పురస్కారాల వివరాలను ఆయన వెల్లడించారు. అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ పురస్కారాలను ఖరారు చేసినట్లు చెప్పారు. కాగా, అవార్డు దక్కించుకున్న 'దీపిక'ను లక్ష్మీనారాయణ 2021లో రచించారు. కాగా తెలుగులో అవార్డు ఎంపిక చేసిన జ్యూరీ సభ్యులుగా 'ఆంధ్రజ్యోతి' మాజీ సంపాదకుడు కె.శ్రీనివాస్, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, విహారి వ్యవహరించారు. పురస్కారాన్ని వచ్చే ఏడాది మార్చి 8న అందజేయనున్నారు. ఇంకా...దిలీప్ ఝవేరా (గుజరాతీ), కె. జయకుమార్ (మలయాళీ), గగన్ హిల్ (ఢిల్లీ), వైష్ణవ్ చరణ్ సామల్ (ఒడియా), ఏ ఆర్ వెంకటాచలపతి (తమిళనాడు) తదితరులు వేర్వేరు సాహిత్య ప్రక్రియల్లో అకాడమీ పురస్కారాలు దక్కించుకున్నారు.

సాహితీకొండ.. పెనుగొండ

పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెంలో 1954 అక్టోబరు 24లో లింగమ్మ, గోవిందరెడ్డి దంపతులకు పెనుగొండ లక్ష్మీనారాయణ జన్మించారు. చెరువుకొమ్ముపాలెం, ఫిరంగిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ వినుకొండలో, బీఏబీఎల్ గుంటూరు ఆంధ్ర కళాశాలలో చదివారు. 1983లో ఉపాధ్యాయురాలు ఉప్పుటూరి గీతతో ఆయనకు వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. 1987లో న్యాయవాదిగా ప్రస్థానం మొదలుపెట్టారు. అటుపై గుంటూరు బార్ అసోసియేషన్ కార్యదర్శిగా 1989-90లో పనిచేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగాను, బార్ అసోసియేషన్ ఫెడరేషన్ ఛైర్మన్‌గాను బాధ్యతలు నిర్వహించారు. తెనాలిలో 1972లో జరిగిన అరసం జిల్లా మహాసభకు ప్రతినిధిగా పులుపుల వెంకట శివయ్యతో కలిసి పెనుగొండ హాజరయ్యారు. అప్పటి నుంచి అరసంతో ఆయనకు అనుబంధం ఏర్పడింది. 2023 ఆగస్టు నుంచి అరసం జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అరసం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్త ఆయనే కావడం విశేషం.

ప్రత్యామ్నాయ కవితాగోష్ఠులు..

వివిధ అంశాలపై 200 వ్యాసాలు, దాదాపు 50 కవిత్వ, కథా, వ్యాస సంపుటాలకు ముందుమాటలు, పదుల సంఖ్యలో పుస్తక సమీక్షలు, దాదాపు 600 సాహిత్య సభలు, సమావేశాలు, సదస్సులు.. ఇదీ లక్ష్మీనారాయణ ట్రాక్ రికార్డు. 1974లో రచించిన సమిధ కవితతో పెనుగొండ సాహితీ ప్రస్థానం మొదలైంది. అటుపై రేపటిలోకి, అనేక, నూరేళ్ల పులుపుల, విధిత, దీపికతోపాటు అనేక పుస్తక సమీక్షలు, డాక్టర్ పాపినేని శివశంకర్, వల్లూరి శివప్రసాద్‌లతో కలిసి సహ సంపాదకత్వం, గౌరవ సంపాదకత్వం వహించారు. స్మృతిరేఖలు, స్వయంకృషి, పాన్‌వాలా, గుంటూరు కథలు, వల్లూరి శివప్రసాద్, కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు, శశిశ్రీ కథలు, వాసిరెడ్డి సీతాదేవి కథలు, పులుపుల వెంకటశివయ్య గేయాలతో పాటు అనేక వ్యాసాలకు సంపాదకత్వం వహించారు. ఉగాది కవి సమ్మేళనాలకు ప్రత్యామ్నాయంగా మేడే నాడు కవితా గోష్ఠులను గుంటూరులో 'అవగాహన'తో కలిసి నిర్వహిస్తున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ 1997లో హైదరాబాద్‌లో నిర్వహించిన వర్క్‌షాపులో 'తెలుగులో కథా సంకలనాలు-స్థూల పరిశీలన' అనే అంశంపై పెనుగొండ పరిశోధన పత్రం సమర్పించారు. ఈ పరిశోధన ప్రముఖ కథా రచయిత కాళీపట్నం రామారావును కదిలించింది. దాని ఆధారంగానే శ్రీకాకుళం జిల్లాలో కథా నిలయాన్ని ఏర్పాటు చేశారు.

గర్వంగా భావిస్తున్నాను..

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికవ్వడం సంతోషంగా ఉందని, గర్వంగా భావిస్తున్నానని పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. 'సాహితీ ప్రపంచంలో అరసం నాకో స్థానం కల్పించింది. ఇకపైనా ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాను"అని తెలిపారు. ఆయనకు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.,

సముద్ర రాయబారిగా 'ఐఎన్‌ఎస్ నిర్దేశక్'

» అత్యాధునిక సాంకేతికత.. 80% స్వదేశీ

» రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్



అత్యాధునిక సర్వే నౌక ఐఎన్‌ఎస్ నిర్దేశక్



విశాఖపట్నం నావల్ డాక్‌యార్డులో బుధవారం 'ఐఎన్‌ఎస్ నిర్దేశక్' నౌకను జాతికి అంకితం చేసిన రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్. చిత్రంలో తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్

విశాఖపట్నం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన సర్వే నౌక ఐఎన్‌ఎస్ నిర్దేశక్.. విదేశాలతో సంబంధాలు పెంచుకోవడానికి సముద్ర రాయబారిగా ఉపయోగపడుతుందని రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. కోల్‌కతా గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ తయారు చేసిన ఈ నౌకను విశాఖ నావల్ డాక్‌యార్డులో బుధవారం ఆయన జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'సముద్రాలను సర్వే చేసి కొత్త విషయాలను వెలుగులోకి తేవడానికి ఉపయోగపడే ఈ నౌక ఒక్క భారతదేశానికే కాకుండా ఇతర దేశాలకు కూడా సేవలు అందిస్తుంది. ఈ సేవల వల్ల ఆయా దేశాలతో వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు బలపడతాయి. 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ నౌకలో అడ్వాన్స్‌డ్ హైడ్రోగ్రఫీకి చెందిన మల్టీ బీమ్ ఎకో సౌండర్లు, సైడ్ స్కాన్ సోనార్లు, ఏయూవీ, ఆర్‌ఓవీ వంటివి ఉన్నాయి. సముద్రాలలో మ్యాపింగ్, నేవిగేషన్, డీప్ సీ ఆపరేషన్లలో కచ్చితమైన ప్లానింగ్‌కు బాగా ఉపయోగపడుతుంది. ప్రమాదకర ప్రాంతాల్లోనే కాకుండా, నిషిద్ధ జోన్లలోనూ సర్వే చేసి కచ్చితమైన డేటాను అందిస్తుంది. సముద్ర అంతర్భాగంలో ఉండిపోయిన శిథిలాలను గుర్తించడంతో పాటు పర్యావరణ అధ్యయనాలు చేస్తుంది. సముద్రంలో ఓ ఆస్పత్రిగా కూడా సేవలు అందిస్తుంది' అని వివరించారు. కార్యక్రమానికి తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ అధ్యక్షత వహించగా, నౌక కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ అజయ్ చౌహాన్ పాల్గొన్నారు.

హెల్మెట్ లేకపోతే ఎంతమాత్రం ఉపేక్షించవద్దు



» నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరించాలి

» విజయవాడలోని వాహనదారుల్లో క్రమశిక్షణ లేదు

» చలాన్లు చెల్లించని వాహనాలను ఎందుకు సీజ్ చేయడంలేదు?

» పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి

» ఐజీ రవికృష్ణకు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మోటార్ వాహనాల చట్ట నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడంపై హైకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రాఫిక్ నిబంధనలు అమలుచేయడంలో పోలీసులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని నొక్కిచెప్పింది. హెల్మెట్ తప్పనిసరి చేస్తూ తాము ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడంలేదని పోలీసులను ప్రశ్నించింది. నిబంధనల అమలు విషయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం పలు ఆదేశాలు ఇచ్చింది. నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారనే సందేశాన్ని వాహనదారుల్లోకి బలంగా పంపించాలని, పోలీసులు రోడ్ల మీదకు వచ్చి వాహన రికార్డులు తనిఖీ చేసినప్పుడే అది సాధ్యపడుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సీసీ కెమెరాలపై ఆధారపడి చలాన్లు విధించడాన్ని తగ్గించి, పోలీసులు రోడ్లపై నిలబడి నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చలాన్లు విధించి అక్కడికక్కడే వసూలు చేస్తే రెండు నెలల్లో గణనీయమైన మార్పు వస్తుందని అభిప్రాయపడింది. పోలీసులు రోడ్లపై ఉంటే క్రిమినల్ చర్యలు కూడా తగ్గుతాయని పేర్కొంది.

99 శాతం మందికి హెల్మెట్లు లేవు

హెల్మెట్ ధరించని ద్విచక్రవాహనదారులను ఎంతమాత్రం ఉపేక్షించవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. 99 శాతం మంది హెల్మెట్ ధరించకుండానే వాహనాలు నడుపుతున్నారని పేర్కొంది. వాహనాన్ని నడిపే వ్యక్తే కాకుండా వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. మోటార్ వెహికిల్ చట్టంలోని సెక్షన్ 167 ప్రకారం నిర్దిష్ట గడువులోగా చలాన్లను చెల్లించనివారి వాహనాలను ఎందుకు సీజ్ చేయడం లేదని ప్రశ్నించింది. అలాగే చట్టంలోని సెక్షన్ 206 ప్రకారం వాహనదారుల లైసెన్స్‌లను ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీసింది. హెల్మెట్ ధరించని కారణంగా ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకు 667 మంది చనిపోయారని, హెల్మెట్‌ను తప్పనిసరి చేస్తూ తాము ఇచ్చిన ఉత్తర్వులు అమలు చేసి ఉంటే అందులో కొన్ని ప్రాణాలైనా నిలబడేవని వ్యాఖ్యానించింది. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి స్కూలు పిల్లలను ఎక్కించుకొని వెళ్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదంది.


అవగాహన కల్పించాలి

ఎన్జీవోలు, ఇన్సూరెన్స్ కంపెనీలతో సహకారంతో మోటార్ వెహికిల్ చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పత్రికలు, టీవీలు, ఎఫ్ఎం రేడియోలు, సైన్ బోర్డులు, సినిమాహాళ్లలో ప్రకటనల ద్వారా చట్టనిబంధనలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని స్పష్టం చేసింది. వాహనదారులకు విధించిన చలాన్లు ఏవిధంగా వసూలు చేస్తారు? హెల్మెట్ వినియోగం, వాహన చట్టనిబంధనలు అమలు చేసేందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు? రోడ్లపై వాహనాలు తనిఖీ చేసేందుకు జిల్లాల వారీగా ఎన్ని బృందాలను ఏర్పాటు చేస్తారు? తదితర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని డీజీపీ కార్యాలయంలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ (లీగల్) ఆకె రవికృష్ణను ఆదేశించింది. తమ ఆదేశాలను తేలిగ్గా తీసుకోవద్దని కూడా స్పష్టం చేసింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మా ఆదేశాలు అమలు చేయడంలేదేం?

కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలు చేయకపోవడంతో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నిబంధనలు ఉల్లంఘించినవారికి జరిమానా విధించడంలేదని పేర్కొంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై వివరణ ఇచ్చేందుకు కోర్టు ముందు హాజరుకావాలని ఐజీ(ట్రాఫిక్)ను ఇటీవల విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశించింది. బుధవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. డీజీపీ కార్యాలయంలో ఐజీ(లీగల్)గా వ్యవహరిస్తున్న ఆకె రవికృష్ణ కోర్టు ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మాసనం ఐజీకి పలు ప్రశ్నలు సంధించింది. హెల్మెట్ తప్పనిసరి చేస్తూ తాము ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడంలేదని నిలదీసింది. ఐజీ బదులిస్తూ ఇకపై నిబంధనలు కఠినంగా అమలు చేస్తామన్నారు. జరిమానాలు వసూలు వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జరిమానాల వసూలులో పురోగతి ఉందని తెలిపారు.

లోకం తీరు



కొరియర్‌లో గంజాయి రవాణా

» ఢిల్లీకి పంపిన పార్శిళ్లు తిరిగిరావడంతో గుట్టురట్టు

మల్కాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పార్శిల్ సర్వీసు ద్వారా గంజాయి రవాణా చేస్తున్న వ్యవహారం విశాఖలో కలకలం రేపింది. శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లోని ఓ ఇంటిని కొంతమంది గ్లాజుల వ్యాపారం కోసమంటూ ఆరు నెలల కిందట అద్దెకు తీసుకున్నారు. అక్కడి నుంచే గంజాయి పార్శిల్స్‌ను డీటీడీసీ కొరియర్ ద్వారా ఢిల్లీకి పంపారు. వాటిపై చిరునామా సక్రమంగా లేకపోవడంతో వెనక్కివచ్చేశాయి. దీంతో కొరియర్ సిబ్బంది ఫోన్ చేసి పార్శిళ్లు వెనక్కి వచ్చిన విషయం చెప్పారు. ఆ పార్శిళ్లను పరిశీలించి, గంజాయి ఉందనే అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈలోగా పార్శిల్స్ తీసుకునేందుకు వచ్చిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. అందులో ఏముందో తనకు తెలియదని, ఎంఐజీ క్వార్టర్స్‌లోని కొంతమంది కొరియర్ చేయాలని ఇచ్చినట్టు అతడు చెప్పాడు. దీంతో మల్కాపురం, టూటౌన్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి క్వార్టర్స్‌లోని ఇంటిని పరిశీలించారు. ఎవరూ లేకపోవడంతో తలుపులు తెరిచిచూడగా, లోపల సుమారు 100 కేజీల గంజాయి మూటలు కనిపించాయి. దీంతో ఆ ఇంటిని సీజ్ చేశారు.



మర్రిపాడు మండలం వెంకటాపురంలో వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారులు

నెల్లూరు జిల్లాలో 'జికా' కలకలం

ఆరేళ్ల బాలుడికి వైరస్ లక్షణాలు

» పూణే వైరాలజీ ల్యాబ్‌కు నమూనాలు

» వెంకటాపురంలో వైద్య బృందం పర్యటన

మర్రిపాడు/నెల్లూరు(వైద్యం), ఆత్మకూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అమెరికా, ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న జికా వైరస్ నెల్లూరు జిల్లాలోని ఓ బాలుడికి సోకినట్టు తెలియడంతో వైద్య ఆరోగ్య శాఖ ఉలిక్కిపడింది. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బద్దల నాగరాజు, కల్యాణిల ఆరేళ్ల కుమారుడు సుబ్బారాయుడు 20 రోజుల క్రితం జ్వరం బారినపడటంతో అన్ని ఆసుపత్రుల్లో చూపించారు. ఎక్కడా నయం కాకపోవడంతో నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ బాలుడ్ని పరీక్షించిన వైద్యులు జికా వైరస్ అనే అనుమానంతో కొన్ని నమూనాలు తీసి ముంబయి ల్యాబ్‌కు పంపారు. అక్కడ జికా వైరస్‌గా నిర్ధారణ అయింది. దీంతో మంగళవారం సుబ్బారాయుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నై ఎగ్మోర్‌కు తరలించారు. మరోవైపు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా ఆ బాలుడి నుంచి నమూనాలు తీసి పూణే వైరల్ ల్యాబ్‌కు పంపించారు.

వెంకటాపురంలో వైద్యాధికారులు

జికా వైరస్ అన్న అనుమానంతో వైద్యాధికారులు వెంకటాపురంలో బుధవారం పర్యటించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాదరావు, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వెలెన్స్ అధికారి డాక్టర్ మౌనిక, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, ఏఎంవో నారాయణరావు, మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్ గ్రామంలో పర్యటించారు. బాలుడి ఇంటి చుట్టూ దోమల నిరాణ చర్యలు చేపట్టారు. చుట్టు పక్కల పరిసరాలను శుభ్రం చేశారు. బాలుడికి ఆ వైరస్ ఎలా సోకింది? తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి జ్వర పీడితుల నుంచి నమూనాలు సేకరించారు. ఆ బాలుడు కృష్ణాపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నట్లు గుర్తించి, అక్కడ పని చేస్తున్న కేరళ రాష్ట్రానికి చెందిన టీచర్లను విచారించారు. బాలుడికి జికా వైరస్ సోకి ఉండదని, ఒకవేళ సోకి ఉంటే ఇప్పటికే ఎక్కువ మందికి వ్యాపించి ఉండేదని వైద్యాధికారులు చెబుతున్నారు.

బాలుడికి మెరుగైన వైద్యం: ఆనం

వెంకటాపురం గ్రామంలో జికా వైరస్ లక్షణాలు బయటపడ్డ బాలుడికి వైద్యపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. వెంకటాపురం గ్రామంలో వైద్య బృందాలతో సర్వే నిర్వహించి పరీక్షలు చేయిస్తున్నామని, గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారని ఆనం పేర్కొన్నారు.

గనుల వెంకటరెడ్డిపై మరో కేసు!

(మొదటి పేజీ తరువాయి)

ఏసీబీ అనుమానిస్తున్న ధన్వంతరి అసోసియేట్స్‌పై కేసు పెట్టి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించబోతోంది. వివరాల్లోకి వెళితే.. నాటి సీఎం జగన్ ప్రచార యావ, బొమ్మల పిచ్చిని సొమ్ము చేసుకునేందుకు వెంకటరెడ్డి స్కెచ్ వేశారు. జగనన్న భూరక్ష పేరుతో గ్రామాల్లోని పొలాల సరిహద్దుల్లో రీ సర్వే రాళ్లు పాతి, వాటిపై జగన్ బొమ్మలు వేసేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ మైనింగ్ కార్పొరేషన్‌కు రాళ్ల సేకరణ బాధ్యత అప్పగించగా, వాటిని కటింగ్ చేసేందుకు చైనా నుంచి తక్కువ ధర పేరిట యంత్రాలు తెప్పించి రూ.కోట్లు కొట్టేసేందుకు వెంకటరెడ్డి పథకం వేశారు. రూ.3 కోట్లకు ఇక్కడ లభించే ఒక్కో రాళ్ల కటింగ్ మిషన్‌ను చైనా నుంచి రూ.8 కోట్లకు కొనేందుకు సిద్ధమయ్యారు. రెండు విడతలుగా 20 యంత్రాలు కొనుగోలు చేసి 160 కోట్లు చెల్లిస్తే, తమకు 100 కోట్లు మిగులుతుందని భావించారు. వాటి సరఫరాకు టెండర్లు పిలిచి నిబంధనలు అమలు చేస్తున్నట్లు పైకి నాటకమాడారు. వెంకటరెడ్డికి అత్యంత సన్నిహితుడు కృష్ణప్రసాద్‌కు చెందిన ధన్వంతరి అసోసియేట్స్‌తో పాటు మరో సంస్థ టెండర్లలో పాల్గొంది. ధన్వంతరికే టెండర్ దక్కేలా వెంకటరెడ్డి చక్రం తిప్పారు. మిషన్ల కొనుగోలుతో పాటు నిర్వహణ కూడా ధన్వంతరి చూసేలా అదనంగా చెల్లించేందుకు సిగ్నల్ ఇచ్చేశారు. వైద్య పరికరాలు సరఫరా చేసే అతి చిన్న సంస్థ అయిన ధన్వంతరి అసోసియేట్స్ వార్షిక టర్నోవర్ కనీసం కోటి కూడా లేదు. రాళ్ల విఎషన్లు సరఫరా చేసే ఆర్థిక స్థోమత కానీ, సాంకేతిక అర్హత కానీ లేవు. ఈ విషయాన్ని గుర్తించిన మైనింగ్ అధికారులు అభ్యంతరం చెప్పినా ఖాతరు చేయలేదు. చైనా సంస్థ ఇచ్చే ఇన్వాయిస్‌తో సంబంధం లేకుండా ధన్వంతరి ఇచ్చే బిల్లు ఏపీఎండీసీ ఆమోదించేలా అవకాశం కల్పించారు. సర్వే రాళ్ల కటింగ్ మిషన్లను చైనా కంపెనీ ఎంత ధరకు ధన్వంతరికి విక్రయించిందో బయట పడకుండా జాగ్రత్త పడ్డారు. వాటికి ఎలాంటి గ్యారెంటీ ఇవ్వబోమని చైనా కంపెనీ స్పష్టంగా చెప్పినా ధన్వంతరి గ్యారెంటీ ఇచ్చేందుకు సంసిద్ధత తెలిపింది. యంత్రాలు కొనుగోలు చేసే లోపే ఎన్నికల కోడ్ రావడంతో ధన్వంతరి అసోసియేట్స్‌కు అన్నిదారులూ మూసుకు పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విషయం వెలుగు చూసింది.



గ్లోబల్ టెండర్లు ఎందుకు పిలవలేదు?

ఇటీవల ఏసీబీ అధికారులు ఆరా తీయగా ఏపీఎండీసీ అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా ధన్వంతరికి టెండర్లు ఖరారు చేయడం వెనకున్న గుట్టు తెలిసింది. విజయవాడలోని ఏపీఎండీసీ కార్యాలయంలో సోదాల సందర్భంగా అన్ని విభాగాల అధికారులతో ఏసీబీ అధికారులు మాట్లాడారు. అప్పట్లో ఈ టెండర్లను వ్యతిరేకించిన అధికారులతో స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ బోస్.. వెంకటరెడ్డితో చేరి మొత్తం వ్యవహారాన్ని నడిపించినట్లు నిర్ధారణకు వచ్చారు. విదేశాల నుంచి యంత్రాలు తెప్పించాలంటే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గ్లోబల్ టెండర్లు ఆహ్వానిస్తాయి. దిగుమతిలోనూ ఇదే విధానాన్ని పాటించాలి. అయితే ఏపీఎండీసీ అప్పట్లో ఈ నిబంధన ఎందుకు ఉల్లంఘించింది? స్థానికంగా టెండర్ దక్కించుకున్న ధన్వంతరికి అర్హతలు ఉన్నాయా? అనేదానిపై ఏసీబీ ఆరా తీసింది. కొందరు అధికారులు అభ్యంతరం చెప్పినా రెండు యంత్రాలను చైనా నుంచి తెచ్చేశామంటూ ధన్వంతరి యజమాని కృష్ణప్రసాద్ డ్రామాకు తెరలేపినట్లు మైనింగ్ శాఖ నుంచి సమాధానం వచ్చింది. చెన్నై ఓడరేవుకు కంటైనర్‌లో చేరుకున్నాయని, వాటికి 16 కోట్లు చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. అందుకు కొందరు అధికారులు నిరాకరించగా, పోర్టులో జాప్యమయ్యే కొద్దీ అదనపు చార్జీలు చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. ముందస్తు పథకంలో భాగంగా కృష్ణప్రసాద్‌కు తక్షణమే 16 కోట్లు చెల్లించాలంటూ వెంకటరెడ్డి ఆదేశించారు. దీంతో అధికారులు టెండరు అగ్రిమెంట్‌ను బయటికి తీసి ఏపీఎండీసీ అడ్వాన్స్ ఇచ్చిన తర్వాతే ధన్వంతరి మిషన్లు కొని తీసుకురావాలనే నిబంధన చూపించారు. వారిపై వెంకటరెడ్డి చిందులు తొక్కారని విచారణలో తేలింది.

ఇసుక కేసులో బెయిలుపై..

వైసీపీ ప్రభుత్వంలో ఇసుక టెండర్లు, తవ్వకాల్లో భారీగా అక్రమాలకు పాల్పడి ఖజానాకు రూ.2,566 కోట్లు నష్టం కలిగించారన్న ఆరోపణలతో వెంకటరెడ్డిపై ఇప్పటికే ఏసీబీ కేసు నమోదు చేసింది. సహ నిందితులుగా అనిల్ ఆత్మారామ్ కామత్(జేపీవీఎల్), పి.అనిల్ కుమార్ (ప్రతిమా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్), ఆర్.వెంకటకృష్ణారెడ్డి(జేసీకేఎల్ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్)తో పాటు జేపీవీఎల్, ప్రతిమా సంస్థలను చేర్చింది. ఈ కేసులో ఇటీవలే కండీషన్ బెయిల్‌పై విడుదలైన వెంకటరెడ్డి వారానికి రెండుసార్లు ఏసీబీ కార్యాలయానికి వచ్చి సంతకం చేసి వెళ్తున్నారు.

బ్యాంకు గ్యారెంటీ వెనక్కి

ధన్వంతరి చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించకపోవడంతో కనీసం బ్యాంకు గ్యారెంటీ అయినా తిరిగి చెల్లించాలని కోరింది. అడిగిందే ఆలస్యం అన్నట్లు వెంకటరెడ్డి ధన్వంతరి గ్యారెంటీగా చెల్లించిన 26 లక్షల రూపాయలను వెనక్కి ఇప్పించేశారు. ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన ఏసీబీ అధికారులు టెండర్ రద్దు కాకుండా బ్యాంకు గ్యారెంటీ తిరిగి ఇవ్వడానికి వీల్లేదని గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా వెంకటరెడ్డి చెప్పినట్లు ఆడిన ప్రొక్యూర్మెంట్ జీఎం బోస్‌తో పాటు డబ్బులు వెనక్కి చెల్లించిన మేనేజర్ సంతోష్ పాత్రపైనా ఆధారాలు సేకరించింది.

సరఫరాకు ముందే 85% బిల్లుల చెల్లింపు

» 'ఆయుష్‌లో మందుల మాయం'పై మరిన్ని విషయాలు వెలుగులోకి

» విజిలెన్స్ విచారణకు డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆయుష్ విభాగంలో మందుల మాయం వ్యవహారానికి సంబంధించి మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ.20 కోట్ల విలువైన మందుల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలను పూర్తిగా గాలికి వదిలేశారు. మందులు సరఫరా చేయకముందే ఆ కంపెనీకి 85 శాతం బిల్లులు చెల్లించేశారు. ప్రస్తుత విచారణలో దాదాపు ఆరు వేలకుపైగా ఇన్‌వాయిస్‌లను అధికారులు పరిశీలించి..చిన్ని చిన్న మొత్తంలోనే తేడాలున్నట్లు గుర్తించారు. అయితే, క్షేత్రస్థాయిలో కోట్లలోనే మందులు మాయమైనట్లు వైద్యులు చెబుతున్నారు. ఏదైనా కంపెనీకి ఆర్డర్ ఇచ్చినప్పుడు ఆయుష్ కమిషనరేట్ ప్రత్యేక కమిటీలను నియమిస్తుంది. ఆయుష్ అధికారులు ఏ కంపెనీకి అయితే మందులు సరఫరా ఆర్డర్ ఇస్తారో.. ఆ కంపెనీకి మాన్యుఫాక్చర్ యూనిట్ కచ్చితంగా ఉండాలి. ఆ యూనిట్‌కు కమిటీ వెళ్లి తనిఖీలు చేయాలి. గోవా కంపెనీకి రూ.18 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు మందుల సరఫరా ఆర్డర్ ఇచ్చే ముందు ఈ ప్రక్రియ జరగలేదు. 2023 సెప్టెంబరు-అక్టోబరు మధ్యలో మందుల ఆర్డర్ ఇచ్చేసి, కేవలం నెల రోజుల్లో బిల్లులు చెల్లించినట్లు సమాచారం. దీనిపై విచారణాధికారులు దృష్టిపెట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. లోతైన విచారణ లేదా స్వయం ప్రతిపత్తి సంస్థ ద్వారా విచారణ చేస్తే పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

విచారణ జరుపుతున్నాం: డిప్యూటీ డైరెక్టర్

మందుల కొనుగోలు వ్యవహారంపై సెక్రటరీ స్థాయి అధికారితో విచారణ జరుపుతున్నామని ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ ధనుంజయరావ్ వివరణ ఇచ్చారు. 'ఆయుష్‌లో మందుల మాయం' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. విచారణలో భాగంగా కమిటీలు వేశామని, కొన్ని కమిటీలు ప్రధాన కార్యాలయంలోబిల్లులు తనిఖీ చేశాయని, మరికొన్ని కమిటీలు డిస్పెన్సరీ స్థాయికి వెళ్లి బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశాయని తెలిపారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ నుంచి కూడా నివేదిక తెప్పించుకున్నారని, దర్యాప్తు పూర్తి చేసి త్వరలో నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

తిరుమలలో అడ్డగోలు నిర్మాణాలను నియంత్రించాలి



» తిరుపతిలో ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణంపై పూర్తి వివరాలు సమర్పించండి

» రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఇష్టారీతిన జరుపుతున్న నిర్మాణాలను నియంత్రించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. తిరుమల కొండ పాదాల చెంత తిరుపతిలో ఎలాంటి అనుమతులూ లేకుండా ఒబెరాయ్ గ్రూపు 5 స్టార్ హోటళ్ల నిర్మాణం చేస్తోందంటూ దాఖలైన పిల్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులుగా ఉన్న పర్యాటక శాఖ ప్రత్యేక సీఎస్, టీటీడీ ఈవో, తుడా వైస్ ఛైర్మన్‌లకు నోటీసులు జారీ చేసింది. ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్ ఎండీ, అదే గ్రూపునకు చెందిన ముంతాజ్ హోటల్స్, ట్రైడెంట్ ఫైవ్‌స్టార్ హోటల్ మేనేజింగ్ డైరెక్టర్లకు కూడా నోటీసులిచ్చింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. పనులను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. తిరుపతి జిల్లా తిరుపతి మండలం పేరూరు గ్రామం పరిధిలో ఒబెరాయ్ గ్రూప్ హోటళ్లను నిర్మించేందుకు 2021 నవంబరులో అప్పటి జగన్ ప్రభుత్వం జారీచేసిన జీవో 24ని రద్దు చేయాలని కోరుతూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్, ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీ శ్రీనివాసానంద స్వామీజీ, మరొకరు వేర్వేరుగా దాఖలు చేసిన పిల్స్ బుధవారం విచారణకు వచ్చాయి. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తిరుమలలో వసతి గృహాలు తప్ప హోటళ్ల నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదంటూ ప్రభుత్వం జీవో ఇచ్చిందని, అయితే అందుకు విరుద్ధంగా తిరుమల కొండ పాదాల చెంత ఒబెరాయ్ గ్రూప్ హోటళ్ల నిర్మాణం చేపడుతోందని తెలిపారు. తిరుపతిలో హోటళ్ల నిర్మాణానికి భూకేటాయింపులు చేస్తూ పర్యాటక శాఖ జీవో ఇచ్చిందని పర్యాటక శాఖ తరఫున జీపీ వై.బాలాజీ తెలిపారు. హోటళ్ల నిర్మాణం జరుపుతున్న ప్రదేశం తిరుమల పరిధిలోకి రాదని టీటీడీ తరఫు స్టాండింగ్ కౌన్సిల్ వీఆర్ఎన్ ప్రశాంత్ పేర్కొన్నారు.

పరిటాల రవి హత్య కేసులో.. ఐదుగురు దోషులకు బెయిల్

మాజీ మంత్రి దివంగత పరిటాల రవి హత్య కేసులో ఐదుగురు దోషులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దోషులు పి.నారాయణ రెడ్డి(ఏ3), రేఖమయ్య(ఏ4), బజన రంగనాయకులు(ఏ5), వడ్డే కొండ(ఏ6), ఓబిరెడ్డి(ఏ8)లకు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. అనంతపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సంతృప్తి మేరకు రూ.25 వేలతో ఒక్కొక్కరూ రెండు పూచీకత్తులు సమర్పించాలని స్పష్టం చేసింది. ప్రతి సోమవారం ఉదయం 11 గంటలకు పిటిషనర్లు సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ ముందు హాజరయ్యేలా చూడాలని మేజిస్ట్రేట్‌కు సూచించింది. న్యాయాధికారి విధించిన షరతును ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేస్తామని తెలిపింది. క్షమాభిక్ష కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. వారు దరఖాస్తులను 4 వారాల్లో పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ టి.మల్లికార్జునరావుతో కూడిన ధర్మాసనం ఈ నెల 13న ఉత్తర్వులు ఇచ్చింది. అనంతపురంలో 2005 జనవరి 24న పరిటాల హత్యకు గురయ్యారు. ఈ కేసులో మొత్తం 16 మంది నిందితులు. ఏ-1గా ఉన్న మొద్దు శీను, ఏ-2 మద్దెలచెరువు సూరి, మరో నిందితుడు తగరకుంట కొండారెడ్డి.. కేసు విచారణ సమయంలో హత్యకు గురయ్యారు. ఒక నిందితుడు అప్రూవర్‌గా మారగా.. మరో నలుగురుని అనంతపురం కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. మిగిలిన 8 మందికి జీవిత ఖైదు విధిస్తూ అనంతపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 2011 ఆగస్టులో తీర్పు ఇచ్చింది. అదే ఏడాది ఈ తీర్పుపై వారు హైకోర్టులో అప్పీల్ వేశారు. తాజాగా వాటికి అనుబంధ పిటిషన్లు వేసి, శిక్ష అమలును సస్పెండ్ చేసి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. విచారణ జరిపిన ధర్మాసనం.. వారికి ట్రయల్ కోర్టు విధించిన శిక్ష అమలును నిలుపుదల చేస్తూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

బలపడిన అల్పపీడనం

- రాష్ట్రంలో ముసురు వాతావరణం.. పలుచోట్ల వర్షాలు, చలిగాలులు
- నేడు ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా తీవ్ర అల్పపీడనం రాక
- ఉత్తర కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు
- వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం బుధవారానికి బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది వాయువ్యంగా పయనిస్తూ గురువారం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరం వైపు రానుంది. తర్వాత 24 గంటల్లో ఉత్తరంగా పయనిస్తూ శుక్రవారానికల్లా కోస్తా తీరం వెంబడి పయనిస్తుందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ క్రమంలో కోస్తాలో తీరం దాటుతుందా? లేక సముద్రంలో ఇంకా బలపడుతుందా? లేదా భూ ఉపరితలం మీదుగా బలహీనపడుతుందా అనేది ఇంకా వెల్లడించలేదు. అయితే నైరుతి బంగాళాఖాతంలో ఉన్న అల్పపీడనం ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి కోస్తాలో వర్షాలు మొదలయ్యాయి. బుధవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం కొనసాగింది. బుధవారం రాత్రి విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో గురువారం కోస్తాలో అనేకచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, శ్రీకాకుళం, అల్లూరి, కోనసీమ, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది. ఈ నెల 20వ తేదీన ఉత్తర కోస్తాలో అనేకచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. తీవ్ర అల్పపీడనం కోస్తా వైపు రానున్న క్రమంలో గురువారం కోస్తా తీర ప్రాంతాల్లో, 20, 21 తేదీల్లో ఉత్తరాంధ్ర మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

శ్రీసిటీ నుంచి 1,00,000వ మేడిన్ ఇండియా వాహనం

- మైలురాయిని అధిగమించిన ఇసుజు మోటర్స్ ఇండియా



లక్షవ ఇసుజు వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఇసుజు మోటర్స్ ఇండియా పరిశ్రమ తమ ప్లాంట్‌లో తయారైన లక్షవ మేడిన్ ఇండియా వాహనాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా బుధవారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, టీహెచ్‌కే డిప్యూటీ ఎండీ, శ్రీసిటీ జపనీస్ కంపెనీగ్రూప్ ఛైర్మన్ సాడో గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ప్లాంట్‌లో లక్షవ వాహనం విడుదల పట్ల ఐఎంఐ అధ్యక్షుడు, ఎండీ రాజేష్ మిట్టల్ సంతోషం వ్యక్తంచేశారు. దేశ తయారీ నైపుణ్యం, ప్రపంచ పోటీతత్వానికి సాక్ష్యం ఈ కార్యక్రమమని యువరాజ్ అభివర్ణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీడీ భరత్ అభినందన సందేశాలను చదివి వినిపించారు.

హైస్కూల్ ప్లస్‌లకు స్వస్తి!

- వాటి స్థానంలో జూనియర్ కాలేజీలు
- ఉన్నత పాఠశాలల ప్రాంగణాల్లోనే ఏర్పాటు
- కొత్తగా కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల నియామకం
- కో-ఎడ్యుకేషన్ విధానం అమలు
- ప్రతి మండలానికి ఓ కాలేజీ ఉండేలా చర్యలు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన హైస్కూల్ ప్లస్‌లపై కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైస్కూల్ ప్లస్‌లను రద్దు చేసి ఆ స్థానంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లు ఉన్నత పాఠశాలల ప్రాంగణాల్లో ఉన్నాయి. వాటికి బదులుగా తీసుకొస్తున్న జూనియర్ కాలేజీలను అక్కడే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుతం ఉన్నట్లుగా కేవలం బాలికల కోసమే కాకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి కో-ఎడ్యుకేషన్ విధానం అమలు చేయనుంది. ప్రతి మండలానికి ఓ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉండాలనే నిర్ణయానికి అనుగుణంగా ఈ రూపంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

విఫలమైన హైస్కూల్ ప్లస్‌లు

ప్రత్యేకంగా బాలికల కోసం ప్రతి మండలంలో ఓ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామని సీఎంగా ఉన్నప్పుడు జగన్ హామీ ఇచ్చారు. అయితే కొత్త కాలేజీలు ప్రారంభించకుండా ఉన్నత పాఠశాలల్లోనే బాలికల కోసం ఇంటర్మీడియెట్ కోర్సులు మొదలు పెట్టారు. వీటికి హైస్కూల్ ప్లస్‌గా పేరు పెట్టి 2022లో 292 ఉన్నత పాఠశాలల్లో ప్రారంభించారు. ఆ తర్వాత మరో 210 పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌లు మంజూరుచేశారు. కానీ రెండో విడత మంజూరు చేసిన వాటిలో మొత్తం ప్రారంభం కాలేదు. మొత్తం 481 పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభంకాగా వాటిలో 130 పాఠశాలల్లో ఒక్క అడ్మిషన్ కూడా లేదు. దీంతో ప్రస్తుతం 351 హైస్కూల్ ప్లస్‌లు పనిచేస్తున్నాయి. వీటిలో జూనియర్ లెక్చరర్లను నియమించకుండా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్లుగా పదోన్నతి కల్పించి వారిని నియమించారు. మరోవైపు ఒక్క హైస్కూల్ ప్లస్‌లోనూ ల్యాబ్‌లు లేవు. ఫలితంగా మొదటి ఏడాది కేవలం 12% మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీంతో హైస్కూల్ ప్లస్‌లు ఫెయిల్ అనే భావన పెరిగింది. వాటివల్ల ప్రయోజనం లేకపోగా విద్యార్థినులు పెద్ద సంఖ్యలో ఫెయిల్ కావడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

సీనియర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి

హైస్కూల్ ప్లస్‌లు బాలికల కోసమే ప్రారంభించారు. ఇప్పుడు ఏర్పాటు చేసే జూనియర్ కాలేజీలను కో-ఎడ్యుకేషన్‌గా మారుస్తున్నారు. అలాగే కాంట్రాక్టు విధానంలో కొత్తగా తీసుకొనే జూనియర్ లెక్చరర్లను అక్కడ నియమిస్తారు. పాఠశాలల నుంచి పదోన్నతిపై వచ్చి జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్నవారిలో సీనియర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పించి ఈ జూనియర్ కాలేజీల్లో నియమిస్తారు. అలాగే వచ్చే ఏడాది నాటికి ల్యాబ్‌లు ఏర్పాటుచేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే హైస్కూల్ ప్లస్‌లలో పనిచేస్తున్న పీజీటీలను తిరిగి ఉన్నత పాఠశాలలకు పంపే అవకాశం ఉంది. ఈ కొత్త నిర్ణయాలతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని విద్యాశాఖ అంచనా వేస్తోంది.

190 మండలాల్లో కొత్త కాలేజీలు

ప్రస్తుతం 475 మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. మిగిలిన 190 మండలాల్లో ఈ కొత్త కాలేజీలు ఏర్పాటుకానున్నాయి. దీంతో ప్రతి మండలంలో ఒక జూనియర్ కాలేజీ ఏర్పాటుచేసినట్లు అవుతుంది. అలాగే డిమాండ్ ఆధారంగా కొన్ని మండలాల్లో ఒకటి కంటే ఎక్కువ కూడా ఉండేలా చూస్తారు. అయితే విద్యార్థులు లేని, ఉత్తీర్ణత శాతం అతి తక్కువగా ఉన్న, సమీపంలోనే ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉన్న చోట్ల కొనసాగుతున్న హైస్కూల్ ప్లస్‌లను పూర్తిగా ఎత్తేస్తారు. వాటిని ఇక జూనియర్ కాలేజీలుగా మార్చరు. ప్రస్తుతం పనిచేస్తున్న 351 హైస్కూల్ ప్లస్‌లలో సుమారు 90 ఎత్తేసే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన వాటిని పూర్తిగా జూనియర్ కాలేజీలుగా మార్చి ఉన్నత పాఠశాలల్లోనే కొనసాగిస్తారు.

వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీగా పుట్టగుంట సతీశ్



విజయవాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జాతీయ ట్రస్టీగా విజయవాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ పుట్టగుంట వెంకట సతీశ్‌కుమార్ నియమితులయ్యారు. వీహెచ్‌పీ జాతీయ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే ఆదేశాల మేరకు ఆయన్ను ఈ పదవిలో నియమించారు. బుధవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు సతీశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ పదవిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోకరాజు గంగరాజు, పుల్లారెడ్డి స్వీట్స్ అధినేత పుల్లారెడ్డి, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ నిర్వహించారు. జాతీయ ట్రస్టీ హోదాలో సతీశ్ మూడేళ్లు ఉంటారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ డిపార్టుమెంటు
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.49 టు 51/TO/O&M/2024-25, తేది:17.12.2024

పర్యవేక్షక ఇంజనీరు, రూరల్ వాటర్ సప్లై & శానిటేషన్ సర్కిల్, ఏలూరు పరిధిలో O&M నిధుల నుండి మంజూరైన **3 పనులకు అంచనా విలువ:** రూ. 309.00/- 97.00 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **టెండర్ల స్వీకరణ తేది:** 19.12.2024 నుండి 04.01.2025 మ.03.00 గం.ల వరకు. తదుపరి వివరాలను **www.tender.apeprocurement.gov.in** లో పొందవచ్చును. ఫోన్: 9100121205

సం/- పర్యవేక్షక ఇంజనీరు, రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ సర్కిల్, ఏలూరు

DIPR R.O. No.14903/CL/ADVT/1/1/2021-22, తేది. 18.12.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.02/టి.ఓ/24-25 తేది:16.12.2024

కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ (ఐ) డివిజన్, నరసాపురము, పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయము నుండి వివిధ నిధుల నందు మంజూరైన **18 పనులకు అంచనా విలువ:** రూ. 159.50 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **టెండర్ల స్వీకరణ తేది:** 21.12.2024 నుండి 04.01.2025 మ. 03.00 గం.ల వరకు. ఇతర వివరాలను **www.apeprocurement.gov.in** లో పొందవచ్చును.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ (ఐ) డివిజన్, నరసాపురము

DIPR R.O. No.14910/CL/ADVT/1/1/2021-22, తేది. 18.12.2024

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ

NIT No.07/MDR-SDMF/ENC(MDR)/2024 **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది:17.12.2024

SDMF క్రింద అల్లూరి సీతారామరాజు జిల్లాలో **రూ.7.80 కోట్ల** మొత్తానికి 2 నం.ల పనులు & ఏలూరు జిల్లాలో **రూ.6.97 కోట్ల** మొత్తానికి 3 నం.ల పనుల కొరకు ఇ-ప్లాట్‌ఫామ్ క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా **www.apeprocurement.gov.in**లో 20.12.2024 మ.03.00 గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B) MDRs

DIPR RO No.14902/CL/ADVT/1/1/2021-22, Dt.18.12.2024

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో ప్రమాదం

- ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- కూలర్ మరమ్మతులు చేస్తుండగా కార్మికులపై పడిన వేడి పౌడర్



మృతుడు శివకేశవ(ఫైల్)

తాడిపత్రి/యాడికి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వేడి వేడి పౌడర్ మీద పడటంతో ఒకరు మృతి చెందగా, ఐదుగురు షణ్ముఖానందరెడ్డి, కంబగిరి రాముడు, ధర్మన్ సింగ్, వికాస్, దీపక్ తీవ్రంగా గాయపడ్డారు. సిమెంట్ ఫ్యాక్టరీ లైన్-2లో ఉన్న కోల్‌మిల్లులో 8 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కోల్‌మిల్లు సమీపంలోని కూలర్ చెడిపోయిందని, దానికి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగిందని కార్మికులు తెలిపారు. మరమ్మతులు చేస్తున్న సమయంలో కోల్ మిల్లులో అమర్చిన ఇటుకలు ఊడిపడ్డాయని, కూలర్‌కు రంధ్రాలు పడి.. అందులో ఉన్న పౌడర్ కార్మికుల మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కార్మికుల మీద పడిన పౌడర్ సుమారు 400 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగి ఉంటుందని సమాచారం. ఈ ప్రమాదంలో పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన శివకేశవ(28) అక్కడికక్కడే మృతి చెందారు. యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన షణ్ముఖానందరెడ్డి, చింతలాయపల్లి గ్రామానికి చెందిన కంబగిరిరాముడు, బిహార్‌కు చెందిన ధర్మన్‌సింగ్, దీపక్, వికాస్ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉన్న హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం తరలించారు.

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP07TW4999	TATASE 1613 TURBO FBT-T	2009
AP39UC0426	TATA YODHA PICK UP BS6	2021
AP40AB8426	EICHER 551	2023
AP37TE4811	SWARAJ 843 XM	2015
AP39UC3332	EICHER PRO 2049 BS6 FBT	2022
AP40AG7695	SONALIKA DI 30	2023
AP39SC0930	SWARAJ 843 XM	2022
AP16DP9184	JOHN DEERE 5310 HARVESTER	2017
AP07DE1927	JOHN DEERE 5310 HARVESTER	2016
AP39JD4139	EICHER 551	2021
AP15AT9817	JOHN DEERE 5310 HARVESTER	2010
AP28TC9987	TATA LPT 1109 FBT	2012
AP05TD2900	AL DOST	2015
AP05TG1782	TATA LPT 2518 CUMMINS FBT-T	2016

AUCTION PLACE :
SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102, GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, A.P.
AUCTION DATE :19-12-2024
AUCTION START :10:00 AM
Cont : **SHRIRAM FINANCE LIMITED**
D No:- 27-12-34, BSN REDDY COMPLEX
3rd Floor,Gudavallivari Street
VIJAYAWADA, 0866-2579197
9704184786, 9949911574

Khadi India

ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమీషన్
విజయవాడ
స్కిల్డ్ వర్కర్ కొరకు ఖాళీ

రాష్ట్ర కార్యాలయం, ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల కమిషన్, విజయవాడ తరఫున పనిచేస్తున్న ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, విజయరాయి, రాష్ట్ర తేనెటీగల పెంపకం విస్తరణ కేంద్రం కొరకు స్కిల్డ్ వర్కర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరబడుచున్నవి.

ఉద్యోగం పేరు	స్కిల్డ్ వర్కర్
ఖాళీ	ఒకటి
పని చేయు ప్రదేశం	రాష్ట్ర తేనెటీగల పెంపకం విస్తరణ కేంద్రం, KVIC, విజయరాయి, పెదవేగి మండలం ఏలూరు జిల్లా, ఆం.ప్ర
వేతనం	నెలకు రూ.15,000/-
అర్హత	1) 12వ తరగతి ఉత్తీర్ణత, 2) తేనెటీగల పెంపకంలో అనుభవం
ఎంపిక విధానం	నేరుగా ఇంటర్వ్యూ
దరఖాస్తుకు చివరి తేది	08-01-2025

గమనిక: CBRTI, పూణే లేదా KVIC యొక్క ఏదైనా SBEC శిక్షణా కేంద్రంలో కనీసం ఒక నెల శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఈ ఉద్యోగం **31-03-2025** వరకు మాత్రమే ఉంటుంది. అర్హత కలిగిన అభ్యర్థులు వారి పేరు, చిరునామా, వయస్సు, ఆధార్ నంబర్, అర్హత, అనుభవం మరియు సంప్రదింపు నంబర్‌తో పాటు రెండు పాస్‌పోర్ట్‌లతో పాటు దిగువ చిరునామాకు ది.**08-01-2025** న లేదా ఆలోగా దరఖాస్తు చేసుకోగలరు.

రాష్ట్ర డైరెక్టర్ : **ఖాదీ & గ్రామీణ పరిశ్రమల కమీషన్,**
రామినేని వారి వీధి, పటమట, విజయవాడ - 520 010. ఆంధ్రప్రదేశ్
ఫోన్ నం. 0866-2471725, 2473525
email : sovijayawada.kvic@gmail.com

భారత ప్రభుత్వము
పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ
ప్రాంతీయ కార్యాలయం, చెన్నై యొక్క ఉప కార్యాలయం
గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాల్ రెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్.
ఇ-మెయిల్ : iro.vijayawada-mefcc@gov.in

తేది: 11 డిసెంబర్ 2024

ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని NH-716 నందు కి.మీ 0.000 నుండి కి.మీ. 121.935 వరకు నిర్మించనున్న నాలుగు వరుసల జాతీయ రహదారి కడప - రేణిగుంట రోడ్డు కోసం వైఎస్సార్ (44.69 హెక్టార్లు), అన్నమయ్య (18.18 హెక్టార్లు), తిరుపతి (36.97 హెక్టార్లు) డివిజన్ లలో 99.84 హెక్టార్ల విస్తీర్ణం గల అటవీ భూమి మార్పు కొరకు, ఫారెస్ట్ క్లియరెన్స్ (ఎఫ్ సి) స్టేజ్-I ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్‌హెచ్‌ఎఐ, పిఐయు, తిరుపతి పేరిట 11.12.2024 న మంజూరు చేయుట జరిగింది.

వాన్ (సంరక్షణ్ ఈవా సంవర్ధన్) అధినియం, 1980 యొక్క సెక్షన్ 2(1) ప్రకారం ఫారెస్ట్ క్లియరెన్స్ (ఎఫ్ సి) స్టేజ్-I. మంజూరు చేయుట జరిగింది.

ప్రతిపాదన నెం : FP/AP/ROAD/489551/2024

మరిన్ని వివరాల కోసం www.parivesh.nic.in ను సందర్శించండి

ప్రాజెక్టు డైరెక్టర్,
ఎన్‌హెచ్‌ఎఐ, పిఐయు - తిరుపతి

OFFICE OF THE RECOVERY OFFICER - II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam - 530020.

DEMAND NOTICE

(NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME-TAX ACT, 1961)

R.P.No.1016 of 2018 in OA No.378 of 2015

City Union Bank, Vijayawada Branch, Vijayawada, Krishna District.
Versus
M/s.Kanayalal & Sons a proprietorship concern and others

To

1) **M/s. Kanayalal & Sons a Proprietorship Concern,** Rep. by its Proprietor Sri Kamal K. Sawlani, S/o. Kanayalal G. Sawlani, having its business premises at Shop No.11 and 12, Kishore Cloth Market, Opp. to Seshamahal, Tarapet, Vijayawada, Krishna District. CDR-1
2) **M/s. Modern Marketing a Proprietorship Concern,** Rep. by its Proprietor Sri Kanayalal G. Sawlani, S/o. Ghanasyam Das Sawlani, having its business premises at D.No. 27-20-24, Museum Road, Governorpet, Vijayawada, Krishna District. CDR-2
3) **M/s. Rice and Rice a Proprietorship Concern,** Rep. by its Proprietor Smt. Pushpa K. Sawlani, W/o. Kanayalal G. Sawlani, having its business premises at Shop No.3 and 4, D.No.27-20-24, Museum Road, Governorpet, Vijayawada, Krishna District. CDR-3
4) **M/s. K.L. Enterprises, a Proprietorship Concern,** Rep. by its Proprietor Smt. Kavitha K. Sawlani, W/o. Kamal K. Sawlani having its business premises at Shop No.11 and 12, Kishore Cloth Market, Opp.to Seshamahal, Tarapet, Vijayawada, Krishna District. CDR-4
5) **Sri Kamal K. Sawlani, S/o. Kanayalal G. Sawlani,** Residing at Flat No.206, Royal Residency, B-Block, D.No.32-4-5, Anjama Street, Moghalrajpuram, Vijayawada, Krishna District. CDR-5
6) **Smt. Kavitha Sawlani, W/o. Kamal K. Sawlani,** Residing at Flat No.206, Royal Residency, B-Block, D.No.32-4-5, Anjama Street, Moghalrajpuram, Vijayawada, Krishna District. CDR-6
7) **Smt. Pushpa K. Sawlani, W/o. Kanayalal G. Sawlani,** Residing at Flat No.206, Royal Residency, B-Block, D.No.32-4-5, Anjama Street, Moghalrajpuram, Vijayawada, Krishna District. CDR-7
8) **Sri Kanayalal G. Sawlani, S/o. Ghansyam Das Sawlani,** Residing at Flat No.206, Royal Residency, B-Block, D.No.32-4-5, Anjama Street, Moghalrajpuram, Vijayawada, Krishna District. CDR-8

In view of the Recovery Certificate Dt. 05.06.2018 issued in O.A.No.378 of 2015 passed by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam an amount **Rs.85,96,214/- (Rupees Eighty Five Lakhs Ninety Six Thousand Two Hundred and Fourteen Only)** towards the loan limit of 1st defendant under the Loan Account Number 869209, 871662, 882222, 885281, 909333, 918346, 920962, 920989, 926145, 926149, 926154, 929216, 932901 and 937596 along with pendentlite and future interest @ 17% p.a. with monthly rests, Rs,22.65,033/- towards the loan limit of 1st Defendant under the Loan Account Number 1231287 along with pendentlite and future interest @16.75% p.a. with monthly rests, Rs.27,1 1,881.50 ps. towards the loan limit of 1st Defendant under Loan Account Number 139554 along with pendentlite and future interest @19.5% p.a with monthly rests, Rs.18,88,664/- towards the loan limit of 2nd Defendant under Loan Account Number 1231299 along with pendentlite and future interest @17% p.a. with monthly rests, Rs.2,12.19,434/- towards the loan limit of 3rd Defendant under Loan Account Number 1997937 along with pendentlite and future interest @ 16.5% p.a. with monthly rests, Rs.55,51,979.26 ps. towards the loan limit of 3rd Defendant under Loan Account 184255 along with pendentlite and future interest @19.5% p.a with monthly rests, Rs.1,46,16,482/- towards the loan limit of 3rd Defendant under Loan Account Number 2481364 along with pendentlite and future interest @18% p.a. with monthly rests, Rs.20,14,531/- towards the loan limit of 4th Defendant under Loan Account Number 1231294 to the applicant bank along with pendentlite and future interest @17% p.a. with monthly rests on the above said amount due against you from **25.05.2015** till the date of payment / realization with costs of **Rs.1,85,000/-** is due against you.

You are hereby called upon to deposit the above sum within 15 days of the receipt of the notice. failing which the recovery shall be made as per rules.

In addition to the sum aforesaid, you will be liable to pay.

(a) such interest as is payable for the period commencing immediately after this notice of the execution proceedings;

(b) all costs, charges and expenses incurred in respect of the service of this notice and other process that may be taken place for recovering the certificate amount due.

(Given under my hand and the Seal of this Tribunal at Visakhapatnam on the 12th November, 2021)

(B.N.S.V.S.K. BANGARRAJU)
Recovery Officer,
Debts Recovery Tribunal, Visakhapatnam.

దక్షిణ మధ్య రైల్వే

ఇ-టెండరు ప్రకటన PUB/T/253/24

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (నిర్వహణ), గుంటూరు వారు GEM పోర్టల్ **https://gem.gov.in** ద్వారా దిగువ టెండర్లు ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం: 01. టెండరు పేరు: 03 సంవత్సరాల కాలానికి గుంటూరు డివిజన్‌లో SSE/E/M/NLDA యొక్క అధికారి పరిధిలో అసెట్ల ఫెయిల్యూర్ అటెన్షన్ మెయింటెనెన్స్ కొరకు ప్రతి నెలా 2500 కి.మీ.ల నడుపుట కొరకు క్యాబిన్‌లో 5 సీటర్‌తో 2 టన్ సామర్థ్య GVW యొక్క MUV అద్దె. టెండరు నిర్దేశం నం: GEM/2024/B/5710706 తేది : 16.12.2024. **సుమారు విలువ:** రూ. 22,51,440.00 **బయానా:** రూ.45,100.00/- **టెండరు ఫారం ధర (వాపసు రానిది):** రూ.0.

ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది మరియు సమయం: 07.01.2025న 12:00 గం. వరకు.

ఏదేని తదుపరి సమాచారం/ సవరణ ఇ-పోర్టల్ https://gem.gov.in లో మాత్రమే ప్రచురించబడును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/M/ గుంటూరు

టెండరు ప్రకటన నం.CRS-E-24-24-25 PUB/T/253/24

భారత రాష్ట్రపతి తరఫున Dy. CME/CRS/TPTY వారు పేర్కొన్న ముగింపు తేదిన 11.00 గం.ల వరకు పేర్కొన్న టెండరు నం.లకు ఎదురుగా ఇ-టెండర్లు కోరుచున్నారు. బిడ్డర్లు తమ ఒరిజినల్/రివైజ్డ్ బిడ్లను ముగింపు తేది & సమయం వరకు మాత్రమే దాఖలు చేయవలసి ఉంటుంది. ఈ టెండరుకు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు. అట్టి మాన్యువల్ ఆఫర్లు స్వీకరించినప్పటికీ తిరస్కరించబడును.

క్ర.సం. 1. పని వివరణ: టెండరు నం. CRS-E-24-24-25: 8 నెలల కాలానికి తిరుపతి, క్యారేజ్ రిపేర్ షాప్ వద్ద నాన్-ఎసి, ఆర్‌పి కోచ్‌లలో ఫ్లేమ్‌లెస్ కుకింగ్ ఏర్పాటు. **సుమారు వ్యయం :** రూ.25,46,915/-, **బిడ్ సెక్యూరిటీ:** రూ. 50,900/-, **పూర్తి చేయు కాలం :** 08 నెలలు. **ముగింపు తేది :** 06.01.2025న 11.00 గం.లకు.

వెబ్‌సైట్ వివరాలు : www.ireps.gov.in:

టెండరు పూర్తి వివరాలు చూచుటకు నోటీసు బోర్డు ఉంచిన ప్రదేశం: అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి వారి కార్యాలయం.

తదుపరి టెండర్ నియమాలు / వివరాల కొరకు (టెండర్ డాక్యుమెంట్లలో అందుబాటులో ఉన్నాయి) మరియు టెండర్ డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్, సవరణ కొరకు, దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ని సందర్శించగలరు

అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/CRS/తిరుపతి

బహిరంగ టెండరు ప్రకటన నం.B-E29-TRD-TNDR-17-24-25, తేది:17.12.2024 PUB/T/256/24

దిగువ సంతకందారు దిగువ పనులకు IREPS లో టెండర్లు కోరడమైనది.

టెండరు నం.: B/E29-TRD-TNDR-17-2024-25, పని పేరు: GLU: "BZA డివిజన్ యొక్క GLU రైల్వే స్టేషన్ వద్ద డౌన్‌లైన్‌పై అదనపు లూప్‌లైన్‌తో డబుల్ లైన్‌పై స్టాండర్డ్ లేఅవుట్ ఏర్పాటు కొరకు ప్రతిపాదనకు సంబంధించిన నూతన లైన్ ప్రతిపాదిత విద్యుదీకరణ. **సుమారు విలువ:** రూ.2,42,80,549.95, **పూర్తి చేయు కాలం:** 12 నెలలు, **బిడ్ సెక్యూరిటీ (EMD):** రూ.2,71,400/-, **ముగింపు తేది:** 06.01.2025న 15.00 గం.లకు. **క్ర.సం 1, టెండర్ ఫారమ్ ధర (రూ.):** లేదు

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/TRD/విజయవాడ

A1603

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

మున్సిపాలిటీల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు

మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 123 మున్సిపాలిటీల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్వారీ సెంటర్‌లో రూ.95.85 లక్షల వ్యయంతో నిర్మించిన పెట్రోల్ బంకును మంత్రి పి.నారాయణ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి బుధవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ బంకు నిర్వహణలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఉపాధి కల్పించే విధంగా వారిని విధుల్లోకి తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ సీనియర్ మేనేజరు ప్రశాంత్ చౌహాన్, ఐఓసీఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ఆర్‌ఎంసీ పెట్రోల్ బంకును ప్రారంభించి, కారులో పెట్రోల్ కొడుతున్న మంత్రి నారాయణ

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మైత్రి పదిలం

భారత ప్రయోజనాలకు భంగం కలిగించే రీతిలో తమ భూభాగాన్ని ఇతరులను వినియోగించుకోనివ్వబోమని శ్రీలంక అధ్యక్షుడు హామీ ఇవ్వడం భారతదేశానికి పెద్ద ఉపశమనం. అనుర కుమార దిసనాయకే మూడురోజుల పర్యటన తరువాత, ఇప్పటి వరకూ ఉన్న అనుమానాలు సందేహాలు చాలామట్టుకు ఉపశమించిన మాట వాస్తవం. ఆయన నాయకత్వంలోని జనతావిముక్తి పెరుమన (జేవీపీ)కు చైనా అనుకూల వామపక్షపార్టీ అన్న ముద్ర ఉండటంతో, దిసనాయకే విధానాలు, వైఖరులమీద చాలా అనుమానాలున్నాయి. మాల్దీవుల అధ్యక్షుడిలాగా, నేపాల్ ప్రధానిలాగా ఈయన కూడా తన తొలి విదేశీపర్యటనకు చైనాను ఎంచుకుంటాడేమోనని భావిస్తున్న తరుణంలో, తొలిగా భారత్‌లోనే కాలూని పాత సంప్రదాయాన్నే దిసనాయకే కొనసాగించడం విశేషం.

భారతదేశం ఒత్తిడికి లొంగి విదేశీ పరిశోధనా నౌకల ప్రవేశం మీద రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం ఓ ఏడాదిపాటు విధించిన నిషేధానికి మరో నెలలో గడువుతీరబోతున్నది. ఈ నేపథ్యంలో, దిసనాయకే ఇచ్చిన హామీని భారతదేశం సానుకూల వైఖరిగా చూస్తోంది. చేసిన అప్పుతీర్చలేక తిరిగి చైనాకే 99సంవత్సరాల లీజుకు రాసిచ్చిన హంబన్‌టోట పోర్టులో చైనా తన నిఘా ఓడలను లంగరేస్తున్న విషయం తెలిసిందే. మరీ ముఖ్యంగా, శాటిలైట్లను, మిసైళ్ళను ట్రాక్ చేసే యువాన్‌వాంగ్ ఓడ విషయంలో భారత్–శ్రీలంక మధ్య ఘర్షణ ఏర్పడింది. భారత్ అభ్యంతరాల మధ్య దీని ప్రవేశాన్ని కాస్తంత ఆలస్యం చేసిన శ్రీలంక ఆ తరువాత మరమ్మతుల ముసుగులో దానిని అనుమతించింది. చీటికీ మాటికీ ఈ నిఘా సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఇప్పుడు సంయుక్త ప్రకటనలో భారతదేశానికి శ్రీలంకనుంచి ఒక నిర్దిష్టమైన హామీ లభించడం పెద్ద ఉపశమనం. రెండేళ్ళక్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు భారతదేశం ఎంతగా సాయపడిందో శ్రీలంక అధ్యక్షుడికి తెలియనిదేమీ కాదు. రాజపక్సేల ఏలుబడిలో చైనా అప్పుల ఊబిలోకి మరింత జారిపోయి, ఆర్థిక సామాజిక సమస్యను ఎదుర్కొన్న లంకకు భారతదేశం తాను చేయగలిగినంత చేసింది. బాధల్లో ఉన్నప్పుడు భారీగా సాయపడ్డ విషయాన్ని ప్రస్తావించి కృతజ్ఞతలు తెలియచేసిన దిసనాయకే, రాబోయేరోజుల్లో భారతదేశ భద్రతకు నష్టం చేకూర్చే చర్యలేమీ చేపట్టబోరని ఆశించాలి.

తన పర్యటనలో దిసనాయకే భారతదేశంతో రక్షణసహకార ఒప్పందాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. విద్యుత్తు, ఎల్‌ఎన్‌జీ ఇచ్చిపుచ్చుకోవడం, ఇంధన, రక్షణ, వాణిజ్యరంగాల్లో రెండుదేశాల సహకారం మరింత విస్తరించుకోవడం మంచి పరిణామం. తలైమన్నార్–రామేశ్వరం మధ్య ఫెర్రీ సర్వీసు ప్రతిపాదన భౌతిక దూరాన్ని తగ్గించడమే కాక, మానసికంగానూ దగ్గరచేస్తుంది. దిసనాయకేతో చర్చల్లో మత్స్యకారుల అంశం కూడా వచ్చిందని, వారిపట్ల మానవత్వంతో వ్యవహరించాలని నిర్ణయించుకున్నామని మోదీ ప్రత్యేకంగా చెప్పారు. అయితే, లంక తమిళుల ఆకాంక్షలను నెరవేర్చే విషయంలో మనం ఆశాభావం వెలిబుచ్చడం వినా, దిసనాయకేనుంచి నిర్దిష్టమైన హామీ ఏమీ లభించినట్టుగా లేదు. 13వ రాజ్యాంగ సవరణకు లోబడి తమిళ ప్రావిన్సుల్లో ఎన్నికలు, అధికార వికేంద్రీకరణ తదితర అంశాలకు సంబంధించి ఉభయదేశాల సంయుక్త ప్రకటన ఏమీ మాట్లాడలేదని వార్తలు వచ్చాయి. తమిళుల ప్రయోజనాలకు పూర్తిభిన్నంగా, ఇంకా చెప్పాలంటే వారిపట్ల శత్రుపూరిత వైఖరితో వ్యవహరించిన చరిత్ర జనతావిముక్తి పెరుమనకు ఉంది. భారత్–శ్రీలంక ఒప్పందాన్ని, అందులో భాగంగా చేరిన ఈ రాజ్యాంగ సవరణను ఆ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కానీ, మొన్న నవంబరు 14న జరిగిన పార్లమెంటరీ ఎన్నికల సందర్భంలో కానీ, తమిళులకు దిసనాయకే ప్రత్యేక హామీలేవీ ఇవ్వలేదు. అయినప్పటికీ వారు తమిళపార్టీల కంటే ఆయన కూటమినే అధికంగా ఆదరించారు. తన పర్యటనలో దిసనాయకే ఈ అంశాన్ని కూడా ప్రస్తావించడాన్ని బట్టి ఆయన తమిళుల ప్రయోజనాలకు కట్టుబడతారని భారతదేశం ఆశిస్తోంది. వచ్చే నెలలో ఆయన చైనాలో పర్యటించబోతున్నారు. అక్కడ జరిగే ఒప్పందాలు, ఇచ్చిపుచ్చుకోవడాలమీద భారత్ ఎలాగూ ఓ కన్నేసి ఉంచుతుంది. అయితే, భారత్ వ్యతిరేకి అన్నభావనకు పూర్తిభిన్నంగా దిసనాయకే మూడురోజుల పర్యటన చక్కని సుహృద్భావంతో ముగిసినందుకు సంతోషించాల్సిందే.

సంగీత విశ్వంలో తబలా శబ్దబ్రహ్మ

సంగీత జగత్తులో అనుపమేయ గాంధర్వులు కొందరు ఉంటారు. అటువంటి అరుదైన ప్రజ్ఞావంతులలో జాకిర్ హుస్సేన్ ప్రథమగణ్యుడు. సంగీత విశ్వానికి భౌగోళిక సరిహద్దులు ఉండవు కదా. కనుకనే సప్తస్వరాల వినూత్న మేళవింపుతో అద్భుతమైన సంగీతాన్ని సృష్టించిన జాకిర్ భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సమస్త సమాజాలలోను ప్రభావశీలుడుగా వెలుగొందారు. భౌతికంగా ఒక నిర్దిష్ట తరానికి చెందినవాడైనా ఆయన సార్వకాలికుడు. తండ్రి తబలా మేస్ట్రో అల్లా రఖా నుంచి తొలి శిక్షణ పొందిన జాకిర్ వ్యక్తిత్వం, ప్రతిభ, సృజనశీలత ఆయన ఒక అద్వితీయ సంగీత ప్రదేశ కాలాలలోకి ప్రవేశించేందుకు అన్ని విధాల ప్రేరేపించాయి. భారతీయ సంగీత వాహిని ప్రపంచవ్యాప్తమవుతున్న తరుణంలో జాకిర్ రంగప్రవేశం చేశారు. ఆయన నేతృత్వంలో భారతీయ గాయనీ గాయకులు, సంగీత స్రష్టలు పాశ్చాత్య దేశాలు 'ప్రపంచ సంగీతం'గా పిలిచే సమ్మిళిత సంగీతాన్ని సృష్టించారు. ప్రపంచ వేదికలపై కీర్తి కిరీటాలు ధరించారు.

భారత్ ఆ సంగీతాన్ని సంలీన లేదా మిశ్రమ సంగీతంగా పరిగణించింది. ఏ పేరుతో పిలిచినా గులాబీ గులాబీయే కదా. ఆ సంగీత ప్రపంచం వికాసానికి, విస్తరణకు జాకిర్ భాయి మార్గదర్శకత్వం వహించారు. ప్రపంచవ్యాప్తంగా విభిన్న సంగీత శైలులలో సుప్రతిష్ఠులు అయిన సంగీతవేత్తలతో కలసి సంయుక్తంగా కొత్త 'ప్రపంచ సంగీతం'ను అభివృద్ధిపరిచారు. ఈ వినూత్న సృజనాత్మక ప్రస్థానంలో ఆయన తన పెద్దలు కొంత మంది అడుగుజాడల్లో నడిచారు. తండ్రి అల్లా రఖా, విఖ్యాతుడు అలీ అక్బర్ ఖాన్ మొదలైన వారితో కలసి సంగీత సృష్టిలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా అలీ అక్బర్ ఖాన్‌తో కలిసి అభివర్ణించడానికి విశేషణాలు లేనటువంటి లోకోత్తర హిందుస్థానీ శాస్త్రీయ సంగీతాన్ని సృజించారు. ఇరవయో శతాబ్ది హిందుస్థానీ సంగీత ప్రేమికులు ఎంతగానో ఆస్వాదించిన సంగీతమది.



జాకిర్ హుస్సేన్ (1951–2024) శాశ్వతంగా నిష్క్రమించారు. ఆయనతో యాభై సంవత్సరాల స్నేహ బంధం ఉన్నవారైనా లేదా కేవలం ఐదు నిమిషాల పరిచయమున్నవారైనా ఆ మానవీయుడిని ఎన్నటికీ మరచిపోలేరు. ఆ తబలా మాంత్రికుడు తన సంగీతంతో మన జీవితాలలో ఎప్పటికీ ఉంటారు.

1970లలో శక్తి రికార్డింగ్స్‌లో ఆయన నిత్య నూతన సజీవ సంగీతాన్ని విన్న తరువాత నేను తబలా సంగీతం పట్ల ఆకర్షితుడినయ్యాను. అంతిమంగా జాకిర్ హుస్సేన్ ప్రపంచంలోకి ప్రవేశించాను. హిందుస్థానీ శాస్త్రీయ సంగీత సాంస్కృతిక లోకంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో జాకిర్ భాయి నాకు పరిచయమయ్యారు. జాకిర్‌తో నా తొలి అనుభవాలతో ఆయన ఆలోచనాశీలత, నమ్రత, భావ ప్రసార నైపుణ్యం నాకు తెలిసివచ్చాయి. భారతీయ సంగీత సంస్కృతి పురిగొలిపే ఆశలు, అనివార్యం చేసే నిరీక్షణలు తదితర విషయాలపై అవగాహన లేనివారితో ఆయన ఎంత ఓర్పుగా, నేర్పుగా మాట్లాడతారో నేను స్వయంగా చూశాను.

భిన్న నాగరికత, సంస్కృతికి చెందిన మాతో విపులంగా మాట్లాడేందుకు, తన సంస్కృతిని మాతో పంచుకునేందుకు ఆయన సదా సుముఖంగా ఉండేవారు. జాకిర్‌లోని ఈ సుగుణాలకు మూలాలు తండ్రి విశాల వైఖరులలో ఉన్నాయి. తండ్రి నుంచి పొందిన శిక్షణకు, సంగీత, బౌద్ధిక వారసత్వాలకు జాకిర్ భాయి వన్నె తెచ్చారు. విశాల ప్రపంచంలోకి ప్రవేశించేందుకు, భారతీయ జయపతాకలు ఎగురవేసేందుకు ఆయన వాటిని బాగా సద్వినియోగపరచుకున్నారు. మాపై ఆయన ప్రభావం, మా పట్ల ఆయన చూపిన ప్రేమానురాగాలు మా జీవితాలలో శాశ్వతంగా ఉండిపోయాయి.

అల్లారఖా సమక్షంలో ఉన్నప్పుడు సదా కుతూహల స్వభావంతో ఉండి తీరాలి. ఇది ఆయన కుమారుడి విషయంలోనూ నిండు సత్యమే. జాకిర్ భాయి స్ఫూర్తిదాయకంగా, హాస్య ప్రవృత్తితో మాట్లాడుతారు. ఆయన జ్ఞాపకశక్తి అద్భుతమైనది. ఆయన ఆసక్తులలో వైవిధ్యం మనలను ఆశ్చర్యపరుస్తుంది. క్రికెట్ నుంచి అత్యాధునిక సాంకేతికత వరకు ఆయనకు తెలియని విషయం లేదు. సరే, ప్రతి సంగీత శైలిపట్ల ఆయనకు ఆసక్తి మాత్రమే కాదు, అభిమానం, ఆదరణ కూడా చాలా మెండుగా ఉన్నాయి.

జాకిర్ భాయిలోని ఈ విశిష్ట గుణాల గురించి తెలిసినవారు ఎందరో ఉన్నారు. ఉత్కృష్ట ప్రతిభావంతుడైన సంగీతజ్ఞుడుగానే కాదు, తన జీవిత పరిధిలోకి వచ్చిన ప్రతి ఒక్కరి శ్రేయస్సు, సంక్షేమం గురించి చిత్తశుద్ధితో ఆలోచించే మానవత కూడా ఆయనలో మెండుగా ఉన్నది.

భారతీయేతర సంగీత సంప్రదాయాలు, ఆయా సంగీత శైలుల ప్రతిభావంతుల పట్ల ఆయన గౌరవాదరాలు అద్వితీయమైనవి. మనకు భిన్నమైనవారిని ఎలా ప్రేమించాలో, ఆదరించాలో ఆయన మాకు నేర్పారు. సంగీత ప్రపంచంలో తనకు ముందున్న, తన తరానికి మార్గదర్శకులుగా ఉన్న వారిని జాకిర్ అపరిమితంగా గౌరవించేవారు. తన తండ్రి తరానికి చెందిన తబలా కళాకారుడు కిషన్ మహరాజ్, నేపథ్య గాయని ఆశా భోస్లేల పట్ల ఆయన చూపే గౌరవాభిమానాలే అందుకు నిదర్శనం. పెద్దలనేకాదు, తన కంటే చిన్నవారినీ ఆయన అమితంగా అభిమానించేవారు, ఆదరించేవారు, ప్రోత్సహించేవారు. భారతదేశంలోను, వివిధ దేశాలకు చెందిన యువ సంగీతజ్ఞులకు ఆయన అందించిన సహాయ సహకారాలు ఎనలేనివి. జాకిర్‌లోని ఆ పెద్దరికమే ఆయన్ని ఎందరికో గౌరవపాత్రుడిని చేసింది. న్యూజీలాండ్‌లోని ఆక్‌లాండ్ నగరంలో జరిగిన ఒక సంగీత కచేరి సందర్భంగా స్థానిక పసిఫిక్ ఐలెండ్‌కు చెందిన డ్రమ్మర్లను ఆహ్వానించి వారితో కలసి ఆనాటి శ్రోతలకు మరపురాని సంగీతాన్ని అందించారు. ఆ డ్రమ్మర్లతో కలసి సంగీతాన్ని సృష్టించడం ద్వారా ఆయన తన సహచరులకు, శ్రోతలకు బాహాటత్వం, సమ్మిళితతత్వం గురించి విలువైన పాఠాలు నేర్పారు.

యువ సంగీతజ్ఞుడి స్థాయి నుంచి భారతీయ శాస్త్రీయ సంగీతం అగ్రగామి ప్రతినిధిగా ఎదిగేందుకు జాకిర్ నిర్విరామంగా కృషి చేశారు. ఉన్నత శిఖరాలు అధిరోహించిన తరువాత యువ సంగీతజ్ఞులకు కచేరీ నిర్వహణకు, రికార్డింగ్ అవకాశాలను కల్పించడంలో కూడా ఆయన నిరంతరం ఎంతగానో తోడ్పడేవారు. అందుకు తన పలుకుబడిని, ఉదారశీలతను వినియోగించేవారు.

జాకిర్ శాశ్వతంగా నిష్క్రమించారు. ఆయనతో యాభై సంవత్సరాల స్నేహ బంధం ఉన్నవారైనా లేదా కేవలం ఐదు నిమిషాల పరిచయమున్నవారైనా ఆ మానవీయుడిని ఎన్నటికీ మరచిపోలేరు. ఆ తబలా మాంత్రికుడు తన సంగీతంతో మన జీవితాలలో ఎప్పటికీ ఉంటారు.

● **గ్రెగొరీ డి బూత్**
ప్రొఫెసర్, యూనివర్శిటీ ఆఫ్ ఆక్‌లాండ్, న్యూజీలాండ్
(వ్యాసకర్త 'బిహైండ్ ది కర్టెన్ : మేకింగ్ మ్యూజిక్ ఇన్ ముంబైస్ ఫిల్మ్ స్టూడియోస్; బ్రాస్ బాజా : స్టోరీస్ ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ ఇండియాస్ వెడ్డింగ్ బాండ్స్ రచయిత)
(స్క్రోల్ సౌజన్యం)


కలికాలం! ఇది కృత్రిమ మేధ యుగం!!

బీబీసీ కథనం ప్రకారం భారత సంతతికి చెందిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ అనే యువ శాస్త్రవేత్త, కృత్రిమ మేధస్సుకు చెందిన 'ఓపెన్ ఏఐ' సంస్థ పరిశోధకుడిగా పనిచేస్తూ, 'విజిల్ బ్లోయర్'గా మారిన నేపథ్యంలో, శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో హఠాన్మరణం చెందాడని తెలుస్తోంది. 'ఓపెన్ ఏఐ కృత్రిమ మేధస్సు సంస్థ' అనుసరిస్తున్న ఆక్షేపణీయ విధానాలను ఆయన బహిరంగంగా విమర్శించడమే బహుశా ఆయన 'బలవన్మరణానికి' దారితీసి ఉండవచ్చని మీడియా వర్గాల అభిప్రాయం. కొన్నాళ్ల క్రితం సుచిర్‌తో 'న్యూయార్క్ టైమ్స్' జరిపిన ఇంటర్వ్యూలో, కృత్రిమ మేధస్సుకు సంబంధించి ఆయన తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించారు. ఈ సాంకేతికత వల్ల సమాజానికి వాటిల్లే ప్రమాదాలపై తన ఆందోళనను బహిరంగంగా వ్యక్తం చేశారు.

కాపీరైట్ చట్టం కింద పరిగణించాల్సిన సమాచారాన్ని, 'ఓపెన్ ఏఐ సంస్థ' చట్టవిరుద్ధంగా, విచ్చలవిడిగా అనైతికంగా, అక్రమంగా, అసురక్షితంగా, మోసపూరితంగా, ఉపయోగించడాన్ని సుచిర్ తప్పుబడుతూ, తీవ్రంగా విమర్శించారు. 'చాట్‌జీపీటీ' లాంటి కృత్రిమ మేధస్సు ఏజెంట్లు, అంతర్జాలాన్ని హానికరంగా మార్చివేస్తున్నాయని ఆయన సుస్పష్టం చేశారు. లింక్డ్‌ఇన్ ప్రొఫైల్ ప్రకారం, సుచిర్ బాలాజీ, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ చదివాడు. నవంబర్ 2020 నుంచి ఆగస్టు 2024 వరకు, నాలుగేళ్లపాటు 'ఓపెన్‌ఏఐ సంస్థ'లో పనిచేశారు. సుచిర్ బాలాజీ దుర్మార్గహం వర్తమానంలో, సమీప భవిష్యత్తులో 'కృత్రిమ మేధస్సు' కలిగించే 'హానికర ఫలితాల' సంకేతమని నిస్సందేహంగా చెప్పవచ్చు. 'అధికారం, ఆధిపత్యం, అభివృద్ధి' అనే అసంబద్ధమైన నెపంతో, నేడు అధునాతన సాంకేతికతల నిపుణులు తమ శక్తియుక్తులు ఉపయోగించి, సృష్టించిన ఒక వికారమైన విజ్ఞానానికి 'కృత్రిమ మేధస్సు (ఏఐ)' అనే నాగరిక నామకరణం చేశారు. అయితే, దీని సంతానం, తరచుగా, వారికి తెలియకుండా, హద్దులు మీరి, పగ్గాలు విదిలించుకుని, వారి నియంత్రణకు అతీతంగా మారాయి, మారుతున్నాయి, భవిష్యత్తులో మారనున్నాయి.

అశోకుడు కళింగ యుద్ధం బీభత్సాన్ని చూసి శాంతి మార్గం అనుసరించాడు, బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. రాబర్ట్ ఓపెన్‌హైమర్ అణుబాంబు అనివార్య దుష్ఫలితాలను సహించలేకపోయాడు. కృత్రిమ మేధ సృష్టికర్తలలో ఒకరైన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆ వినూత్న సాంకేతికత అనియంత్రిత ఆవిష్కరణల ప్రమాదాలపై ప్రపంచాన్ని గట్టిగా హెచ్చరిస్తున్నారు. బహుశా సుచిర్ బాలాజీ కూడా అదే ప్రయత్నం చేసి మృత్యుబారిన పడ్డాడేమో? కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రగామి శాస్త్రవేత్తలు జెఫ్రీ హింటన్, డెమిస్ హసాబిస్, జాన్ ఎం జంపర్, జాన్ హాప్‌ఫీల్డ్ 2024 సంవత్సరానికి గాను, నోబెల్ బహుమతులు పొందినవారిలో ఉన్నారు.

హింటన్, హాప్‌ఫీల్డ్‌లు తమ కృషి ద్వారా 'గణిత, భౌతిక శాస్త్రాల' మధ్య ఒక వంతెనగా కృత్రిమ మేధస్సును సృష్టించారు. దీనివల్ల తాత్త్విక అన్వేషణకు, వ్యావహారిక ప్రయోగాలకు, కావాల్సిన ఉపకరణాల రూపకల్పన జరిగింది. అలాగే డెమిస్ హసాబిస్, జాన్ జంపర్



మానవ మేధో సృష్టి ఫలితాలను అవగాహన చేసుకోవడంలోనే నిజమైన విజ్ఞానం ఇమిడి ఉంటుంది. శాస్త్రవేత్తలు తమ నవ కల్పనల పర్యవసానంగా సంభవించే అనర్థాలకు పరితాపం చెందడం మార్పు దిశగా ఒక సంకేతమని, ప్రపంచాన్ని బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లగలదని భావించాలి. అశోకుడు, ఓపెన్‌హైమర్, హింటన్ లాంటివారి అనుభవాలు, ఆవేదనల నుంచి, ఇటీవలే మరణించిన యువ శాస్త్రవేత్త సుచిర్ బాలాజీ హెచ్చరిక నుంచి నేర్చుకోవడం మానవాళికి శ్రేయస్కరం.

'ఆల్ఫాఫోల్డ్' అనే ఏఐ వ్యవస్థ రూపకల్పన చేసి అభివృద్ధి పరిచారు. ఇది ప్రోటీన్ నిర్మాణాలను విశ్లేషించడంలో గణనీయమైన రీతిలో, విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చింది. అమినో ఆమ్లక్రమాల ఆధారంగా ప్రోటీన్‌లో పరమాణు నిర్మాణాన్ని కనుగొనే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది జీవ, వైద్య శాస్త్రరంగాల్లో విప్లవాత్మక ఫలితాలను చూపింది. ముఖ్యంగా ఔషధాల అభివృద్ధి వేగవంతం చేయడం, రోగాలను అణు స్థాయిలో అర్థం చేసుకోవడం, యాంటీబయోటిక్ నిరోధకత వంటి సవాళ్లను ఎదుర్కోవడంలో సహాయపడింది.

'ఏఐ డీప్‌లెర్నింగ్ గాడ్‌ఫాదర్'గా పిలవబడే జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, జాన్ హాప్‌ఫీల్డ్‌తో కలసి 'న్యూరల్ నెట్‌వర్క్స్'ను రూపొందించారు, ఇది 'బ్యాక్‌ప్రొపగేషన్ అల్గారిథమ్' అనే విశిష్ట ప్రక్రియ ద్వారా తప్పుల నుండి నేర్చుకోవడం సాధ్యమైంది. దీని ద్వారా ఆధునిక డీప్ లెర్నింగ్‌కి బలమైన పునాది ఏర్పడింది. ఈ ఆవిష్కరణ కంప్యూటర్ విజన్ నుండి భాషా ప్రక్రియల వరకు వివిధ ఏఐ అనువర్తనాల్లో ప్రధాన పాత్ర పోషించింది. ఇంగ్లాండ్‌లో జన్మించిన హింటన్, ఎడింబరో విశ్వవిద్యాలయానికి సమర్పించిన పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసంలో 'న్యూరల్ నెట్‌వర్క్స్‌లో ఎర్రర్ కరెక్టింగ్ కోడ్స్ డిస్ట్రిబ్యూటెడ్ రిప్రజెంటేషన్స్'పై దృష్టిపెట్టారు. ఆయన ఆధారభూత పనితనం కృత్రిమ మేధస్సు దిశను పూర్తిగా మార్చివేసింది. నోబెల్ బహుమతి అందుకున్నప్పటికీ, హింటన్ నిరంతరం ఏఐతో సంభావ్య భావి ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ వస్తున్నారు.

2023లో గూగుల్‌ను వదిలి, హింటన్ 'అనియంత్రిత కృత్రిమ మేధస్సు అభివృద్ధి' కలిగించే ప్రమాదాలు, తప్పుడు సమాచారం వ్యాప్తి, మానవాళికి కలిగే ముప్పు గురించి తన ఆందోళనలను బహిరంగంగా వ్యక్తం చేశారు. హింటన్, హాప్‌ఫీల్డ్‌లకు లభించిన గుర్తింపు, కృత్రిమ మేధస్సుకు సంబంధించిన పలురంగాల్లో మార్గదర్శక ప్రభావాన్ని చూపిస్తుంది. డీప్‌లెర్నింగ్ ప్రధాన భూమికలైన సిద్ధాంతపరమైన అల్గారిథమిక్ మౌలికాలను హింటన్, హాప్‌ఫీల్డ్‌లు అందించగా, హస్సాబిస్, జంపర్‌లు శాస్త్రీయ సవాళ్లను పరిష్కరించగల కృత్రిమ మేధస్సు సామర్థ్యాన్ని శాస్త్రీయంగా రూఢిపరుస్తూ నిరూపించారు. ఈ విజయాలు కృత్రిమ మేధస్సు ద్వంద్వ స్వభావాన్ని కూడా పునరుద్ఘాటించాయి. సమాజానికి కలిగించే ప్రయోజనాలు చాలా ఉన్నప్పటికీ, దాని నైతిక, తదితర అస్తిత్వసంబంధ సమస్యలు గణనీయమైనవిగా మిగిలిపోతున్నాయి.

'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) ఆవిర్భావం, అవసరం, సిద్ధాంతం, పరిణామం, ఆరోహణ, (బహుశా) అవరోహణ, మంచిచెడు ప్రభావాలు నిజంగా ఆసక్తికరమైనవేనని అనాలి. 1956లో, న్యూ హ్యాంప్‌షైర్‌లో జరిగిన డార్ట్‌మౌత్ వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే పదం సృష్టించబడింది. క్లాడ్ షానన్, జాన్ మక్కార్తీ, నాథనియల్ రోచెస్టర్, మార్విన్ మిన్స్కీలను (ఏఐ) 'కృత్రిమ మేధస్సు స్థాపక పితామహులుగా' పరిగణిస్తారు.

అనేక రకాల పనులను ఆటోమేట్ చేయాలని, సామర్థ్యాన్ని పెంచాలని, మానవ మేధో సామర్థ్యాలను మించిపోయే సంక్లిష్టతలను ఎదుర్కొనాలనే మానవ జాతి ఆకాంక్ష నుండి ఆవిర్భవించినదే కృత్రిమ మేధస్సు. కృత్రిమ మేధస్సు పరిణామ క్రమంలో ముఖ్యమైన మైలురాళ్లున్నాయి. వాటిలో 'చాట్‌జీపిటి' వంటి సంభాషణల ఏజెంట్ల రంగప్రవేశం, కృత్రిమ మేధస్సును ఒక 'అత్యవసర దుష్టశక్తి'గా మార్చివేసి, మానవ జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తూ, మానవ మెదడు ఆలోచనా సామర్థ్యాన్ని దెబ్బతీస్తూ, పర్యవేక్షణ వ్యవస్థల లాంటి ఉపయోగంతో పౌర స్వేచ్ఛలను హరించివేస్తోంది. ఫలితంగా, కృత్రిమ మేధస్సు, ఆధునిక ఆవిష్కరణల ప్రమాదాలను సూచిస్తుంది, కాబట్టి, దాని రూపాంతర సామర్థ్యాన్ని చెడుగా వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేది ఒక సవాలుగా మారింది. 'మొట్టమొదటి అణ్వాయుధ ఆవిర్భావం, ప్రయోగం, దాని అనుకూల, ప్రతికూల ప్రభావాలు, వాటి మధ్య చోటుచేసుకున్న తేడాలను కూలంకషంగా పరిశీలించడం అవశ్యం.

రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, అప్పటి అమెరికా ప్రభుత్వం గోప్యంగా చేపట్టిన 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్'లో భాగంగా ప్రపంచంలో మొదటిసారిగా 'అణ్వాయుధ పరీక్ష జూలై 16, 1945న 'ది గ్యాడ్జెట్' పేరిట జరిగింది. ఈ పరికరాన్ని న్యూమెక్సికోలోని లాస్ ఆలమోస్‌లో విజయవంతంగా పరీక్షించారు.

అమెరికా బాంబర్ 'ఎనోలా గే' వాయునౌక ద్వారా పేల్చబడిన అణ్వాయుధాలు కనీవినీ ఎరుగని అపార విధ్వంసాన్ని కలిగించాయి. ఈ విధ్వంసాన్ని చూసిన 'అణ్వాయుధ, ఆటామిక్ బాంబ్ పిత'గా పిలువబడే రాబర్ట్ ఓపెన్‌హైమర్, తన ప్రగాఢ పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేశారు. భగవద్గీతలోని మాటలను ఆయన పదేపదే ఉటంకిస్తూ, 'ఇప్పుడు నేనే మరణాన్ని; ప్రపంచాలను నాశనం చేసేవాడిని అయ్యాను' అని ఆవేదనాభరితంగా తన మనస్తాపాన్ని వ్యక్తపరిచాడు.

మౌర్య అశోకుడిలో కలిగిన పరివర్తన, రాబర్ట్ ఓపెన్ హైమర్ పశ్చాత్తాపం, జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్ ఆవేదనలకు బహువిధ సామీప్యాలు ఉన్నాయి. కళింగ యుద్ధంలో విధ్వంసాన్ని చూసి చలించిన అశోకుడు హింసను త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరించారు. ప్రజల శ్రేయస్సుకు కట్టుబడి శాంతి పరిపాలనకు అంకితమయ్యారు. ఓపెన్ హైమర్, 'మాన్‌హట్టన్ ప్రాజెక్ట్' శాస్త్రీయ డైరెక్టర్‌గా అణుబాంబు సృష్టిలో కీలకపాత్ర పోషించి, ఆ బాంబు ప్రభావానికి బాధపడ్డారు. ఆయుధ నియంత్రణను సమర్థిస్తూ, తన పనికి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అలాగే, కృత్రిమ మేధస్సు అభివృద్ధికి 'గాడ్‌ఫాదర్'గా ప్రఖ్యాతిగాంచిన జెఫ్రీ ఎవరెస్ట్ హింటన్, న్యూరల్ నెట్వర్క్‌ల అభివృద్ధికి కారణమై, ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి కారకుడైనప్పటికీ, కృత్రిమ మేధస్సు అనూహ్య దుష్ఫలితాల గురించి, అది ఆర్థిక వ్యవస్థలపై, సమాజాలపై, మానవ స్వయంశక్తిపై కలిగించే ప్రభావాల గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మానవ మేధో సృష్టి ఫలితాలను అవగాహన చేసుకోవడంలోనే నిజమైన విజ్ఞానం ఇమిడి ఉంటుంది. శాస్త్రవేత్తల సృష్టి పర్యవసానంగా జరిగే అనర్థానికి దాని కారకులు పశ్చాత్తాపం వెల్లడి చేయడం, మార్పు దిశగా ఒక సంకేతమని, ప్రపంచాన్ని బాధ్యతాయుతమైన భవిష్యత్తు వైపు తీసుకెళ్లగలదని భావించాలి. అశోకుడు, ఓపెన్‌హైమర్, హింటన్, లాంటివారి అనుభవాలు, ఆవేదనల నుండి, ఇటీవలే మరణించిన 26 సంవత్సరాల సుచిర్ బాలాజీ హెచ్చరిక నుండి నేర్చుకోవడం ప్రపంచానికి, మానవాళికి ప్రయోజనకరం.

■ **వనం జ్వాలానరసింహారావు**

అధికారం చుట్టూ అదే పరుగు!

అసెంబ్లీ ఎన్నికలు ముగిసి ఆరు మాసాలు గడిచాయో లేదో, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 'మళ్ళీ ఎన్నికలకు సిద్ధం కండి!' అన్న ధోరణిలోనే పార్టీ శ్రేణులకు పిలుపు ఇవ్వటం చూస్తుంటే – లేచిందే లేడికి పరుగు అన్న సామెత గుర్తొస్తుంది. మరో అడుగు ముందుకు వేసి 2027లోనే జమిలి ఎన్నికలు వస్తున్నాయని, 40 శాతం ఓటు బ్యాంకు ఉందంటూ పార్టీ శ్రేణులను పుష్ చేయటం గమనార్హం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ళ పరిపాలనా కాలాన్ని కడుపులో నీళ్ళు కదలకుండా పూర్తి చేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలతో మాట్లాడేందుకు, మీడియాను అడ్రస్ చేసేందుకు కూడా రాలేదు. ఎక్కువ కాలం తాడేపల్లిలోనే గడిపేవారు. వై నీడ్ జగన్ అని ఇంటింటికీ తన బొమ్మ పంపి ప్రచారం చేశారు. వై నాట్ 175 అనీ చెప్పారు. చొక్కాలు మడతెయ్యండి అన్నారు. చంద్రబాబు కుప్పంలో గెలవడని, లోకేష్ మంగళగిరిలో గెలవడని, పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ససేమిరా గెలవడనీ మంత్రివర్గ సహచరులతో హల్‌చల్ చేయించారు. చంద్రబాబు అరెస్టుతో తెలుగుదేశం పార్టీ కథ సమాప్తం అవుతోందని కౌరవ వ్యూహాలు రచించారు. ఆయన పన్నిన అన్ని రాజకీయ వ్యూహాలూ బెడిసికొట్టాయి. ఊకదంపుడు ఉపన్యాసాలు ఫలించలేదు. ఆయన ఉత్తర కుమార ప్రగల్భాలు ఏవీ నెరవేరలేదు. ఫలితంగా 151 సీట్ల అరుదైన బలం కాస్తా 11 స్థానాలకు పడిపోవటంతో ప్రతిపక్ష హోదా కోసం అధికార పార్టీని అడుక్కోవటం, కోర్టుకు వెళ్ళి హోదా ఇప్పించమని ప్రాధేయపడటం మొదలుపెట్టారు. ఇంత జరిగినా ఓటమికి ఉన్న కారణాలను జగన్ ఏ ఒక్క రోజూ పార్టీ సమావేశం పెట్టి సమీక్షించ లేదు. పోనీ ఆయన కూడా ఎందుకు ఓడామో, పార్టీ శ్రేణులకు చెప్పలేదు. ఈవీఎంల మాయ అని ఒకసారి, 40 శాతం ఓట్ల బలం ఉందని ఒకసారి, సూపర్ సిక్స్ పథకాలతో చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చారని ఇంకోసారి ప్రచారం మొదలు పెట్టారు. తనను తాను తగ్గించుకోకుండా, తక్కువ కాకుండా మాట్లాడటం ఆయనకు స్వతహాగా ఉన్న వింత వైఖరే. ఆయన పాలనలో తీసుకున్న తుగ్లక్ నిర్ణయం మూడు రాజధానుల అంశం. ఈ అంశాన్ని వెనక్కి తీసుకున్నారా, మళ్ళీ మూడు ముక్కల ఆటతోనే ముందుకు వెళతారా? అన్న అంశంపై కూడా స్పష్టత లేదు. ఐదేళ్ళ పాలనలో జరిగిన పాలనా విధ్వంసంపై నోరు మెదపరు. మరోవైపు చెరువుకు గండి పడ్డట్టు వైసీపీ రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పోలోమంటూ ఇతర పార్టీల వైపు పరుగులు తీస్తున్నా, ఉంటే ఉండండి, పోతే పోండి అన్న తరహాలోనే ఉన్నారు. రేపోమాపో మళ్ళీ అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి, అందరూ ఎలర్ట్‌గా ఉండమని, చంద్రబాబు సూపర్ సిక్స్ ఇవ్వలేదు కాబట్టి ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని, అది మనపై ప్రేమగా మారుతుందని అసంబద్ధ ఆలోచనలతోనే ఉండటం గమనార్హం. ఏ ప్రభుత్వానికి ఐనా ఒకసారి అధికారం పోయిన తరువాత రాజకీయ పరిణతి పెరగాలి. ప్రజలు చాలా నిశితంగా పరిశీలిస్తారు అన్న జ్ఞానం కలగాలి. ఈ రెండూ మాజీ సీఎంకు లేకపోవటం వైసీపీ దురదృష్టం. ప్రజాస్వామ్యంలో ఎన్ని సీట్లు వచ్చినా, ప్రజలు ఇచ్చిన సీట్లను బాధ్యతగా భావించి అసెంబ్లీకి వెళ్ళాలి. లేకపోతే రాజీనామాలు చేసి మళ్ళీ ఎన్నికలకు వెళ్ళాలి. కూతవేటు దూరంలో ఉన్న అసెంబ్లీని ఎగ్గొట్టి, నాలుగు గోడల మధ్య పాత్రికేయుల మీటింగ్‌లు పెడితే ఏం ప్రయోజనం? ఇలా ప్రజాస్వామిక నడక లేకుండా, 'అంతా నా ఇష్టం' అన్నట్లు వ్యవహరిస్తే, మళ్ళీ అవే ఫలితాలు వస్తాయి.

– పోతుల బాలకోటయ్య
అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

ఈ విజన్‌తో ఉజ్వలభవితకు భరోసా!

ఒక కుటుంబ పెద్ద తన ఇంటిని కనిపెడుతూ, ఆ ఇంటి సభ్యుల అవసరాలను తీరుస్తూ, కుటుంబాన్ని ఏ విధంగా నడిపిస్తుంటాడో– అదే విధంగా ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌ను నారా చంద్రబాబు నాయుడు ముందుకు నడిపిస్తున్నారు. ఎన్నో రంగాల్లో దేశంలోనే ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. అభివృద్ధి పట్ల చంద్రబాబుకు ఉన్న విజన్ అనతికాలంలోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో దూసుకుపోయేలా చేస్తున్నది.

నిత్యం ప్రజల కోసం, భావితరాల కోసం ఓ యోధుడిలా పని చేయడం చంద్రబాబు విధానం. అయిదేళ్ల పదవి కాలంలో ఏమి చేస్తాంలే అన్నట్టు అప్పటి ముఖ్య మంత్రుల విధానాలు ఉండేవి. కానీ చంద్రబాబు మాత్రం 20 ఏళ్ల కాలానికి దర్శనికత చూపారు. 1998లో విజన్ 2020 అంటే అప్పటి ప్రతిపక్ష నాయకులు హేళన చేశారు. కానీ దాని ఫలితాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ అనుభవిస్తున్నారు. దేశంలో విజన్ కార్యక్రమాలకు నాంది పలికింది చంద్రబాబు. జగన్ అయిదేళ్లపాటు అరాచకాలతో, అక్రమాలతో రాష్ట్రాన్ని నాశనం చేస్తే, గాడి తప్పిన రాష్ట్రానికి ఊపిరి పోయడానికి సీఎం చంద్రబాబు విజన్ 2047ని తీసుకొచ్చారు. ముఖ్యంగా రాష్ట్రంలో దళితులు, వెనకబడిన కులాలకు ఉపయోగపడే విధంగా విజన్ 2047ను రూపొందించారు. దీని ముఖ్య ఉద్దేశం పేదరికాన్ని నిర్మూలించి అభివృద్ధిపథంలో నడపడం. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రజలు అందరూ పేదరికం నుంచి భయటపడి సంపన్నులు కావాలనేది విజన్ 2047లోని మొదటి అంశం. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంతో అట్టడుగు వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయటం దీని ఉద్దేశం. ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలన్న దానికి అనుగుణంగా కార్యాచరణ త్వరలో ప్రవేశపెట్టనున్నారు. దీంతో ప్రస్తుతం కుటుంబం తలసరి ఆదాయం రూ.2.70 లక్షలు ఉంటే 2047 నాటికి రూ.36 లక్షలకు పెరుగుతుంది.

రాష్ట్రం విడిపోయిన తరువాత ఏపీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు తక్కువయ్యాయి. జగన్ అయిదేళ్ల పాలనలో ఉద్యోగాలిస్తామని నమ్మబలికి విద్యార్థులను మోసం చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ ఉద్యోగం కల్పించాలని సంకల్పించింది. దాని కోసం ప్రత్యేక స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. 2014లో టీడీపీ హయాంలో హెచ్‌సీఎల్, గన్నవరం ఐటీ పార్కులో ఉద్యోగాలు కల్పించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత టీసీఎస్, గూగుల్ వంటి కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను నిరుద్యోగులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు.

విజన్ 2020లో భాగంగా గోదావరి, కృష్ణా నదులు అనుసంధానం చేసి వేలాది ఎకరాలకు నీరు అందిస్తున్నారు. ఇప్పుడు ఈ విజన్ 2047తో త్వరలో రాయలసీమ వరకు నదులు అనుసంధానం చేసి నీటి కొరతను తీర్చడాన్ని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ మన రాష్ట్రంలో నీరు అందని గ్రామాలు చాలా ఉన్నాయి. 2047 నాటికి ప్రతి గ్రామానికీ నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. విజన్ 2020లో డ్రిప్ పద్ధతిని పరిచయం చేసినప్పుడు అందరూ ఏంటో అనుకున్నారు. ఇప్పుడు ఆ డ్రిప్ పద్ధతి లేనిదే ప్రధాన పంటలు సాగు కావడం లేదు. విజన్ 2047లో కూడా అలాంటి అధునాతన సాంకేతికత పద్ధతులను రైతులకు పరిచయం చేసి లాభసాటిగా మార్చాలని నిర్ణయించారు. పంటకోత అనంతరం నష్టాలు తగ్గించేందుకు ఏఐ, ఐఓటీ, రోబోటిక్స్, డ్రోన్ల వినియోగం పెరగాలని విజన్ 2047 సూచించింది. చిన్న రైతులకు డిజిటల్ సేవలు, మైక్రో క్రెడిట్ సౌకర్యాలు, పంటల బీమా, రియల్ టైమ్ రాయితీలను అందించనున్నారు. దీంతో రైతు లాభదాయకంగా మారడానికి అవకాశాలు ఉంటాయి. రానున్న కాలంలో దేశ రవాణా మొత్తం లాజిస్టిక్ మీద ఆధారపడి ఉంటుంది. ఈ రంగంలో యువతకు ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి.

1998లో విజన్ 2020 అంటే అప్పటి ప్రతిపక్ష నాయకులు హేళన చేశారు. కానీ దాని ఫలితాలు ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలూ అనుభవిస్తున్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో గాడి తప్పిన రాష్ట్రానికి ఊపిరి పోయడానికి సీఎం చంద్రబాబు విజన్ 2047ని తీసుకొచ్చారు. 2047 నాటికి రాష్ట్రంలో ఉన్న ప్రజలు అందరూ పేదరికం నుంచి భయటపడి సంపన్నులు కావాలనేది విజన్ 2047లోని మొదటి అంశం.



పారిశ్రామిక రంగంలో చంద్రబాబు వాగ్దానాలను ఒక్కొక్కటే నెరవేరుస్తూ వస్తున్నారు. పరిశ్రమల స్థాపనలో పాలనాపరమైన అడ్డంకులను అధిగమించి కేవలం 15 రోజుల్లో కొత్త పరిశ్రమలకు అనుమతులు లభించేలా చట్టాన్ని తెచ్చారు. ఈ విషయంలో దేశానికే ఆదర్శప్రాయంగా నిలిచారు. ప్రస్తుత దేశ జీడీపీలో 14 శాతం రవాణాకే ఖర్చవుతున్నది. దీనిని తగ్గించి, రహదారులు నిర్మించి, జలరవాణాను ఉపయోగించుకొని, తద్వారా రవాణ వ్యయం తగ్గించి ప్రపంచస్థాయి లాజిస్టిక్స్‌లో ఏపీకి ప్రత్యేక స్థానాన్ని కల్పించనున్నారు. విజన్ 2020 ప్రవేశపెట్టక ముందు రాష్ట్రంలో కరెంట్ కష్టాలు ఎక్కువగా ఉండేవి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏపీలో 5 వేల మెగావాట్లు విద్యుత్తు ఉత్పత్తి అయితే చంద్రబాబు 2004 పదవి అయిపోయే నాటికి 10వేల మెగావాట్లు విద్యుత్తును ఉత్పత్తి చేశారు. దీంతో రైతులకు ఉచిత కరెంట్ ఇవ్వగలిగారు. ప్రస్తుత విద్యుత్తు కొనుగోలు ధర యూనిట్‌కు రూ.5.19 ఉండగా, ఈ ఏడాది దానిని రూ.4.80 తగ్గించారు. రానున్న కాలంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా రాష్ట్రాన్ని నిలిపేందుకు కృషి చేస్తారు. దానికి కావలసిన ఇంధన వనరులు అన్నీ ఉపయోగిస్తారు.

ఒకప్పుడు మన గురించిన సమాచారం నాలుగైదు రకాల పత్రాలలో ఉండేది. కానీ ఇప్పుడు ఒకే క్లిక్‌తో మన సమాచారం మొత్తం అందుబాటులోకి వచ్చేలా రూపకల్పన చేస్తున్నారు. మన భవిష్యత్తుకు డేటా చాలా అవసరం. వివిధ రకాలు సేవలను ఇందులో అనుసంధానం చేయనున్నారు. విజన్ 2020 ద్వారా విద్యా విప్లవం వచ్చింది. ప్రతి కిలోమీటరుకూ ప్రాథమిక పాఠశాల, మూడు కిలోమీటర్లకొక ఉన్నత పాఠశాల, గ్రామానికి ఒక జడ్పీ పాఠశాల, మండలానికి ఒక జూనియర్ కళాశాల, జిల్లాకి ఒక మెడికల్ కాలేజీ, వందలాది ఇంజినీరింగ్ కాలేజీలు చంద్రబాబు ప్రవేశపెట్టారు. ఇప్పుడు ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు ఏపీకి వస్తున్నాయి. విశాఖ, తిరుపతి, అమరావతిల్లో నాలెడ్జ్ హబ్‌లు ఏర్పాటు చేస్తారు. నైపుణ్యం శిక్షణ అందిస్తారు. ఇవి విజన్ 2047 ముఖ్య ఉద్దేశాలు. ఇవి సాకారం అయితే మన రాష్ట్రంలో ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగి, ఒక పారిశ్రామికవేత్త ఉంటారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రస్థానంలో స్వర్ణాంధ్ర–2047 విజన్ కొత్త చరిత్రకు నాంది పలుకుతుంది. రాష్ట్ర దశ దిశ మార్చే స్వర్ణాంధ్ర – 2047 విజన్ తెలుగు జాతిని నెంబర్ వన్‌గా చేసే క్రమంలో పెను మార్పులు తీసుకురాబోతున్నది.

○ **ఏలూరి సాంబశివరావు**
పర్చూరు శాసనసభ్యులు

కొల్లి మోహన్‌రావుకు 'బొప్పన' పురస్కారం


తెలుగు రాష్ట్రాల సాంఘిక నాటకరంగ నట, దర్శకులకు, విశేషించి నాటకాభిమానులకు చిరపరిచితులు డా. కొల్లి మోహనరావు. బతుకుతెరువు కోసం హిందీ భాషను ఎంచుకుని, ఉన్నత విద్యకోసం, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చేరారు. తన అభిరుచి సఫలీకృతం చేసుకోవడానికి, అప్పుడే ఏయూలో వెలసిన థియేటర్ ఆర్ట్స్‌లో సాయంత్రం కోర్సులో చేరారు. గిడుతూరి సూర్యం సాహచర్యంతో ఆయనలో నటవికాసం పెంపొందింది. ఏలూరు సి.ఆర్. రెడ్డి కళాశాలలో 30 నాటికలకు దర్శకత్వం వహించారు. 1995లో ఆంధ్రప్రదేశ్ కళాశాలల స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా, 2012లో 'కందుకూరి రంగస్థల పురస్కారం'లను అందుకున్నారు. 2009లో ఖమ్మంలో జరిగిన నంది నాటకోత్సవాలలో, బాలల నాటిక పోటీలకు, 2017లో నంది నాటకోత్సవాలలో నాటక విభాగంలో ప్రాథమిక పరిశీలన న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఎనిమిది పదుల వయసులోనూ, నిరంతరం సాంఘిక నాటక వికాసం కోసం పరితపించే నాటక శ్రేయోభిలాషి ఆయన. వీరికి అనకాపల్లిలోని 'కళావిపంచి', 'తెలుగు డ్రామా', 'జార్జి క్లబ్'ల ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకోత్సవాలలో భాగంగా, డిసెంబరు 21న బొప్పన ఆత్మీయ పురస్కారం అందజేస్తున్నారు.

– బి.వి. అప్పారావు



బఫర్ జోన్‌లో ఇళ్ల నిర్మాణాలు

ఆంధ్రజ్యోతి





బుడమేరు కబ్జాకు మట్టి తోలించిన అక్రమార్కులు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

బుడమేరు ఆక్రమణల విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నాం. ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగిన చర్యలు చేపడతాం.

- రాజశేఖర్, ఇరిగేషన్ ఏఈ

క్రమంగా కనుమరుగు

వరద బీభత్సం తర్వాత బుడమేరులో ఆగని ఆక్రమణలు

- న్యూ ఆర్ఆర్‌పేటలో క్రమంగా పూడ్చివేత
- పిల్లకాల్వను తలపిస్తున్న బుడమేరు
- మామూళ్ల మత్తులో ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు బీభత్సం సృష్టించి వేల ఇళ్లు నీట మునిగినా, వందలాది మంది మృతిచెందినా... అక్రమార్కుల కళ్లు ఇంకా చల్లబడలేదు. బాధితుల ఆర్తనాదాలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉన్నా అక్రమాలను మాత్రం వదల్లేదు. కబ్జాలు చేస్తూ నానాటికీ బుడమేరును మింగేస్తున్నారు. పైచిత్రాలే ఇందుకు నిదర్శనాలు.. న్యూ రాజరాజేశ్వరిపేటలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ నుంచి అపార్ట్‌మెంట్ల వైపు వెళ్లే ఎదురు రోడ్డులో బుడమేరు ఆక్రమణకు గురవుతోంది. ఇక్కడ కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి రాత్రికి రాత్రే బుడమేటిలో మట్టిపోసి చదును చేశారు. సుమారు 500 గజాల స్థలం కబ్జాకు గురవుతున్నా సంబంధిత ఇరిగేషన్, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడట్లేదు. ప్రస్తుతం కబ్జాకు గురవుతున్న స్థలం విలువ సుమారు రూ.60 లక్షల పైమాటే. గత వైసీపీ ప్రభుత్వంలో న్యూ రాజరాజేశ్వరిపేట, సన్‌సిటీ కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఇందిరానాయక్ నగర్ ప్రాంతాల్లోని బుడమేరు చాలావరకు కబ్జాకు గురైంది. ప్రభుత్వం మారినా కబ్జాదారులు వెనక్కి తగ్గలేదు. నకిలీ డాక్యుమెంట్లు, వీలునామాలు సృష్టించి యథేచ్ఛగా కబ్జాకు పాల్పడుతున్నారు. దీంతో బుడమేరు పిల్లకాల్వను తలపిస్తోంది. మట్టి పూడ్చి బుడమేరును కబ్జా చేస్తున్నా, కబ్జా స్థలంలో భవనాలు నిర్మిస్తున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టట్లేదు. ముంపు తర్వాత స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బుడమేరును ప్రక్షాళన చేస్తామని ప్రకటించినా కబ్జాదారులు రెచ్చిపో వడం వెనుక అధికారుల హస్తం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బుడమేరులో జరుగుతున్న కబ్జాలను అడ్డుకుని స్థలాలను స్వాధీనం చేసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

అమరావతి రైల్వేలైన్ కూత



భూ సేకరణకు కేంద్రం గజిట్ నోటిఫికేషన్ విడుదల

జిల్లాలో 297 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్

గొట్టుముక్కల, పరిటాలలో 122.91 ఎకరాలు

వీరులపాడు మండలంలో 174.56 ఎకరాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి నూతన రైల్వే మార్గానికి ముందడుగు పడింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా భూ సేకరణ ప్రతిపాదనలకు సంబంధించిన గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రతిపాదిత భూ సేకరణ భూములపై ఏమైనా అభ్యంతరాలుంటే జనవరి 16లోపు తెలపాల్సి ఉంటుంది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించే నూతన రైల్వేలైన్‌కు 297.499 ఎకరాలను సేకరించేందుకు ఈ గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామంలో 50.49 ఎకరాలు, పరిటాలలో 72.42, వీరులపాడు మండలం పెద్దాపురంలో 50.92 ఎకరాలు, గూడెం మాధవరంలో 7.71 ఎకరాలు, జుజ్జూరులో 28.89 ఎకరాలు, నరసింహారావుపాలెంలో 17.44 ఎకరాలు, చెన్నారావు పాలెంలో 26.45 ఎకరాలు, అల్లూరులో 43.15 ఎకరాల చొప్పున భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రతిపాదించిన భూముల్లో నూటికి 99 శాతానికిపైగా ప్రైవేటు భూములే ఉన్నాయి. ప్రభుత్వ భూములు చాలా తక్కువ. ఒకటి రెండు దేవదాయ భూములు కూడా ఉన్నాయి. పంచాయతీల పరిధిలో చాలా స్వల్ప సంఖ్యలో పుంత, పీడబ్ల్యూడీ కెనాల్, వాగు, ఇళ్ల స్థలాలు ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 8లో సుమారు 3 ఎకరాల వరకు కోర్టు కేసులో ఉన్న భూములను కూడా భూ సేకరణలో పెట్టారు. ఈ భూములను వెంటనే సేకరించటం కుదరదు. కోర్టు కేసులు తేలితే తప్ప సేకరించలేని పరిస్థితి. ఇవికాకుండా పలుచోట్ల డొంకలు కూడా భూ సేకరణలో ఉన్నాయి. పరిటాలలో సర్వే నెంబర్ 13లో ఎన్‌హెచ్ రోడ్డుకు సంబంధించిన భూమిలో 82 సెంట్ల మేర కోల్పోవాల్సి వస్తుంది. ఒకటి రెండుచోట్ల మాత్రమే అసైన్డ్ ల్యాండ్స్‌ను తీసుకోవాల్సి వస్తోంది.

రైలు ఢీకొని యువకుడు మృతి

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన మృతుడి స్నేహితులు

6లో

వైసీపీ విధేయ అధికారికి కీలక పోస్టు

డీఆర్‌డీఏ పీడీగా జయచంద్రకు పోస్టింగ్ ఇచ్చే అవకాశం

- వైసీపీ హయాంలో రెచ్చిపోయిన అధికారి
- వాట్సాప్ గ్రూపుల్లో ఆ పార్టీ అనుకూల పోస్టులు
- చంద్రబాబుకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు
- ఎన్నికల కోడ్‌లోనూ వాట్సాప్ డీపీగా జగన్ ఫొటో
- సామినేని ఉయభానుకు ప్రియ శిష్యుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వివాదాస్పదుడు, పంచాయితీ మాజీ అధికారి (డీపీవో), వైసీపీ వీరభక్త అధికారి జయచంద్ర గాంధీకి కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) పోస్టు ఇవ్వటానికి రంగం సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ సమయంలో కూడా భయం లేకుండా నాటి అధికార పార్టీకి ఈయన వీరవిధేయుడిగా పనిచేసి రివర్షన్ అందుకున్నారు.

వైసీపీ విధేయుడిగా..

వైసీపీ, జగన్ అంటే వీరాభిమానం ఉన్న జయచంద్ర గాంధీ తాను ఒక అధికారినని మరిచిపోయి గత ఐదేళ్లలో వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ అనుకూల పోస్టులతో రెచ్చిపోయారు. ఒక అధికారిగా ఇలాంటి పోస్టులు పెట్టడం తగదని కామెంట్లు చేసినా ఖాతరు చేసేవారు కాదు. నాటి సీఎం జగన్, ఆయన సతీమణి భారతి పట్ల విపరీతమైన ప్రేమాభిమానాలు చాటేవారు. ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను అమలు చేసే విషయంలో జరుగుతున్న లోటుపాట్లు, వైసీపీ లోపాలను ఎత్తిచూపుతూ పత్రికల్లో కథనాలు రాగా, ..ఆ రెండు పత్రికలంటూ ఆయన ఎంపీడీవోల గ్రూపులో అక్కసు వెళ్లగక్కేవారు. తన పర్సనల్ వాట్సాప్ నెంబర్‌లో జగన్ ఫొటోను డీపీగా పెట్టుకునేవారు. ఎన్నికల ముందు, కోడ్ సమయంలో ఇలాంటి పద్ధతి మంచిది కాదని అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు పలుమార్లు హెచ్చరించినా జయచంద్ర ఖాతరు చేయలేదు. తన వ్యక్తిగత వ్యవహారమని కలెక్టర్‌తోనే వాదులాటకు దిగేవారు. పలుమార్లు చెప్పినా వినకపోవటంతో ఆయనపై బదిలీ వేటు వేశారు. అప్పటి జగ్గయ్యపేట వైసీపీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సిఫారసుతో ఎన్టీఆర్ జిల్లా డీపీవోగా వచ్చారు. సామినేని ఉదయభాను అంటే జయచంద్ర గాంధీకి అపారమైన గౌరవం. ఆయన కనిపిస్తే సాష్టాంగ నమస్కారం చేస్తుంటాడు. డీపీవోగా ఎంపికయ్యాక చిల్లకల్లులోని ఎండీవో కార్యాలయంలోని శ్రీశక్తి భవన్ పైఅంతస్తులో ఎమ్మెల్యే కోసం ఏకంగా ఆఫీసునే కట్టించారు. లక్షల రూపాయలు వెచ్చించి మరీ చాంబర్‌ను తీర్చిదిద్దారు. తాజాగా.. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరారు. దీంతో సామినేని ఉదయభాను సహాయ, సహకారాలతో కూటమి ప్రభుత్వంలో చక్రం తిప్పడానికి సదరు అధికారి సిద్ధమైపోయారు. దీంతో డీఆర్‌డీఏ పీడీ పోస్టుపై ఆయన దృష్టిపెట్టారు. సామినేని సహకారం కూడా తోడవటంతో ఫైల్ చకచకా సెక్రటేరియట్‌కు చేరింది. ఈ పోస్టు కోసం జయచంద్రతో పాటు ఏఎన్‌వీ నాంచారరావు అనే వ్యక్తి కూడా పోటీ పడుతుండగా, జయచంద్రకే పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రేపు పెనమలూరులో సీఎం పర్యటన

ఏర్పాట్లు పరిశీలించిన కృష్ణాజిల్లా కలెక్టర్, ఎస్పీ

6లో

ఇక పరుగులే

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 11 ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ

- వైసీపీ ప్రభుత్వంలో రెండుచోట్లే పనులు
- మిగిలిన 9 రోడ్లకు కూటమి ప్రభుత్వంలో కదలిక
- గన్నవరం-నూజివీడు రోడ్డు విస్తరణ పనులు ముమ్మరం
- ఆర్థిక సహకారం అందిస్తున్న నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్
- సబ్ కాంట్రాక్టర్లే పనులు చేస్తుండటంతో నాణ్యతపై అనుమానాలు





ముమ్మరంగా గన్నవరం-నూజివీడు రహదారి పనులు (ఇన్‌సెట్‌లో) శరవేగంగా కల్వర్టు పనులు

> ఉమ్మడి కృష్ణాజిల్లాలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో చేపట్టిన ఆర్అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులు పరుగులు పెడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ముఖం చాటేసిన సబ్ కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వం రాకతో నూతనోత్సాహంతో పనిచేస్తున్నారు. నాడు రెండుచోట్లే పనులు జరగ్గా, నేడు తొమ్మిది చోట్ల పనులు చేపట్టారు. ఇందులో గన్నవరం-నూజివీడు రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) ఆర్థిక సహకారంతో 11 ఆర్అండ్‌బీ రోడ్లను డబుల్ లేన్‌గా విస్తరించేందుకు నిర్ణయించారు. రూ.234 కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచారు. వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థ ఈ పనులను దక్కించుకుంది. ఆ తర్వాత పనులన్నింటినీ సబ్ లీజులకు కట్టబెట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్ల పనులు సక్రమంగా జరగలేదు. ఆ తర్వాత సబ్‌లీజులు పొందిన కాంట్రాక్టు సంస్థలు బిల్లులు రావన్న ఉద్దేశంతో పనులు ఆపేశారు. దీంతో ఒకటి రెండు రోడ్లు తప్ప మిగిలిన రోడ్ల విస్తరణకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో సబ్ కాంట్రాక్టర్లలో కూడా బిల్లులు వస్తాయన్న ధీమా పెరిగింది. ప్రభుత్వం స్థాయిలో కూడా ఎన్‌డీబీ రోడ్ల పనులకు సంబంధించి సమీక్ష చేసి సమస్యలను పరిష్కరించడంతో ఇటీవలే గ్రౌండ్ సర్వేయింగ్ పనులు జరిగాయి. తాజాగా గన్నవరం-నూజివీడు ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను సబ్ లీజు పొందిన కాంట్రాక్టర్ చేపట్టారు. గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సిమెంట్ రోడ్లను కూడా వేస్తున్నారు. గ్రామాల బయట నుంచి బీటీ లేయర్ వేసేందుకు వీలుగా రోడ్డును విస్తరించి వెట్ మిక్స్, హాట్ మిక్స్ పనులు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా మధ్యలో కల్వర్టుల పనులు కూడా చేపడుతున్నారు.

వృద్ధి కన్‌స్ట్రక్షన్స్‌దే పూర్తి బాధ్యత

గన్నవరం-నూజివీడు రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సంస్థ నిబంధనల మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తుందా లేదా అన్నది నాణ్యత పరీక్షలో తెలుస్తుంది. ఎన్‌డీబీ మార్గదర్శకాల ప్రకారం పనులు చేయకపోతే బిల్లులు ఆపివేయడంతో పాటు బ్లాక్ లిస్టులో పెట్టే ప్రమాదం కూడా ఉంది. జిల్లావ్యాప్తంగా చేపట్టే పనులకు వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ మాత్రమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ సంస్థ సబ్‌లీజులకు ఇచ్చినప్పటికీ ఆయా సంస్థల మీద ఆర్అండ్‌బీ పర్యవేక్షణ చేయదు. దాదాపు అన్ని రోడ్లను వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సబ్ లీజులకు ఇవ్వటంతో.. ఎక్కడైనా తప్పు జరిగితే.. మొత్తం రోడ్ల మీద ప్రభావం చూపుతుంది. సబ్ లీజుదారులు లాభాపేక్షతోనే పనులు చేస్తుంటారు. నాసిరకంగా చేస్తే వృద్ధి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ బాధ్యత వహించాల్సి ఉంటుంది.

వాణిజ్య పన్నుల శాఖలో దుమారం

2022లో ఉద్యోగుల ఆందోళనపై ఫిర్యాదు

వాణిజ్య పన్నుల శాఖలో ఓ అధికారి ఫిర్యాదుకు సంబంధించిన విచారణ వ్యవహారం దుమారం రేపుతోంది. ఫిర్యాదులో పేర్లున్న వారిలో కొంతమందికి షోకాజ్ నోటీసులు జారీచేసి, కీలకంగా వ్యవహరించిన ఉద్యోగుల విషయంలో అధికారులు మౌనం దాల్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మొత్తం 53 మందిపై అభియోగాల నమోదు
- సుదీర్ఘకాలంగా సాగుతున్న విచారణ
- తాజాగా 13 మందికి నోటీసులు
- కీలకమైన వారిని వదిలి ఉద్యోగులకు షోకాజ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు చేయాలని 2022లో వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. సుదీర్ఘకాలంగా విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న వారిని పొరుగు జిల్లాలకు బదిలీ చేయాలని భావించారు. ఈ ప్రక్రియను కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలనుకున్నారు. ఈ బదిలీలను నిలుపుదల చేయాలని ఏపీసీటీ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆనాడు ఈ సంఘానికి కేఆర్ సూర్యనారాయణ నేతృత్వం వహించారు. ఆయన ఆధ్వర్యంలో ఉద్యోగులు దశలవారీగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నాడు చీఫ్ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డి చాంబర్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. ఆయన్ను చుట్టుముట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి 53 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. వారంతా కేఆర్ సూర్యనారాయణకు అత్యంత సన్నిహితులు. ఆయన సంఘంలో వివిధ పదవుల్లో ఉన్నారు. నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు తనపై దూకుడుగా ప్రవర్తించారని కృష్ణారెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు విచారణకు ఆదేశించారు.

వారిని వదిలేశారేం..

విచారణను ఎదుర్కొన్న 13 మంది ఉద్యోగులకే నోటీసులు అందడంతో వివాదం ముదురుతోంది. సీసీ కెమెరాల్లో ఎవరెవరు అధికారి చాంబర్‌లోకి వెళ్లారో స్పష్టంగా మిగతా 6లో..



మలుపులు తిరుగుతున్న విచారణ

కృష్ణారెడ్డి ఫిర్యాదుపై విచారణ కొద్దినెలలుగా జరుగుతోంది. అధికారి ఫిర్యాదులో పేర్కొన్న పేర్లతో పాటు నాడు చాంబర్‌లోకి దూసుకెళ్లిన ఉద్యోగులను ఒక్కొక్కరినీ పిలిచి విచారణ చేస్తున్నారు. ఈ ఆందోళనకు సంఘంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న కేఆర్ సూర్యనారాయణ, ప్రకాశం జిల్లాకు చెందిన రమేశ్ నాయకత్వం వహించారు. ఈ ఘటన జరిగిన కొన్నాళ్లకు నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగంపై సూర్యనారాయణతో పాటు కొంతమందిపై విజయవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. నాడు నిరసనలో పాల్గొన్న వారిని విచారణ చేయగా, ఈ రెండు పేర్లు వినిపించినట్టు తెలిసింది. విచారణ తుదిదశకు చేరుకోవడంతో చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని అధికారులు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

భవానీ దీక్షల విరమణలు విజయవంతం చేయండి

అధికారులతో కలెక్టర్ సమీక్ష, కనకదుర్గానగర్‌లో పర్యటన



8లో

ఎ.కొండూరు ఎంపీడీవో మృతి

బిడ్డకు జన్మనిచ్చి గుండెపోటుకు గురైన హరిప్రియ



ఎ.కొండూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు ఎంపీడీవో పి.హరిప్రియ (39) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆమె 2018లో గ్రూప్-1 పరీక్షలో విజయం సాధించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపీడీవోగా విధులు నిర్వహించారు. కొద్దికాలం తరువాత కమిషనర్ కార్యాలయంలో పనిచేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎ.కొండూరు ఎంపీడీవోగా గత అక్టోబరు 9న బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ అభివృద్ధికి ఆమె అధికారులను సమన్వయపరిచారు. నవంబరు 15న మెటర్నటీ సెలవుపై వెళ్లారు. కాగా, కాన్పు కోసం హరిప్రియను విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. బిడ్డకు జన్మనిచ్చిన హరిప్రియ తీవ్ర అనారోగ్యానికి గురై గుండెపోటుకు గురయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. కష్టపడి గ్రూప్-1 ఉద్యోగం సాధించిన హరిప్రియ మృతికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

రేపు పెనమలూరులో సీఎం పర్యటన

» ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

గంగూరు (కంకిపాడు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న పెనమలూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటిస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పెనమలూరు మండలం గంగూరులో బుధవారం ఎస్పీ గంగాధర్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గంగూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. రైతు సేవాకేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, అనంతరం రైస్‌విల్ పరిశీలన, ఈడుపుగల్లు బీసీ కాలనీలో రెవెన్యూ సదస్సులో పాల్గొని ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, రెవెన్యూ డివిజనల్ అధికారి షారోన్, డీఎస్వో పార్వతి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పద్మావతి, తహసీల్దార్ గోపాలకృష్ణ, భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు రండి

» డిప్యూటీ సీఎంకు బుద్ధప్రసాద్ ఆహ్వానం

అవనిగడ్డ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ నెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు ముఖ్యఅతిథిగా రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. కోడూరు మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం సాగర సంగమాన్ని ఎకో టూరిజం ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చేయాలని, అవనిగడ్డ మండలంలోని ద్వీప గ్రామం పాత ఎడ్లంకకు కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. వరదల సమయంలో రేవు దాటేందుకు గ్రామస్థులు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. అవనిగడ్డలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య కేసు దర్యాప్తు గురించి ఆయనతో చర్చించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం నిధులతో విస్తృత స్థాయిలో సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మండలి వెంకట్రామ్‌తో కలిసి పవన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు.



పవన్‌కు వివరిస్తున్న బుద్ధప్రసాద్



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీలు కేశినేని శివనాథ్ తదితరులు

స్వతంత్ర సోలార్ పంపులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

» పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019-2024 మధ్యలో నాటి ప్రభుత్వం 'ప్రధాన మంత్రి కుసుమ్ పథకం' కింద స్వతంత్ర సోలార్ పంపుల కోసం ఎటువంటి అభ్యర్థన చేయలేదని కేంద్ర విద్యుత్ నూతన పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశో నాయక్ వెల్లడించారు. పార్లమెంట్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కుసుమ్ పథకంపై వివరాలు అడిగిన మీదట మంత్రి పై విధంగా సమాధానం ఇచ్చారు. ప్రధాన మంత్రి- కిసాన్ ఊర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహా భియాన్ (పీఎం-కుసుమ్) పథకంలోని భాగం-బి కింద స్వతంత్ర సోలార్ పంపుల కోసం ఎటువంటి అభ్యర్థన అందలేదని, ఎక్కడా వాటిని ప్రారంభించలేదని తెలిపారు. రైతుల అవసరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థిస్తే పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద ఈ ఏడాది నవంబరు 30 నాటికి 12,32,327 స్వతంత్ర సోలార్ పంపులకు ఆమోదం ఇవ్వగా, ఇప్పటి వరకు 5,74,324 పంపులు మాత్రమే ప్రారంభమయ్యాయని తెలిపారు. సోలార్ పంపుల ప్రారంభానికి 24 నెలల గడువు ఇవ్వటం జరుగుతుందని, అవసరమైతే ఆయా సందర్భాలను బట్టి పొడిగించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఫండ్) ద్వారా 1941 దరఖాస్తులు ఆమోదించగా, రూ.54.82 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్టు మంత్రి వెల్లడించారు. ఈ పథకంలోని ప్లాన్-ఏ కింద వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని చేర్చడానికి ఈ ఏడాది సెప్టెంబరు 10న మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.

కేంద్రమంత్రికి ఎంపీల శుభాకాంక్షలు

కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలో బుధవారం ఈ మేరకు ఆయన తన సహచర టీడీపీ ఎంపీలతో కలిసి రామ్మోహన్ నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ భవనంలోని టీడీపీ కార్యాలయంలో రామ్మోహన్ నాయుడుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసిన రామ్మోహన్ నాయుడు ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ, విమానయాన రంగాన్ని రామ్మోహన్ పరుగులు పెట్టిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. లావు శ్రీకృష్ణదేవరాయలు, కె.అప్పలనాయుడు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మతుకుమిల్లి శ్రీధర్, బి.నాగరాజు, లక్ష్మీనారాయణ, బైరెడ్డి శబరి, దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, హరీష్ మాథుర్, తెన్నేటి కృష్ణ ప్రసాద్ బి.కె. పార్థసారధి, కనకమేడల రవీంద్ర రామ్మోహన్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్నాచౌక్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు వలంటీర్ వ్యవస్థను కొనసాగించి సీఎం చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన 50 గంటల ఆత్మగౌరవ దీక్ష బుధవారం ముగిసింది. స్థానిక దాసరిభవన్ వద్ద జరిగిన దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి రామకృష్ణ విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వలంటీర్లపై మంత్రుల వ్యాఖ్యలను ఖండించారు. వలంటీర్లందరూ వైసీపీ కార్యకర్తలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల పోరాటానికి మద్దతు ప్రకటించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

మ్యుటేషన్ దుమారం!



గుడివాడ పురపాలక సంఘ కార్యాలయం

» గుడివాడ మున్సిపాలిటీలో ఏడాదిలో రూ.కోట్ల కుంభకోణం!
» వైసీపీ ఐదేళ్ల పాలలో నిగ్గుతేలాల్సినవెన్నో..
» ఎనిమిది నెలలుగా ముందుకుసాగని విచారణ!
» ఆర్డీ స్థాయి అధికారి విచారిస్తే నిజాలు బట్టబయలు
» మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల చొరవ చూపాలి

గుడివాడ మున్సిపాల్టీలో మ్యుటేషన్ కుంభకోణంపై విచారణ నత్తనడకన సాగుతోంది. కోట్లాది రూపాయలు పక్కదారి పట్టించిన వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ అధికారులు బదిలీపై వెళ్లిపోయారు. నలుగురు కమిషనర్ల హయాంలో కుంభకోణం జరగడంతో విచారణకు అధికారులు ముందుకు రావడం లేదని కార్యాలయవర్గాలే బాహాటంగానే పేర్కొంటున్నాయి. జరిగిన కుంభకోణంపై రాజమండ్రి ఆర్జేడీ ఎస్వీవీ సత్యనారాయణ సమగ్ర విచారణకు ఆదేశించారు. అధికారులు మారిపోతున్నా విచారణ అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి - గుడివాడ)

గుడివాడ మున్సిపాల్టీలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 143 మ్యూటేషన్ల విషయంలో కోట్లాది రూపాయల 'గోల్‌మాల్' జరిగినట్టు ఉన్నతాధికారులు తేల్చారు. ఒక్క రూపాయి కూడా ఖజానాకు జమ చేయకుండా మ్యుటేషన్ చేశారని గుర్తించారు. ఈ భారీ కుంభకోణంపై తొలుత రాజమండ్రి ఆర్జేడీ ఎస్వీవీ సత్యనారాయణ స్వయంగా గుడివాడ వచ్చి ఆన్‌లైన్‌లో పరిశీలించి ఏప్రిల్ 4న సమగ్ర విచారణ చేయాలని చేయాలని నాటి కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంను ఆదేశించారు. ఆదేశాలిచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటికీ క్షేత్రస్థాయిలో అడుగు కూడా ముందుకు పడలేదు.

విచారణ అధికారికి బెదిరింపులు?

మ్యూటేషన్‌లో జరిగిన అవినీతి నిగ్గుతేల్చేందుకు నాటి మున్సిపల్ కమిషనర్ సకాలంలో స్పందించకపోవడంతో ఆర్డీ నాగ నరసింహారావు జూలై 25న విచారణాధికారిగా మున్సిపల్ కార్యాలయ అకౌంట్స్ ఆఫీసర్ జీటీ నాయుడును నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. అయితే ఆయనకు బెదిరింపులు రావడంతో విచారణ నుంచి తప్పుకున్నట్టు కార్యాలయవర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రస్తుత విచారణాధికారి ఎక్కడ..?

విచారణాధికారిగా జీటీ నాయుడు తప్పుకోవడంతో ఆర్డీ నాగ నరసింహారావు తాడిగడప కమిషనర్ భవాని ప్రసాద్‌ను తిరిగి నియమించారు. ఇప్పటికి మూడు నెలలు కావస్తున్నా ఆయన గుడివాడ వచ్చింది లేదు. దీనిపై ఆయన్ను సంప్రదించగా కార్యాలయ పనుల్లో బిజీగా ఉండటం వలన, విచారణ చేసే సమయం లేకపోవడంతో రాలేకపోయానని, వారం రోజుల్లో విచారణ చేపడతానని ఫోన్‌లో తెలిపారు.

నిజాలు నిగ్గుతేలేనా..?

కోట్లాది రూపాయల మ్యుటేషన్ స్కాంలో కమిషనర్‌ను విచారణాధికారిగా నియమిస్తే విచారణలో పారదర్శకత కొరవడుతుందని కార్యాలయవర్గాలే పేర్కొంటున్నాయి. ఈ కుంభకోణంలో కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారి వరకు అందరూ పాత్రధారులే కావడంతో విచారణ ముందుకు సాగడం లేదని సమాచారం. నలుగురు కమిషనర్ల హయాంలో జరిగిన కుంభకోణంపై విచారణ పారదర్శకంగా సాగేనా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు కోట్ల రూపాయల కుంభకోణాన్ని బట్టబయలు చేయాలని, ఆర్డీ స్థాయి అధికారి విచారణ చేస్తేనే కుంభకోణం ఏస్థాయిలో జరిగిందో బహిర్గతమవుతుందని టీడీపీ వర్గాలు కోరుతున్నాయి.

మున్సిపల్ మంత్రి, ఎమ్మెల్యే దృష్టిసారించాలి

ఒక్క ఏడాదిలోనే 143 మ్యుటేషన్లలో అవినీతి జరిగిందని మున్సిపల్ అధికారులు ధృవీకరిస్తే, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-23 మధ్యకాలంలో భారీస్థాయిలో మ్యుటేషన్లు చోటుచేసుకున్నాయని ఆరోపణలున్నాయి. కోట్లాది రూపాయల కుంభకోణంపై మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి సారించాలని కూటమి నేతలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నేతల అరెస్టు, విడుదల



కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుంట్ను పోలీసులు

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లంచం వ్యవహారంలో అదానీపై ఎన్ని ఆరోపణలు వచ్చినా కేంద్రం చర్యలు తీసుకోకపోవటంపై నిరసనగా బుధవారం దేశ వ్యాప్తంగా 'చలో రాజ్‌భవన్' కార్యక్రమానికి ఆలిండియా కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. దీనిలో భాగంగా విజయవాడలో కాంగ్రెస్ నాయకులు కార్యక్రమానికి ఉపక్రమిస్తుండగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. సౌత్ ఏసీపీ యు.బంగార్రాజు ఆధ్వర్యంలో గవర్నర్‌పేట సీఐ నాగ మురళి, ఎస్ఐలు సిబ్బందితో నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి సాయంత్రంవిడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీసాల రాజేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొలనుకొండ శివాజీతో సహా 12 మంది కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వే పూర్తి చేయండి

» పౌరుల మిస్సింగ్ డేటా నమోదు చేయాలి : కలెక్టర్

కృష్ణలంక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చేపట్టిన హౌస్ హోల్డ్ సర్వేను వారం రోజుల్లో పూర్తిచేసి పౌరుల మిస్సింగ్ డేటాను గృహ డేటాబేస్‌లో చేర్చాలని, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది హాజరును తప్పక నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వే ప్రగతిపై బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ మండల అభివృద్ధి, గ్రామ, వార్డు సచివాలయ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రతి పౌరునికి సంబంధించిన సమగ్ర సమాచారం గృహ డేటాబేస్‌లో పొందుపరిచేందుకు హౌస్ హోల్డ్ సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు. దారిద్యరేఖకు దిగువన వున్న వారు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్న వారు డేటాబేస్‌లో నమోదు చేయబడ్డారని, ఉద్యోగస్తులు, వ్యాపారరంగానికి చెందిన వారు, దారిద్ర్యరేఖకు పైబడినవారు సంక్షేమ పథకాలకు అర్హులంకామనే ఉద్దేశ్యంతో వారి వివరాలను మ్యాపింగ్ చేసుకోలేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ యజమానితో పాటు సభ్యుల వివరాలను సేకరించి నమోదుకాని వారి డేటాను పొందుపరచాలన్నారు. ప్రతి ఇంటికి జియో కో-ఆర్డినేటర్ల అవసరం వుందని పౌరులకు సేవలందించేందుకు జియో టాగింగ్ తప్పనిసరని జిల్లాలో 7,28,383 గృహాలకుగాను 6,91,627 గృహాలు జియో టాగింగ్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన 36,756 గృహాలకు జియోటాగింగ్ చేయాలన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సామాజిక ప్రయోజనాలను అందించేలా వారి ఆధార్‌ను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి జి.జ్యోతి, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

గన్నవరం తహసీల్దార్ కేవీ శివయ్య

గన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని కేవీ శివయ్య అన్నారు. మండలంలోని సూరంపల్లిలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ కేవీ శివయ్య మాట్లాడుతూ రైతులు రెవెన్యూ కార్యాలయానికి రాకుండానే గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి భూసమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం రైతుల వద్దకే అధికారులను పంపించిందన్నారు. చాలా కాలంగా భూములు సాగుచేస్తూ వారసత్వంగా సంక్రమించిన పొలాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేయాలని రైతులు కోరారు. అడంగల్ కరక్షన్స్ భూ సంబంధిత సమస్యలు, సర్వే కొలతల్లో తేడాలు కోసం 25అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలను పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, రామినీడు బసవపూర్ణయ్య, విఆర్వో శ్రీరామకుమార్ పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శివయ్య

కాటూరు సదస్సులో 18 అర్జీలు

ఉయ్యూరు: భూసంబంధిత, ఇరత సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. కాటూరులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన సదస్సుల ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా పట్టాదారు పాసుపుస్తకాలకు 13, సర్వే నిమిత్తం 5 దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో శేషగిరిరావు, సర్వేయర్ సురేశ్, ఆర్ఐ యతేంద్రియులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని నందమూరు, మధిరపాడు గ్రామాల్లో రెవెన్యూ ఇతర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం మీభూమి-మీహక్కు రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ జాలాది విమలకుమారి మాట్లాడుతూ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు సబ్‌డివిజన్, మ్యుటేషన్‌పై రెండుగ్రామాల పరిధిలో అర్జీలు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, నందమూరు, మధిరపాడు సర్పంచ్‌లు తులిమిల్లి బేబి, తుమ్మల రామారావు, ఆర్ఐ బి.సూర్యకాంతి, వీఆర్వో ఏ.శివాజీ రవీంద్ర బాబు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య నిరసన

» రెండో వివాహం చేసుకున్నాడని అనుమానం

బోయిన్‌పల్లి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉంటూ 4 సంవత్సరాల నుంచి కనిపించకుండా తప్పించుకు తిరుగుతున్న భర్త తనతో కాపురం చేయాలంటూ ఓ మహిళ భర్త ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేసిన సంఘటన మారేడుపల్లిలో చోటుచేసుకుంది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం రంగాపురం గ్రామానికి చెందిన నవ్య బుధవారం భర్త ఇంటి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ పికెట్ విజయనగర్‌కాలనీకి చెందిన ఉదయ్ భాస్కర్ రెడ్డితో నవ్యకు 2017లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో 30తులాల బంగారం, రూ.10 లక్షలు ఇచ్చి వైభవంగా తల్లితండ్రులు వివాహం జరిపించినట్టు తెలిపింది. వివాహం అనంతరం అమెరికాలో సంవత్సరంన్నర కాపురం చేశామని, ఈ సమయంలో ఆయన తనతో ఉండకుండా ఎక్కువ సమయం అక్క తరంగిణిరెడ్డితోనే ఉండేవాడని, ఇదేంటి అని ప్రశ్నించినప్పుడల్లా తనను చిత్రహింసలు పెట్టేవాడని తెలిపింది. నిత్యం అనుమానిస్తూ వేధించేవారని, అసభ్యకరంగా వీడియోలు తీస్తూ అక్క, తమ్ముడు వేధించేవాళ్లని, దీంతో తల్లిదండ్రులకు విషయం తెలిపి ఇండియాకు వచ్చి వెస్ట్ మారేడుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టినట్టు తెలిపింది. వివాహ సమయంలో తీసుకున్న బంగారం, నగదు కాకుండా తాను అమెరికాలో ఉన్న సమయంలో ఉద్యోగం చేసి కూడపెట్టుకున్న సుమారు 20లక్షలతో బంగారం చేయించుకుంటే ఆ బంగారాన్ని సైతం వారివద్దనే ఉంచుకొని అమెరికా నుంచి వెల్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తాను చదువుకున్న సర్టిఫికెట్లను సంవత్సరాలు తరబడి వారి వద్దనే ఉంచుకొని గత మూడు నెలల క్రితం ఇచ్చారని దీంతో తాను ఎంతో ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా జీవితాన్ని నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త ఉదయ్‌కుమార్ రెడ్డి రెండో వివాహం చేసుకొని వేరే కాపురం చేస్తున్నాడని అనుమానాలు ఉన్నాయని తెలిపింది. న్యాయం కోరుతూ బుధవారం భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తుంటే రాత్రికి రాత్రి కోర్టు నుంచి ఆర్డర్ తీసుకురావడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేసింది. వెస్ట్ మారేడుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆమెను స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. తన భర్తను కాపురం చేసేవిధంగా చర్యలు తీసుకోకపోతే నిరసన విరమించే ప్రసక్తేలేదని పోలీసులకు తేల్చి చెప్పింది. దీంతో మారేడుపల్లిలోని నవ్య అత్తగారి ఇంటి వద్ద నవ్యను చూసిన స్థానిక మహిళలు కొందరు ఓదార్చే ప్రయత్నం చేశారు.

హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజ్‌కు అమెరికా వాణిజ్య సదస్సు ఆహ్వానం

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికా - భారత దేశాల మధ్య జనవరి 23వ తేదీన జరిగే వాణిజ్యం - అవకాశాల సదస్సులో పాల్గొనేందుకు హైకోర్టు న్యాయవాది పదిరి రవితేజకు ఆహ్వానం అందింది. ఎకనామిస్ట్ ఇంపాక్ట్ తరఫున తారాబ్రౌన్ ఆహ్వానాన్ని రవితేజకు అందజేశారు. ట్రంప్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారతదేశంలో అమెరికా సంబంధాలు ఎలా ఉంటాయనే అంశంపై సదస్సులో చర్చ జరగనుంది. అమెరికాలో తగినంత పారిశ్రామిక ఉత్పత్తులు చేసే అవకాశాలు ఉన్నాయా? వాణిజ్య ఒప్పందాలు, వాటి ప్రభావం, తదితర అంశాలపై చర్చ జరగనున్నాయి. దేశంలో యువకుల సంఖ్య ఆధారంగా జరిగే అభివృద్ధిపై అమెరికాతో దౌత్య సంబంధాలు, ఇండో పసిఫిక్ ప్రాంతాల్లో అంతర్జాతీయ రాజకీయాల ప్రభావం, అనిశ్చితి, తదితర అంశాలపై చర్చ ఉంటుందని ఆహ్వాన పత్రికలో తెలియజేశారు.

21న పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

భారతీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్డీఏ సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో టెక్నోటాస్క్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, దొడ్ల డైరీ లిమిటెడ్, కోస్టల్ న్యూమటిక్ ఏజెన్సీస్, రమాక్లాత్ స్టోర్స్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 30సంవత్సరాల వయస్సులోపు వారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికయిన వారికి నెలకు రూ.12,000 నుంచి రూ.35000 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. వివరాలకు 9391254464, 9347779032 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణ మంత్రి వ్యాఖ్యలపై ఖండన

నందిగామ రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు జాతి ఆరాధ్య దైవం.. నందమూరి తారకరామారావు స్మృతి చిహ్నం సమీపంలో అసెంబ్లీ కడతామని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. అసంబద్ధ వ్యాఖ్యలు చేసి తెలుగు వారి ఆగ్రహానికి గురికావద్దని సంఘం ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు, జిల్లా దిశ కమిటీ సభ్యురాలు మన్నే కళావతి, నాయకులు హెచ్చరించారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



గుడివాడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని రామవరప్పాడు-నిడమానూరు స్టేషన్ల మధ్యలో విజయవాడ రూరల్ కార్మికనగర్-ప్రసాదంపాడు పంచాయతీ పరిధిలో గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 65 సంవత్సరాల వయసున్న వృద్ధురాలు మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ మహబూబ్ షరీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు స్టేషన్ ఎస్ఐ నెల్ 94406 27570కు సమాచారం ఇవ్వాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

» రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన మృతుడి స్నేహితులు
» అనుమానాస్పద మృతిగా కేసు

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులందరూ కలిసి రైల్వే ట్రాక్ పక్కన పార్టీ చేసుకున్నారు. అనుకోకుండా ఓ యువకుడిని గూడ్స్ రైలు బలంగా ఢీకొట్టింది. కొనఊపిరితో ఉన్న యువకుడిని స్నేహితులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అయితే ఈ విషయాన్ని దాచి పెట్టి మృతుడి స్నేహితులు రోడ్డు ప్రమాదంగా చిత్రించి పోలీసులను, యువకుడి కుటుంబ సభ్యులను నమ్మించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగుచూసింది. దేవీనగర్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దేవీనగర్ ప్రాంతానికి చెందిన జి.అజయ్‌కుమార్(19) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి నలుగురు స్నేహితులతో కలిసి పార్టీ చేసుకునేందుకు సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లారు. సుమారు రాత్రి 10 గంటల సమయంలో అజయ్‌కుమార్ మూత్ర విసర్జనకు రైలు పట్టాల పక్కకు వెళ్లాడు. అదే సమయంలో అటుగా వస్తున్న గూడ్స్ రైలు అజయ్‌కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన అతడ్ని స్నేహితులు ప్రభుత్వాసుపత్రికి తరలిచారు.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ..

అజయ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్చిన స్నేహితులు అక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడినట్టుగా చెప్పడంతో చికిత్స చేసిన వైద్యులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైలు ప్రమాదాన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రించేందుకు మృతుడి మోటారు సైకిల్‌ను పగలకొట్టి బైక్‌పై నుంచి పడిపోయినట్టు పోలీసులకు స్నేహితులు కథ అల్లారు. అయితే ఘటనా స్థలాన్ని పరిశీలించగా అక్కడ రోడ్డు ప్రమాదం జరిగినట్టు ఎటువంటి ఆధారం పోలీసులకు లభించలేదు. దీంతో గట్టిగా నిలదీయడంతో అసలు విషయాన్ని చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు కేసును రైల్వే పోలీసులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదంగా చిత్రించే ప్రయత్నంపైనా.. పార్టీ విషయం బయటకు తెలుస్తుందనే భయంతోనా.. లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



స్నేహితులు పగల కొట్టిన ద్విచక్రవాహనం, అజయ్ (ఫైల్)

పాలకాయితిప్ప బీచ్ గేట్లు మూసివేత

కోడూరు : పాలకాయితిప్ప బీచ్ గేట్లను ఫారెస్టు అధికారులు బుధవారం మూసివేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున బీచ్ వద్దకు యాత్రికులను అనుమతించటం లేదని, ఈ మేరకు పాలకాయితిప్ప వద్ద బీచ్‌గేట్లు మూసివేసినట్టు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చిన తర్వాత గేట్లు తెరుస్తామని తెలిపారు.యాత్రికులు గమనించాలని కోరారు.

దుమారం!

(5వ పేజీ తరువాయి)

తెలిసి, విచారించిన తర్వాత కొంతమందికి మాత్రమే నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా కేఆర్ సూర్యనారాయణ, రమేశ్‌కు నోటీసులు ఇవ్వకపోవడం మిగిలిన ఉద్యోగుల్లో అసంతృప్తి మంటలు రేగుతున్నాయి. సంఘాలకు నాయకులుగా వ్యవహరించిన వారిని వదిలేసి మిగిలిన ఉద్యోగులను బలిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న ఉద్యోగులు వర్గాలుగా విడిపోయారు. విచారణాధికారుల తీరుపైనా విమర్శలు చేస్తున్నారు. 2022లో జరిగిన ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను వాంగ్మూలంగా ఇచ్చామని చెబుతున్నారు. పెద్దలుగా ఉన్న వారిని వదిలేసి తమపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికే చేస్తున్నారని మండిపడుతున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103,111, 122
చికెన్ విత్ స్కిన్	192
చికెన్ స్కిన్‌లెస్	202

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 610

యోగా కరాటే దీక్షారంభ ముగింపు



మొగల్రాజపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన దీక్షారంభ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, వ్యక్తిగత రక్షణ నిమిత్తం కరాటేలో ప్రాథమిక అంశాలను సిద్ధార్థ యోగా సెంటర్ నిపుణులు, కరాటే కోచ్ జె. విజయకుమార్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

స్టెల్లాలో హార్టీ ఎక్స్‌పో

పటమట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని మారిస్ స్టెల్లా కళాశాలలో అగ్రికల్చర్ అండ్‌రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో హార్టీ ఎక్స్‌పోను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న చదువును రైతుల వరకు తీసుకువెళ్లి, సరికొత్త ఆవిష్కరణలతో వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడుతున్నాయని అన్నారు. అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ హెడ్ డాక్టర్ పి లక్ష్మణస్వామి విద్యార్థులచే తయారు చేయబడ్డ వివిధ వ్యవసాయ, ఉద్యానవన కృషి నమూనాలను వివరించారు. రైతు స్ఫూర్తి సంఘం ఉలవపాడు వారి సేంద్రీయ ఎరువులతో పెంచిన పూలు, పండ్లు, ఆకుకూరల మొక్కలు పెంచే వ్యవసాయ నిపుణులు ఉత్పత్తులను పరిచయం చేశారు.

నత్తనడకన రహదారి పనులు

● సన్‌లైట్ సెంటర్ వద్ద కల్వర్టు పనులు పూర్తయినా జాప్యం ● మూసేసిన రోడ్డు ●వాహనదారుల ఇబ్బందులు



సన్‌లైట్ సెంటర్ వద్ద రహదారిపైనే మట్టి, అసంపూర్తిగా పనులు

(ఆటోనగర్, ఆంధ్రజ్యోతి)

ఆటోనగర్ సన్‌లైట్ సెంటర్ వద్ద రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడు నెలలు పూర్తి కావొచ్చినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. సన్‌లైట్ సెంటర్ వద్ద డ్రెయినేజీ నిర్మాణం చేసి మూడు అడుగుల మేర రహదారి ఎత్తు పెంచే విధంగా రూ.22 లక్షలతో ఐలా కాంట్రాక్టు ఇచ్చింది. 28 మీటర్ల కల్వర్టు పనులు పూర్తయినా రహదారి పనుల్లో తీవ్ర జాప్యమవుతోంది. ప్రారంభంలో పనులు త్వరగా పూర్తి చేసి రహదారి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పినా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నెలలు గడుపుతున్నారే కానీ పనులు చేయడంలో కాంట్రాక్టర మీనమేషాలు లెక్కిస్తున్నారు. పనులకు తగ్గ బిల్లులు అందుకుంటున్నా నిర్మాణ పనులు పూర్తి చేయడంలో కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. రహదారి పనులు పూర్తికాకపోవడంతో అటుగా వెళ్లే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా కల్వర్టు నుంచి తీసిన పూడికతీతను రహదారి మధ్య వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మట్టి దిబ్బలు రహదారిపై అడ్డంగా పోయడంతో నాలుగు రోడ్డు సెంటర్ వద్ద రహదారి మూసేయాల్సి వచ్చింది. భారీ వాహనాలు ఆ సెంటర్ నుంచి కాకుండా పక్కన ఉన్న చిన్న రోడ్డులో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ రహదారిలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరతగతిన సన్‌లైట్ సెంటర్‌లో రహదారిని పూర్తిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీస్ కమిషనరేట్లో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



సీపీకి కేక్ తినిపిస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్, ట్రాన్స్ కో కార్యాలయంలో జరిగిన వేడుక

గుణదల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్లో సెమీక్రిస్మస్ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ముందుగా సిబ్బందికి సెమీక్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన కథెడ్రిల్ చర్చి మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వలప్రసాద్ కేక్ కట్ చేసి సీపీకి తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు ప్రభు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి వారి వారి జీవితాలను బంగారుమయం చేసుకోవాలన్నారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తి నాయుడు, ఏ.ఓ.సునీత, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమయ్య, ఏసీపీలు, పరిపాలనా విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో..

గుణదల్లోని ఏపీ ట్రాన్స్‌కో ప్రధాన కార్యాలయలో సెమీక్రిస్మస్ వేడుక బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీసీపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అజ్మీర్ రాందాస్ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసి సంస్థకు మంచి పేరుతేవాలని కోరారు. అనంతరం సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరో అధికారి కె.వెంకటేశ్వర్లు, పాస్టర్ మల్లెల పరమేశ్వరరావు, గుడేటి దీపక్, ఆదాం, థామస్, యేసు రత్నం తదితరులు పాల్గొన్నారు.

లయోలా కళాశాల ఎదుట వాకర్స్ నిరసన నేడు

భారతీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లయోలా గ్రౌండ్స్‌లో వాకర్స్ నడవడానికి వీలు లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న విషయమై గురువారం నిరసన చేపడుతున్నట్లు అమరావతి వాకర్స్ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, సీపీలు కాలేజీ యాజమాన్యంతో సామరస్యంగా మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, వారు మాట్లాడినా నిర్ణయం తీసుకోవడానికి ఇంకా సమయం కావాలంటూ కాలేజీ యాజమాన్యం కాలయాపన చేస్తుందని వాకర్స్ సభ్యులు తెలిపారు. కాలేజీ యాజమాన్యంపై ఒత్తిడి పెంచి త్వరగా నిర్ణయం తీసుకునే విధంగా చేయాలనే ఉద్దేశ్యంతో వాకర్స్ అంతా కలిసి గురువారం ఉదయం 6గంటలకు లయోలా కళాశాల గేట్ దగ్గర శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు అమరావతి వాకర్స్ సభ్యులు తెలిపారు. ఈ నిరసనకు అధిక సంఖ్యలో సభ్యులు తరలిరావాలని అమరావతి వాకర్స్ సభ్యులు ప్రకటనలో తెలిపారు.

22న పీబీ సిద్ధార్థలో సీనియర్ సిటిజన్స్ రజతోత్సవ సభ

మొగల్రాజపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆవిర్భవించి 25 ఏళ్లు గడచిన సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఈనెల 22న పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య శిబిరం, వివిధ రంగాల్లో ఉన్న వయోవృద్ధులకు సత్కారం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆటోనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతు ప్రభుత్వాసుపత్రిలో బుధవారం మృతి చెందినట్లు పటమట పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు జి. ఏడుకొండలు(40) చిత్తు కాగితాలు సేకరించి జీవనం సాగిస్తుంటారు. అతనికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం అర్ధరాత్రి 2.30కు ఆటోనగర్ బస్‌స్టేషన్ ఎదుట రోడ్డు దాటుతుండగా పెనమలూరు వైపు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు.

లయోలాలో గణిత-24 రాష్ట్రస్థాయి మహోత్సవం



విజేతలతో వైస్‌ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు, తదితరులు

భారతీనగర్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోలా కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో గణిత-24 రాష్ట్రస్థాయి మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్యూబ్ సాల్వింగ్, గణిత రీడిల్స్, సుడొకో, మెమరీ గ్రిడ్, పోస్టల్ ప్రెజెంటేషన్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు ఆచార్య త్రిమూర్తి, జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య త్రిమూర్తి మాట్లాడుతూ గణితశాస్త్రానికి, కంప్యూటర్ టెక్నాలజీకి గల సంబంధాన్ని వివరించారు. ప్రొఫెసర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గణితశాస్త్ర పరిశోధనలో విద్యార్థులు పట్టు సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. అనంతరం పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ జి.కిరణ్‌కుమార్, కరస్పాండెంట్ ఫాదర్ సగయరాజ్, గణితశాస్త్ర విభాగాధిపతి కె.అనురాధ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ వైద్య కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. వైద్య కళాశాలలో పిచ్చి మొక్కల సాగు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో కళాశాల యాజమాన్యం కళ్లు తెరిసింది. సిబ్బందిని పెట్టి పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించే పనులు ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ కుమార్ తెలిపారు. కళాశాల, హాస్టల్‌లో పారిశుధ్య పనులు పూర్తి చేసి పరిసరాల పరిశుభ్రత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుందామనుకున్నామని ఈలోగా పిచ్చి మొక్కలు పెరిగాయని ఆయన వివరణ ఇచ్చారు. పూర్తిగా పరిసరాలను పరిశుభ్రం చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, విష సర్పాలు సంచారం లేకుండా చేస్తామని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

పీబీ సిద్ధార్థలో రాష్ట్రస్థాయి విభవ రేపు



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్

మొగల్రాజపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయ కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల సమ్మేళనం విభవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విభవ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, కోడింగ్ డీ కోడింగ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, మిస్టర్ అండ్ మిస్ విభవ, ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని కళాశాలల నుంచి ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంటెక్ కంప్యూటర్స్ పీజీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్, విభవ కన్వీనర్ బి. రోజ్ ప్రిసిల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

వంద మందికి సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సజ్జా రత్నకుమార్, డైరెక్టర్ సజ్జా జ్యోతి

ఆటోనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సియ్య ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో 100 మంది క్రైస్తవులకు రూ.1.50 లక్షల విలువైన నిత్యావసర సరుకులను సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా దైవ సేవకులు డాక్టర్ సజ్జా రత్నకుమార్ బుధవారం అందజేశారు. మెస్సియ ఫెలోషిప్ డైరెక్టర్ సజ్జా జ్యోతి, సంస్థ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కూటమి కృషి



షాదీఖానా భవనాన్ని పరిశీలిస్తున్న గద్దె రామ్మోహన్

లబ్బీపేట డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల అవసరాలు తీర్చడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఏమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. బుధవారం 19వ డివిజన్‌లో పర్యటించిన ఆయన స్థానిక సమస్యలు ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు, అనంతరం డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న షాదీఖానా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాదీఖానా బిల్డింగ్‌పై మరో అంతస్థు నిర్మాణం చేయడానికి అంచనాలు సిద్ధం చేయాలని, మరికొంత స్థలాన్ని సేకరించి షాదీఖానా పరిసరాలు విశాలంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. స్థానికుల కోరిక ప్రకారం కాలువగట్టుపై వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కాలువ గట్లు, ర్యాంపులు, మెట్లు కట్టించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు భాగం సాయి ప్రసాద్, కార్పొరేషన్ ఈఈ సామ్రాజ్యం, కంచర్ల శ్రీను, గద్దె రమేష్, ఫిరోజ్ పాల్గొన్నారు.

విద్యార్థి అభిరుచికి అనుగుణంగా బోధన చేయాలి

ఎస్ఎస్ఎం కరస్పాండెంట్ బ్రదర్ మోంటీ



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పటమట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి అభిరుచిని గమనించి తదనుగుణంగా బోధించినట్లయితే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని ఎస్ఎస్ఎం పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ మోంటీ తెలిపారు. ఎస్ఎస్ఎం పాఠశాల ప్రైమరీ విద్యార్థుల వార్షికోత్సవ వేడుక బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్పెయిన్‌కు చెందిన కీళ్లఎముకల వైద్య నిపుణులు డాక్టర్ కిశోర్‌కుమార్, మంగళగిరి ఎయిమ్స్ అసిస్టెంట్ డీన్ డాక్టర్ ఆర్తిగుప్తలు హాజరయ్యారు. కిశోర్‌కుమార్ మాట్లాడుతూ మనందరం ప్రకృతిని పరిరక్షించుకుంటే మనల్ని మనం రక్షించుకున్న వాళ్లమవుతామన్నారు. ఎస్ఎస్ఎం విద్యార్థులు చదువును మాత్రమే కాకుండా వివిధ అంశాలపై పట్టు సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు కార్యక్రమాలు అలరించాయి.



ఇళ్ల స్థలాలు, రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్న 26వ డివిజన్ వాసులు

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

గుణదల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ 26వ డివిజన్ వాసులు రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించారు. స్థానిక 26వ డివిజన్లోని 29, 30, 31 సచివాలయాల పరిధిలో ఆ ప్రాంత వాసుల కోసం రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సులో కొంతమంది ఇళ్ల స్థలాలు కేటాయించాలని అర్జీలు సమర్పించగా, కాకానినగర్‌వాసులు ఇళ్ల రిజిస్ట్రేషన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. సదస్సుకు హాజరైన 26వ డివిజన్ ఇన్‌చార్జి వల్లభనేని సతీష్ సదరు సమస్యను ఎమ్మెల్యే బొండా ఉమా దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, కారంపూడి సత్య, కడియం ప్రకాష్, బాడిత శంకర్, హరిబాబు, సీతోల బాబు, సింహాచలం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ ఇంటర్నేషనల్ కార్యకలాపాలపై అవగాహన



కృష్ణలంక, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ ఎస్‌డీసీ) ఎండీ అండ్ సీఈవో ఆదేశాల మేరకు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ ఇంటర్నేషనల్ యాక్టివిటీపై విస్తృత అవగాహన కల్పించడమే కాకుండా, నర్సులకు విదేశాల్లో లభ్యమవుతున్న ఉపాధి అవకాశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులకు వివిధ దేశాలలో అవసరమైన నైపుణ్యాలు, ఆర్థికాభివృద్ధికి అనువైన అవకాశాలు, గ్లోబల్ హెల్త్‌కేర్ రంగంలో ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ కిషోర్ కుమార్, జిల్లా ఏపీఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీవో ఎస్.శ్రీనివాసరావు, ఏపీఎస్ఎస్‌డీసీ అసోసియేట్ మేనేజర్ కె.చైతన్య పాల్గొన్నారు.

రెండు బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్

పెనమలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తాడిగడప మునిసిపాలిటీలో 2023-25 సంవత్సరానికి మూడో విడత లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యువల్ చేయించుకోవడంలో విఫలమయిన రెండు బార్ల ఈ-వేలానికి దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ శేషగిరిరావు తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తును 23లోగా సమర్పించాలన్నారు. 24న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాట్ల డ్రా తీసి బార్లను కేటాయిస్తారన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో ఏర్పాటు చేయదలచిన రెండు బార్లకు లైసెన్సు ఫీజులను రూ.78,26,250, రూ.76,72,250 నిర్ణయించినట్టు సీఐ తెలిపారు.

21న ఫెన్సింగ్ రాష్ట్ర పోటీలకు ఏర్పాట్లు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం డీఎస్ఏ హాల్లో రాష్ట్ర ఫెన్సింగ్ సీనియర్ పురుషులు, మహిళా ఛాంపియన్‌షిప్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ సెక్రటరీ జీఎస్‌వీ కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జిల్లా టీమ్‌ల ఎంపికలకు సరిపడా ఎలక్ట్రానిక్ పరికరాలు లేనందున, ఫెన్సింగ్ క్రీడాకారులను మాన్యువల్ విధానంలో ఎంపికల్లో ఆరోపణల వస్తున్నాయని, దీని వలన నిజమైన క్రీడాకారులందరూ తమ ప్రతిభను నిరూపించుకోవడానికి సమాన అవకాశాల కోసం పొరుగు రాష్ట్రం నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను తెప్పించామన్నారు. నిజమైన ఫెన్సింగ్ ప్లేయర్లు తమ ఎంట్రీలను గూగుల్ షీట్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. 21న ఉదయం 8 గంటల్లోగా పంపాలని, ఇతర వివరాలకు 9676352682,955352888 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి కృష్ణా రీజియన్ పాలిటెక్నిక్ స్పోర్ట్సు, గేమ్స్‌మీట్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్స్‌లో ఈనెల 20, 21న కృష్ణా రీజియన్ పాలిటెక్నిక్ కళాశాలల బాలబాలికల స్పోర్ట్సు, గేమ్స్ మీట్‌కు ఏర్పాట్లు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్, మీట్ కన్వీనర్ డాక్టర్ ఎం పార్థసారథి తెలిపారు. రీజియన్‌లో మొత్తం 23 కళాశాలల నుంచి 6 స్పోర్ట్సు, 14 గేమ్స్‌ల్లో మొత్తం 650 మంది క్రీడాకారులు తలపడుతున్నారన్నారు. పోటీలను ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించనున్నారు.

భవానీల దీక్ష విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ
- సీపీ, ఈవోతో కలిసి పరిశీలన



భవానీల దీక్ష విరమణ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, సీపీ రాజశేఖర్ బాబు, ఈవో రామారావు, వివిధ విభాగాల అధికారులు

వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న భవానీ దీక్షల విరమణలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, అమ్మవారి దర్శనం శీఘ్రంగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులతో కలిసి ఆయన క్షేత్ర స్థాయి పర్యటచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21నుంచి 25వరకు దీక్షాదారులు ఇరుముడులు సమర్పించి దీక్షలు విరమణ చేయనున్నారన్నారు. సుమారు 6 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించామన్నారు. విధి నిర్వహణలో అలక్ష్యం లేకుండా భక్తులకు శీఘ్రతరంగా దర్శనం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూలైన్లలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, నేలపై కాయర్ మ్యాట్‌లు, తాగునీటి పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. మైక్ ప్రసారం ద్వారా భక్తులు సూచనలు అందిస్తామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్ల వద్ద నిరంతర పారిశుద్ధ్యపనులను మునిసిపల్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. గిరి ప్రదక్షిణ, ఇతర ముఖ్యమైన రహదారుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశ్రాంతి ప్రాంగణాలను సిద్ధం చేస్తున్నామన్నారు. స్నాన ఘాట్ల వద్ద భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇరుముడుల స్వీకరణ, ఇరుముడులలోని టెంకాయల సమర్పణకు హోమగుండాల ఏర్పాటు, లడ్డూ ప్రసాదాల విక్రయాలు వంటివన్నీ పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించామన్నారు. స్నానఘాట్లలో వదిలివేసే ఎర్రటి వస్త్రాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ దీక్షల విరమణలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చామని, ఈ యాప్ ద్వారా భక్తులకు కల్పించిన మౌలిక సదుపాయాలను తెలుసుకోవచ్చన్నారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని ముఖ్య ప్రాంతాలు, కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ పారిశుద్ధ్య అంశానికి సంబంధించి ప్రత్యేక టీమ్‌లను సిద్ధం చేశామని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించేందుకు పటిష్ఠ ప్లాన్‌ను తీసుకున్నామన్నారు. ఈవో రామారావు మాట్లాడుతూ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుతంగా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లడ్డూ ప్రసాదానికి కొరత లేకుండా చూస్తున్నామన్నారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ చైతన్య, ఈఈలు కోటేశ్వరరావు, వైకుంఠరావుతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. దీక్షల విరమణలకు పోలీసు రెవెన్యూ, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. డ్రోన్ సాంకేతికత, యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఘాట్లలో స్విమ్మర్లు, బోట్లు, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచాలని, మత్స్య శాఖ అధికారులకు సూచనలు చేశారు.

దుర్గమ్మకు కానుకల ఆదాయం రూ.3.68 కోట్లు



ఇంద్రకీలాద్రిపై ఒలువైన దుర్గమ్మ సన్నిధిలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను 21 రోజులకుగాను బుధవారం మహామండపం 6వ అంతస్తులో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల నగదు రూ.3,68,90,834, బంగారం 560 గ్రాములు, వెండి 9 కిలోల 30 గ్రాములు లభించింది. యుఎస్ఏ డాలర్లు 519, ఆస్ట్రేలియా డాలర్లు 80, ఒక కువైట్ దినార్, 204 ఖతార్ రియాల్స్, 165 ఎమిరేట్స్ దిర్హమ్స్, 516 మలేషియా రింగేట్లు, 130 సౌదీ అరేబియా రియాల్స్, 60 కెనడా డాలర్లు, 1700 ఒమాన్ బైంసాలు, ఒక రియాల్, 916 సింగపూర్ డాలర్లు, 55 మాల్దీవుల రూపియాలు హుండీల్లో లభించాయి. ఆన్‌లైన్‌లో రూ.1,16,429 చేకూరింది. డిప్యూటీ ఈవో రత్నరాజు, దేవాదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, సిబ్బంది, ప్రత్యేక పోలీసులు, వన్‌టౌన్ సిబ్బంది, అమ్మవారి సేవాదారులు పాల్గొన్నారు.

దీక్ష విరమణధారులకు ఊతంగా సాంకేతికత



భవానీ దీక్షా విరమణదారులకు ఊతంగా సరికొత్త యాప్‌ను రూపొందించామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. విజయవాడలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబుతో కలిసి యాప్ పనితీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దేవస్థానం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భక్తులకు సాంకేతికంగా ఊతం ఇచ్చేందుకు ఉపకరిస్తుందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దర్శనాల బుకింగ్, దర్శనాల సమయం, ప్రసాద కౌంటర్లు, పూజా విధానాలు, అందుబాటులో ఉన్న రవాణ సౌకర్యాలు, పార్కింగ్ ప్రదేశాల్లో రద్దీ, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, ఫిర్యాదుల నమోదు, అత్యవసర ఫోన్ నెంబర్లు, ప్రత్యేక కార్యక్రమాల వివరాలు, ఇలా సమస్త సమాచారం అందులో ఉంటుందన్నారు. ఐయానిక్ డాట్ స్టార్టర్ భవానీ లింక్ ద్వారా యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చునన్నారు. దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ కమిటీ చైర్మన్ ఎన్నిక లాంఛనమే!

- 'కోట' నియామకంపై జిల్లా ప్రజాప్రతినిధుల సమ్మతి
- సానుకూలంగా స్పందించిన చంద్రబాబు



ఎన్ఎస్‌పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన విప్ తంగిరాల సౌమ్య, కోట వీరబాబు

నందిగామ, డిసెంబరు 18: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎన్టీఆర్ జిల్లా నేతలు ఏకతాటిపైకి వచ్చారు. జిల్లాకు చెందిన సీనియర్ నేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట వీరబాబుకు ఈ పదవి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రాజెక్ట్ పరిధిలో మూడొంతుల ఆయకట్టు, అదేస్థాయిలో కాలువల విస్తీర్ణం ఉన్న తమ జిల్లాకు ఈ పదవి అప్పగిస్తేనే రైతులకు మేలు జరుగుతుందని వారు భావిస్తున్నారు. మొత్తం ప్రాజెక్ట్ పరిధిలో 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలుండగా, 13 కమిటీలు ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లో రెండేసి కమిటీలు మాత్రమే ఉన్నాయి. ఏకపక్షంగా జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో మొత్తం కమిటీలను కూటమి సొంతం చేసుకుంది. ఎలాంటి వివాదాలు లేకుండా డిస్ట్రిబ్యూటరీ కమిటీలు కూడా ఎమ్మెల్యేలు సూచించిన వ్యక్తులే దక్కించుకున్నారు. ఈ క్రమంలో అందరి దృష్టి ఈనెల 21న జరిగే ప్రాజెక్ట్ కమిటీ ఎన్నికపై పడింది. ప్రాజెక్ట్ పరిధి అధిక భాగం జిల్లా పరిధిలో ఉన్నందున ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తికే పదవిని కట్టబెట్టాలని జిల్లా ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. ఇప్పటికే రేస్‌లో కోట ఉండడంతో మద్దతు తెలిపారు. జిల్లాలో రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, కొలికపూడి శ్రీనివాస్ ఆయనకు సిఫార్సు లేఖలు అందించారు. విప్ సౌమ్య ఒకడుగు ముందుకు వేసి మంగళవారం వీరబాబును సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లారు. చైర్మన్ పదవిని ఆయనకు కేటాయించాలని కోరారు. జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీ కేశినేని, పార్టీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం ఇచ్చిన సిఫార్సు లేఖలను వీరబాబు సీఎంకు అందజేశారు. ప్రాజెక్ట్ పరిధి 80 శాతం ఎన్టీఆర్ జిల్లాలో ఉందని, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆయకట్టు వివరాలను తెలిపారు. వీరబాబు చెప్పిన వివరాలను విన్న చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అందరితో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వీరబాబు నియామకం దాదాపు ఖరారైనట్లు స్థానిక నేతలు భావిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న వీరబాబు పలు పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతతో మంచి సంబంధాలున్నాయి. మొత్తం మీద ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి వీరబాబుకు దక్కడం లాంఛనంగా కనిపిస్తోంది.

హస్తకళాకారుల ఉత్పత్తులకు మార్కెటింగ్



స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న నాబార్డు సీజీఎం గోపాల్ తదితరులు

లబ్బీపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామీణ హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రైవేటు షాపింగ్ మాల్స్ నందు స్టాల్ ఇన్ మాల్స్ నిర్వహిస్తున్నామని నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. నాబార్డ్ ఆర్థిక సహాయంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధర్యంలో పీవీపీ మాల్‌లో ఏర్పాటు చేసిన స్టాల్ ఇన్ మాల్ ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా గతేడాది నిర్వహించిన చేనేత వస్త్రాలు, జ్యూట్ బ్యాగులు, కలంకారీ వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ముత్యాల దండల ప్రదర్శన వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకోవడంతో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం కర్నూల్‌కు చెందిన మిరాకిల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్స్ వస్త్రాలు, కేదారేశ్వర పేటకు చెందిన వేళాంగిణి మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ జ్యూయలరీ వస్తువులు కొండపల్లి కనకదుర్గ డ్వాక్రా గ్రూప్ ఆధ్వర్యంలో కొండపల్లి బొమ్మలు, వేంకటగిరికి చెందిన మూన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేంకటగిరి చీరలు, నేత వస్త్రాలు వంటివి ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. 30 మందికి పైగా బృందంగా ఏర్పడి ముందుకొస్తే వారు ఎంచుకున్న రంగంలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నేస్తం సంస్థ సీఈవో వి.సురేష్ మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో గత ఏడాది విశాఖపట్నం, విజయవాడలో స్టాల్ ఇన్ మాల్ నిర్వహించగా, ఇప్పుడు 90 రోజుల ప్రదర్శన నిర్వహిస్తున్నామని, ఒక్కో కళాకారుడు 15 రోజుల పాటు ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించుకునేలా అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, నేస్తం డైరెక్టర్ కె.నందిని, విక్రమ్, గోపి, సహాయక బృందాల మహిళలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగర్ కాలువలకు పూర్వవైభవం

- నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ



నందిగామ, డిసెంబరు 18: సాగర్ కాలువలకు పూర్వ వైభవం తీసుకువచ్చి చివరి భూమల వరకూ నీటిని అందించేందుకు శక్తి వంచన లేకుండా పనిచేస్తానని నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన చంద్రశేఖర్ బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఎన్ఎస్‌పీ కాలువలు అధ్వాన్నంగా తయారయ్యాయన్నారు. కనీస మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఎక్కడ చూసినా కంప చెట్లతో నిండి ఉన్నాయన్నారు. తొలత కంప తొలగింపు చేపడతామన్నారు. విడుదలైన ప్రతి చుక్క నీరూ పంట పొలాలకు అందేలా కాలువలను తీర్చిదిద్దుతామన్నారు. ఆయకట్టులోని 21900 ఎకరాల భూమికి నీటిని అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. 21 కిలోమీటర్ల మేర ఉన్న కాలువలను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సహకారంతో అభివృద్ధి పరుస్తానన్నారు. వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ప్రభుత్వం ముందుకు రావడం మంచి పరిణామమన్నారు. సాగర్ నీటితో పాటు వేదాద్రి నీటిని చివరి భూముల వరకూ అందించేందుకు కృషి చేస్తానన్నారు.

జమ్మూకశ్మీర్‌పై కర్ణాటక ఇన్నింగ్స్ విజయం

- విజయ్ మర్చంట్ క్రికెట్‌లో అద్భుత విజయం



విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మూలపాడు ఏసీఏ క్రికెట్ గ్రౌండ్స్ వేదికగా జరుగుతున్న బీసీసీఐ విజయ మర్చంట్స్ ట్రోఫీ క్రికెట్‌లో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో సత్తా చాటిన కర్నాటక అండర్-16 జట్టు జమ్మూకాశ్మీర్‌పై ఇన్నింగ్స్ 149 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బుధవారం ఒకేరోజు జమ్మూకాశ్మీర్ జట్టు 19 వికెట్లను కర్ణాటక జట్టు నేలకూల్చి అద్భుతం చేసింది. తొలి వికెట్‌కు 10 పరుగుల ఇన్నింగ్స్ రెండో రోజు ఆట కొనసాగించిన జమ్మూ కాశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 75 పరుగులకు ఆలౌటయ్యి, ఫాలో ఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లో ఈ జట్టు కేవలం 124 పరుగులకు కుప్పకూలి పరాజయం పాలైంది. కర్ణాటక విజయంలో అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌ల్లో అధర్వ్ 54 పరుగులు, రెండు ఇన్నింగ్స్‌ల్లో 8 వికెట్లను నేలకూల్చి సత్తా చాటాడు. ఈ విజయంతో కర్ణాటకకు 7 పాయింట్లు లభించాయి. ఉత్తరాఖండ్- జార్ఖండ్ మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 274/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించి 433/8 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది. ఈ జట్టు బ్యాటర్స్ కోరంగ 162, మయాంక్ ముదిల 150 పరుగులు చేసి సెంచరీలతో కదం తొక్కారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జార్ఖండ్ జట్టు బుధవారం ఆట ముగిసే సమయానికి 164/5 పరుగులతో నిలిచింది. ఇంకా ఆ జట్టు 269 పరుగులు వెనుకంజలో ఉంది.

రూ.6.48 కోట్లతో సుందరీకరణ పనులు

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



విమానాశ్రయం సుందరీకరణ పనులపై అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి కీలకమైన గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ రూరల్ రామవరప్పాడు వరకు చేపడుతున్న గ్రీనరీ సుందరీకరణ పనులు చెన్నై, బెంగుళూరును తలదన్నేలా ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం అయోధ్యనగర్‌లోని ఏపీజీ అండ్ బీసీ కార్యాలయంలో 13 కిలోమీటర్ల మేర 6.48 కోట్ల నిధులతో చేపడుతున్న బ్యూటిఫికేషన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిథులు మెచ్చేలా ఆహ్లాదకరంగా ఉండేలా సుందరీకరణ చేయాలనీ సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అన్ని శాఖల అధికారులు ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. పశువులు, గ్రీనరీ పాడు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవేపై లైటింగ్ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని తాను ఈ సమస్యపై ఎన్నిసార్లు చెప్పిన పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. బ్యూటిఫికేషన్‌లో పలు సమస్యలున్నాయని పరిష్కారించాలన్నారు. విమానాశ్రయం అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని అందుకు తగినట్టు అధికారులు పనులను చేయాలని స్పష్టం చేశారు. ఏపీజీ అండ్ బీసీ ఎండీ రాజశేఖర్ రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ హెచ్ఈ నాగేశ్వరరావు, గన్నవరం సీఐ శివ ప్రసాద్, పటమట ఎస్సై హరికృష్ణ, గుణదల ఈఈ రామ మూర్తి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఎంకే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

గుణదల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ చదువుతున్న వారిలో నైపుణ్యతను వెలికితీసేందుకు ప్రధాని మోదీ జాతీయస్థాయిలో చేపెట్టిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొన్న అమరావతి ఎస్ఆర్ఎం వర్శిటి టీమ్ ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. నగరానికి చెందిన ఆరుగురు ఈ టీమ్‌లో ప్రతిభకనబర్చారు. కేంద్రం ప్రభుత్వం వీరికి రూ.లక్ష నగదు బహుమతిని అందజేసింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్శిటీలో సీఎస్ఈ 4వ సంవత్సరం చదువుతున్న వీరు జాతీయ స్థాయిలో 11, 12న జమ్ము కాశ్మీర్‌లోని ఐఐటీలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా పోటీల్లో పాల్గొన్న వారందరితో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా సమావేశమయ్యారు. తర్వాత నిర్వహించిన పోటీల్లో 254 సంస్థల నుంచి హాజరైన ప్రతినిధులు ప్రతిపాదించిన పలు సాంకేతిక అంశాల్లో ఏపీ నుంచి వెళ్లిన వీరు ది నేషనల్ క్రిటికల్ ఇన్ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొటెక్షన్ సెంటర్ ఇచ్చిన సైబర్ క్రైమ్‌కు సంబంధించిన అంశాన్ని పరిష్కరించి ప్రతిభ చాటుకున్నారు. ప్రధాన మంత్రి సందేశం తమకెంతో ఆదర్శంగా ఉందని మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న టీమ్ తెలిపింది. టీమ్ సభ్యులు ఎం.ఆకాష్, జె.సికిందర్, ఎస్.శశాంక్, బి.సాద్విక్, పి.చెరిష్, జె.ప్రణతి మాట్లాడుతూ తాము ఈ స్థితికి చేరుకోవడానికి ఎస్ఆర్ఎం వర్శిటీ యాజమాన్యం ఎంతగానో సహకరించిందన్నారు. తమతోపాటు 88వేల టీమ్‌లు పాల్గొన్నాయన్నారు. పలు సమస్యలను తమ దృష్టికి తీసుకురావడానికి దేశంలోని 254 సంస్థలు పాల్గొన్నాయన్నారు. అవి తమ ముందుంచిన సమస్యలను 36 గంటల్లో పరిష్కరించి ప్రదర్శించాలన్నారు. చివరకు ఫైనల్స్‌కు 5 టీమ్‌లు చేరుకోగా తాము మొదటి స్థానంలో నిలవటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

నూరేండ్ల నా ఊరు పాటకు

రేపు గాయనీ, గాయకుల ఎంపిక



వన్‌టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతీ సంప్రదాయాలు, మానవీయ విలువలను భావితరాలకు అందించాలని 243 చరణాలతో రచించిన 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యాన్ని పాడించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల నుంచి 243 మంది గాయనీ గాయకులను ఎంపిక చేయనున్నట్టు కవి, రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విజయవాడ గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ శ్రీ నివాస్ మాట్లాడుతూ నూరేండ్ల నా ఊరు గేయ కావ్యాన్ని 243 మంది గాయనీ గాయకులతో సంయుక్తంగా ఆలపించేందుకు గాయకుల ఎంపిక ప్రక్రియను ఈనెల 20న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హనుమాన్ పేటలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కోస్తాంధ్ర జిల్లాలోని ఔత్సాహిక గాయనీ గాయకులు తరలివచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాయనీ గాయకులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివరాలకు 95739 89134, 90008 52227 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ధ్వని అనుకరణ చక్రవర్తి భవిరి రవి, అంతర్జాతీయ జానపద కళాకారులు దామోదర గణపతిరావు, కవి, గాయకులు ఎం.వి.మల్లిక్ తేజ్, గాయకులు జోపాక శివ, మహేష్ గూడూరు పాల్గొన్నారు.



పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి

- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్

ధర్నాచౌక్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల పెండింగ్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, పీఆర్సీ కమిషన్ తక్షణమే నియమించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో విజయవాడ నగరశాఖ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల స్నేహపూర్వకంగా ఉంటోందన్నారు. ఉద్యోగుల బకాయిల అంశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సాధ్యమైనంత త్వరగా బకాయిల చెల్లింపునకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడంలో ఉద్యోగులు మరింత కృషి చేసి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగుల సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరాధ్యక్షుడు సీహెచ్‌వీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సంఘంలో నగర శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా నేత ఆదేశాలు, సూచనలను అమలు చేయడం, ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో నగర తనదైన ముద్ర వేసుకుందన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పదవికి ఏ విద్యాసాగర్‌ను ఎన్నుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.సత్యనారాయణరెడ్డి, పి.రమేష్, బి.సతీష్ కుమార్, నగర సభ్యులు షేక్ నాజీరుద్దీన్, డీఎస్ఎన్.శ్రీనివాసరావు, బి.రాజశేఖర్, వీపీ.ప్రసాద్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్‌కు ఎన్టీఆర్ వర్శిటీ టీమ్



ఎన్టీఆర్ వర్శిటీ బాస్కెట్‌బాల్ టీమ్‌తో వీసీ నర్సింహం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొట్టాయంలోని మహాత్మాగాంధీ వర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 24 వరకు జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ బాస్కెట్‌బాల్ మహిళా టోర్నీకి డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ జట్టు అక్కడకు పయనమైందని వర్సిటీ స్పోర్ట్సు బోర్డు సెక్రటరీ ఈ త్రిమూర్తి తెలిపారు. ఎంపికైన టీమ్ సభ్యులు బీ లీలా ధరణి, ఎన్ మానస, ఎస్ఎస్ఐ వైష్ణవి, పీ మల్లిక, సీహెచ్ శ్రీ సైమ్య, బీ శ్రీసాయి జ్యోతిర్మయి, డీ వైష్ణవి, వై నేహా, ఈ మృదుల, ఏ రుక్మిణి సీతాలను వర్సిటీ వీసీ డాక్టర్ డీవీఎస్ఎల్ నర్సింహం, రిజిస్ట్రార్ వీ రాధికారెడ్డి అభినందించారు. టీమ్‌కు కోచ్‌గా ఎన్ నల్లయ్య, మేనేజర్‌గా జే సిల్విబాబు వ్యవహరించనున్నారు.









పుట్టిన రోజున ప్రమాణ స్వీకారం



తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా నియమితులైన ప్రముఖ నిర్మాత దిల్ రాజు(వెంకటరమణారెడ్డి) బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన పుట్టినరోజు కావడం గమనార్హం. కుటుంబ సభ్యులతో ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తనకు కీలక బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ సందర్భంగా దిల్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ 'చెన్నై నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తెలుగు చిత్ర పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందింది. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా ఇంకా అభివృద్ధి సాధించాలి. టీఎఫ్‌డీసీకి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తా. ప్రభుత్వానికీ, చిత్ర పరిశ్రమకు మధ్య వారధిగా పని చేస్తా. పరిశ్రమలోని అన్ని విభాగాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తా. తెలంగాణ సంస్కృతిని ఆధారంగా చేసుకుని సినిమాలు వచ్చేలా చూడాలి' అన్నారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు స్వీకరించిన దిల్ రాజుకు హీరో రామ్‌చరణ్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.



కాశీలో శివశక్తి

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో బన్నీ వాసు నిర్మిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. ఈ నెల 22న కాశీలో 'తండేల్' చిత్రం నుంచి శివశక్తి పాటను విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. జాతర నేపథ్యంలో సాగే గీతమిది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో నాగచైతన్య, సాయిపల్లవి శివ పార్వతుల నాట్య భంగిమలో కనువిందు చేశారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

'లాపతా లేడీస్'కు నిరాశే!

● ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో దక్కని చోటు



భారతీయ చిత్రం 'లాపతా లేడీస్'కు ఆస్కార్ అవార్డుల రేసులో నిరాశ ఎదురైంది. ఆమిర్‌ఖాన్ సతీమణి, 'దోబీ ఘాట్' ఫేమ్ కిరణ్‌రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఆస్కార్ అవార్డు కోసం ఉత్తమ విదేశీ చిత్రాల కేటగిరిలో మన దేశం నుంచి అధికారికంగా ఎంపికైన విషయం విదితమే. 'లాపతా లేడీస్' గొప్ప సందేశాత్మక చిత్రం కనుక తప్పకుండా ఆస్కార్ అవార్డ్ వస్తుందని అందరూ భావించారు. అయితే మంగళవారం ప్రకటించిన ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో 'లాపతా లేడీస్' లేకపోవడం అందరినీ నిరాశపరిచింది. అయితే భారతీయ నటి షహనా గోస్వామి ప్రధాన పాత్రలో సంజయ్ సూరి తెరకెక్కించిన 'సంతోష్' అనే హిందీ చిత్రం మాత్రం యూకే నుంచి ఎన్నికై ఈ షార్ట్ లిస్ట్‌లో ఉండడం కొంతలో కొంత ఊరట. 77వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అలాగే, రెండు సార్లు అకాడమీ అవార్డు అందుకున్న భారతీయ నిర్మాత గునీత్ మోంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన షార్ట్ ఫిల్మ్ 'అనుజ'. న్యూ ఢిల్లీ నేపథ్యంలో 9 ఏళ్ల బాలకార్మికురాలు జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా ఇది తెరకెక్కింది. లైవ్ యాక్షన్ షార్ట్ కేటగిరి జాబితాలో ఎంపికైన 15 లఘు చిత్రాల్లో 'అనుజ' ఒకటి కావడం విశేషం. వచ్చే ఏడాది జనవరి 17న ఫైనల్ నామినేషన్స్‌ను ప్రకటిస్తారు. మార్చి 3న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుంది.

విజయ్ సేతుపతి... యథార్థ సంఘటనల ఆధారంగా



యథార్థ సంఘటనల ఆధారంగా

విజయ్ సేతుపతి ప్రధాన పాత్రధారిగా వెట్రిమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'విడుదల 2' చిత్రం ఈనెల 20న విడుదలవుతోంది. వీరి కలయికలో గతంలో వచ్చిన 'విడుదల-1' చిత్రానికి ఇది కొనసాగింపు. నిర్మాత చింతపల్లి రామారావు ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "అణచివేతకు గురైన పీడిత వర్గాల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథే ఈ 'విడుదల - 2'. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన కొన్ని యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు వెట్రిమారన్ చెప్పారు. అందుకే తమిళ సినిమా అయినా మన నేటివిటీకి దగ్గరగా ఉంటుంది. పెట్టుబడిదారులను ఎదిరించి పీడిత వర్గాలకు ఎలా విముక్తి కలిగించారు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. ఈ చిత్రంలో విప్లవ నాయకుడు పెరుమాళ్ పాత్రకు విజయ్ సేతుపతి నూటికి నూరు శాతం న్యాయం చేశాడు. నక్సలైట్ పాత్రలో ఆయన నటన, భావోద్వేగాలను పండించిన తీరు అద్భుతం. ఈ చిత్రానికి ఇళయరాజా అందించిన నేపథ్య సంగీతం, పీటర్ హెయిన్స్ రూపొందించిన పోరాట ఘట్టాలు, మంజు వారియర్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ. మా బేనర్ శ్రీ వేదాక్షర మూవీస్‌పై నిర్మించిన శ్రీశ్రీ రాజావారు చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. 'డ్రీమ్‌గర్ల్' చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది" అని


హిట్టా.. బ్లాక్‌బస్టరా అనేది వారి చేతుల్లో ఉంది

- అల్లరి నరేశ్



"హనుమాన్ చిత్రం విజయంతో ఈ ఏడాది ఘనంగా ఆరంభమైంది. ఇప్పుడు 'బచ్చలమల్లి' సినిమా సక్సెస్‌తో ఈ ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమకు అదిరిపోయే ముగింపు ఇవ్వాలి' అని అల్లరి నరేశ్ ప్రేక్షకులను కోరారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'బచ్చలమల్లి' ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'నిర్మాత రాజేశ్ ఏ విషయంలోనూ రాజీ పడకుండా సినిమాను అన్ని హంగులతో నిర్మించారు. ఎంత కష్టమైనా అవసరమైనవన్నీ సమకూర్చారు. దర్శకుడు సుబ్బు ఈ సినిమా కథ చెప్పగానే నాకు బాగా నచ్చింది. ఈ సినిమాను హిట్ చేస్తారా, బ్లాక్ బస్టర్ చేస్తారా అనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంది. అయితే ఒక్కటి మాత్రం బలంగా నమ్ముతున్నాను. 'ఈ క్రిస్మస్ మనదే'' అన్నారు. దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ 'ఈ రోజు నేను దర్శకుడిగా మీ ముందుకు రావడానికి కారణమైన సాయిదుర్గాతేజ్, మారుతికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. బచ్చలమల్లి పాత్రను కేవలం నరేశ్ మాత్రమే చేయగలరు' అని చెప్పారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ "బచ్చలమల్లి' నా మనసుకు దగ్గరైన కథ. ఈ సినిమా కోసం నేను కూడా ప్రేక్షకుడిలా ఎదురుచూస్తున్నాను. నరేశ్ లేకపోతే 'బచ్చలమల్లి' లేదు. ఆయన మూడు గెటప్స్‌లో అలరిస్తారు' అని అన్నారు.

మ్యాక్స్ ఆగమనం అప్పుడే



కన్నడ హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మీ శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రలు పోషించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వంలో కలైపులి.ఎస్.థాను నిర్మించారు. ఈ నెల 27న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతున్నట్లు యూనిట్ ప్రకటించింది. సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ తెలుగు హక్కులను పొందింది. పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో సుదీప్ నటన ప్రేక్షకులను అలరిస్తుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: శేఖర్ చంద్ర

స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల్లో

రాధాకిషన్ దమానీ టాప్

స్విగ్గీ ఫౌండర్లు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డికి మూడో స్థానం

- హైదరాబాద్‌కు చెందిన 6 కంపెనీలు, 11 మందికి చోటు
- హురున్ ఇండియా-ఐడీఎఫ్‌సీ ఫస్ట్ లిస్ట్





ముంబై: స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల జాబితాలో డీమార్ట్ సూపర్ మార్కెట్ల అధిపతి రాధాకిషన్ దమానీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. 'టాప్-200 సెల్ఫ్‌మేడ్ ఆంత్రప్రెన్యూర్స్ ఆఫ్ ది మిలీనియా 2024' పేరుతో హురున్ ఇండియా-ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్ బ్యాంకింగ్ సంయుక్తంగా ఈ లిస్ట్‌ను విడుదల చేశాయి. ఈ జాబితా విడుదల కావడం ఇది రెండోసారి. ఈ ఏడాది కూడా దమానీ తన అగ్రస్థానాన్ని కొనసాగించారు. గడిచిన ఏడాది కాలంలో డీమార్ట్ సూపర్ మార్కెట్ల యాజమాన్య సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్ విలువ 44 శాతం పెరిగి రూ.3.42 లక్షల కోట్లకు చేరుకుందని ఆ నివేదికలో తెలిపారు. మరిన్ని విషయాలు..

● ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగంలోని జొమాటో ఫౌండర్ దీపిందర్ గోయల్, స్విగ్గీ వ్యవస్థాపకులు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి వరుసగా 2,3 స్థానాల్లో నిలిచారు. జొమాటో విలువ ఏడాది కాలంలో 190 శాతం వృద్ధి చెంది రూ.2.51 లక్షల కోట్లకు చేరుకుంది. కాగా, స్విగ్గీ మార్కెట్ విలువ 52 శాతం పెరిగి రూ.1.01 లక్షల కోట్లకు ఎగబాకింది.

● రూ.99,300 కోట్ల విలువైన మేక్ మైట్రిప్ వ్యవస్థాపకులు దీప్ కర్లా, రాజేశ్ మాగోవ్.. మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ (రూ.96,100 కోట్లు) ఫౌండర్ అభయ్ సోయ్ 4, 5 స్థానాలను దక్కించుకున్నారు.

● పాలసీ బజార్.కామ్‌కు (రూ.78,600 కోట్లు) చెందిన యశిష్ దహియా, అలోక్ బన్సల్ 6వ స్థానంలో ఉన్నారు. ఆన్‌లైన్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్11కు (రూ.66,500 కోట్లు) చెందిన భవిత్ సేథ్, హర్ష్ జైన్ 7వ స్థానం దక్కించుకున్నారు.

● ఆన్‌లైన్ బ్రోకింగ్ సేవల కంపెనీ జీరోధా (రూ.64,800 కోట్లు) ఫౌండర్లు నితిన్ కామత్, నిఖిల్ కామత్‌కు 8వ స్థానం లభించగా.. ఫిన్‌టెక్ కంపెనీ రేజర్‌పేకు (రూ.62,400 కోట్లు) చెందిన హర్షిల్‌మాథుర్, శశాంక్‌కుమార్ 9వ స్థానంలో ఉన్నారు.

● ఆన్‌లైన్‌లో సౌందర్య ఉత్పత్తులను విక్రయించే పోర్టల్ నైకా (రూ.56,600 కోట్లు) వ్యవస్థాపకురాలు ఫాల్గుని నాయర్ పదో స్థానాన్ని దక్కించుకున్నారు. స్వయంకృషితో ఎదిగిన 19 మంది మహిళా పారిశ్రామికవేత్తల విభాగంలో నాయర్‌దే అగ్రస్థానం.

● క్విక్ కామర్స్ పోర్టల్ జెప్టో (రూ.41,800 కోట్లు) వ్యవస్థాపకులైన కైవల్య వోహ్రా (21 ఏళ్లు), ఆదిత్ పలిచా (22 ఏళ్లు) ఈ జాబితాలోని అత్యంత పిన్న వయస్కులు. కాగా, ఐటీ కంపెనీ హ్యాపీయెస్ట్ మైండ్స్ వ్యవస్థాపకులు అశోక్ సూతా (81) అత్యంత పెద్దవారు.

● స్వశక్తితో ఎదిగిన పారిశ్రామికవేత్తలు అధికంగా ఉన్న నగరాల్లో 98 మందితో బెంగళూరు అగ్రస్థానంలో, హైదరాబాద్ 11వ స్థానంలో ఉన్నాయి.

● జాబితాలోని 200 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.36 లక్షల కోట్లుగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే 20 శాతం పెరిగింది. ఈ కంపెనీలు 10 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

తెలుగు ఆంత్రప్రెన్యూర్లు స్థాపించిన కంపెనీల వివరాలు

ర్యాంక్	కంపెనీ	విలువ(రూ.కోట్లు)	స్థాపన	వ్యవస్థాపకులు
3	స్విగ్గీ	1.01 లక్షలు	2013	శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి
25	దక్కన్ ఫైన్ కెమికల్స్	31,600	2006	వంశీ గోకరాజు, జీఎస్ రాజు
31	ఎంఎస్ఎన్ లేబొరేటరీస్	26,200	2003	ఎం సత్యనారాయణ రెడ్డి
34	లారస్ ల్యాబ్స్	24,900	2005	సత్యనారాయణ చావ
40	కిమ్స్ హాస్పిటల్స్	21,900	2000	భాస్కర్ రావు బొల్లినేని
98	ర్యాపిడో	9,200	2015	పవన్ గుంటుపల్లి
119	మెడ్‌ప్లస్	8,200	2006	మధుకర్ రెడ్డి గంగడి
142	బొండాడ ఇంజనీరింగ్	6,400	2012	రాఘవేంద్ర రావు బొండాడ
160	జగిల్ ప్రీపెయిడ్	5,300	2011	రాజ్ ఫణి
162	టీమ్‌లీజ్ సర్వీసెస్	5,200	2000	అశోక్ రెడ్డి

స్పిన్ యోధుడు ఆపేశాడు



ఎలాంటి ముందస్తు ప్రకటనా లేదు.. హంగూ ఆర్భాటం అసలే లేదు.. అస్సలు రిటైర్మెంట్ ఆనవాళ్లే కనిపించలేదు.. అందరిలోనూ ఆశ్చర్యం తప్ప అక్కడేమీ లేదు.. ఎన్నో అద్భుత ప్రదర్శనలు, మరెన్నో మరపురాని అనుభూతులు భారత క్రికెట్‌కు అందించిన రవిచంద్రన్ అశ్విన్ తన పద్నాలుగేళ్ల సుదీర్ఘ ప్రయాణానికి అనూహ్య ముగింపు పలికాడు. ఆస్ట్రేలియా గడ్డపై జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మూడో టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

అశ్విన్ అనూహ్య వీడ్కోలు

బ్రిస్బేన్: భారత క్రికెట్‌లో ఓ అధ్యాయం ముగిసింది. వెటరన్ ఆఫ్ స్పిన్నర్, 38 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్ ప్రస్థానానికి తెరపడింది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా టీమిండియాలో చెరగని ముద్ర వేసిన అశ్విన్.. బుధవారం సంచలన నిర్ణయం తీసుకున్నాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్ జరుగుతుండగానే ఆటకు వీడ్కోలు పలికాడు. ఏమాత్రం విజయావకాశాల్లేని మ్యాచ్‌లను ఎన్నింటినో తనదైన ప్రదర్శనతో గెలిపించిన అశ్విన్.. క్రికెట్ నుంచి అనూహ్యంగా తప్పుకొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగినా, ఐపీఎల్‌లాంటి లీగ్‌లతో పాటు క్లబ్ క్రికెట్‌లో కొనసాగుతానని అశ్విన్ ప్రకటించాడు. ఆస్ట్రేలియాతో మూడో టెస్టు డ్రాగా ముగిసిన అనంతరం కెప్టెన్ రోహిత్‌తో కలిసి అశ్విన్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అశ్విన్ మాట్లాడుతూ.. 'భారత క్రికెటర్‌గా నాకిదే చివరిరోజు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నా. అయితే, నాలో ఇంకాస్త క్రికెట్ ఉందని అనుకుంటున్నా. తప్పకుండా క్లబ్ క్రికెట్‌లో ఆడతా. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఎన్నో అనుభవాలను అందించిన నా సహచర ఆటగాళ్లతో పాటు బీసీసీఐకి, నా ఎదుగుదలలో కీలకపాత్ర పోషించిన కోచ్‌లకు ధన్యవాదాలు. ఇక, రోహిత్, రహానే, పుజారాలాంటి ఆటగాళ్లకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పాలి. వీళ్లంతా స్లిప్స్‌లో క్యాచ్‌లు అందుకోవడం వల్లే నేనివాళ ఇన్ని వికెట్లు సాధించగలిగా. ఆస్ట్రేలియా జట్టుకు బిగ్ థాంక్యూ. వాళ్లతో ఆడడాన్ని ఆస్వాదించా' అని అన్నాడు. ఇక.. 'ఇది భావోద్వేగపూరితమైన క్షణం. ఈ సమయంలో మీ ప్రశ్నలకు సమాధానమివ్వలేను. ఇందుకు నన్ను క్షమించండి' అని మీడియానుద్దేశించి అశ్విన్ వ్యాఖ్యానించాడు. బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో తొలి టెస్టుకు దూరమైన అశ్విన్.. అడిలైడ్‌లో జరిగిన రెండో టెస్టులో మాత్రం ఆడాడు. ఆ మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన అశ్విన్‌ను డ్రాగా ముగిసిన మూడో టెస్టుకు మాత్రం తీసుకోలేదు.



టెస్టుల్లో రారాజు...

చెన్నైకి చెందిన అశ్విన్.. 2010 జూన్ 5న శ్రీలంకతో వన్డే మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. అదే ఏడాది జూన్ 12న జింబాబ్వేతో తొలి టీ20 మ్యాచ్ ఆడిన అశ్విన్.. 2011 నవంబరు 6న వెస్టిండీస్‌తో టెస్టుల్లోకి అడుగుపెట్టాడు. గతేడాది అక్టోబరులో ఆస్ట్రేలియాతో కెరీర్ చివరి వన్డేను ఆడిన అశ్విన్.. 2022లో ఇంగ్లండ్‌తో ఆఖరి టీ20లో పాల్గొన్నాడు. టెస్టు క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న అశ్విన్.. అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్‌ల ఘన వారసత్వాన్ని నిలబెట్టే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కుంబ్లే (619) తర్వాత టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా రికార్డుకెక్కాడు. టెస్టుల్లో అత్యధికసార్లు (11) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న ఆటగాడిగా ముత్తయ్య మురళీధరన్‌తో సమంగా నిలిచాడు.

అశ్విన్ కెరీర్ గ్రాఫ్..

ఫార్మాట్	మ్యాచ్‌లు	వికెట్లు	బెస్ట్	పరుగులు	సెం.	అ.సెం.
టెస్టులు	106	537	7/59	3503	6	14
వన్డేలు	116	156	4/25	707	-	1
టీ20లు	65	72	4/8	184	-	-

37 సార్లు - టెస్టుల్లో 5 వికెట్ల ప్రదర్శన

8 సార్లు - ఒక టెస్టులో 10 వికెట్ల ప్రదర్శన

నాడు ధోనీ.. నేడు అశ్విన్

అశ్విన్ తీసుకున్న రిటైర్మెంట్ నిర్ణయం.. గతంలో ధోనీ ఉదంతాన్ని గుర్తు చేస్తోంది. 2014లో ధోనీ కూడా ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఆ ఏడాది డిసెంబరులో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ధోనీ.. నాలుగు మ్యాచ్‌ల ఆ సిరీస్‌లో అప్పటికే రెండు టెస్టులు ముగిసిన అనంతరం అనూహ్యంగా తన వీడ్కోలు ప్రకటన చేశాడు. ఎలాంటి సంకేతాలు ఇవ్వకుండా కేవలం ఓ ప్రకటన రూపంలో ధోనీ రిటైర్మెంట్ నిర్ణయాన్ని తెలియజేశాడు. ఇప్పుడు అశ్విన్ కూడా మరో రెండు టెస్టులు మిగిలుండగానే సిరీస్ మధ్యలో ఆటకు గుడ్‌బై చెప్పేశాడు.

నా అవసరం లేకుంటే..ఎందుకు?

తన అనూహ్య రిటైర్మెంట్ ప్రకటనకు ముందు అశ్విన్..కెప్టెన్ రోహిత్ శర్మతో ఘాటుగానే మాట్లాడాడట ! 'సిరీస్‌లో నా అవసరం లేకుంటే ఆటకు వీడ్కోలు పలకడమే ఉత్తమం' అని అశ్విన్ ఖరాఖండిగా చెప్పాడని కెప్టెన్ రోహిత్ వెల్లడించాడు. నిజానికి..స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్ ముగిసిన తర్వాత నుంచే రిటైర్మెంట్‌పై అశ్విన్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో తనకు తుది 11 మంది జట్టులో స్థానం లభించకపోతే..తానసలు ఆస్ట్రేలియాకే వెళ్లనని జట్టు యాజమాన్యానికి సిరీస్‌కు ముందే అశ్విన్ స్పష్టం చేసినట్టు సమాచారం.

హఠాత్ నిర్ణయం అందుకేనా?

సిరీస్ మధ్యలో అశ్విన్ హఠాత్తుగా రిటైర్మెంట్ ప్రకటించడం చర్చనీయాంశమైంది. ఇంకా రెండు టెస్టులు మిగిలున్న నేపథ్యంలో అతడు ఆడే అవకాశాలు దాదాపు లేవనే భావించాలి. తాజాగా గాబా టెస్ట్‌లో జడేజా ఆకట్టుకొనే ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకొన్నాడు. దీంతో తర్వాతి 2 మ్యాచ్‌ల్లో తనకు అవకాశాలు కష్టమని అశ్విన్ భావించి ఉండవచ్చు. పైగా వాషింగ్టన్ సుందర్‌ను మేనేజ్‌మెంట్ ఎక్కువగా ప్రోత్సహిస్తోంది. దీంతో ఇక తాను జట్టుతో ఉండడంలో అర్థం లేదని భావించి ఉంటాడని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా భారత జట్టుకు వచ్చే ఏడాది జూన్‌దాకా టెస్టుల్లేవు. అందుకే అశ్విన్ ఈ నిర్ణయం తీసుకుని ఉంటాడు.

బ్రిస్బేన్‌ను వీడిన అశ్విన్..

రిటైర్మెంట్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే అశ్విన్.. బ్రిస్బేన్‌లోని భారత జట్టును వీడి స్వదేశానికి బయల్దేరాడు. ఈ క్రమంలో డ్రెస్సింగ్ రూమ్‌లో చివరిసారి సహచరులతో భావోద్వేగంతో మాట్లాడాడు. అయితే, సమయాభావం కారణంగా టీమ్ అతడికి గ్రాండ్‌గా వీడ్కోలు పలకలేకపోయిందని సమాచారం.



ఆసీస్ ఆటగాళ్ల సంతకాలు చేసిన జెర్సీని అశ్విన్‌కు అందజేస్తున్న కమిన్స్

భావోద్వేగ వీడ్కోలు..



అశ్విన్ రిటైర్మెంట్ ప్రకటనతో మూడో టెస్టు ముగిసిన తర్వాత టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో పూర్తిగా ఉద్వేగభరిత వాతావరణం కనిపించింది. సహచరులంతా అశ్విన్‌ను హత్తుకొని భావోద్వేగ వీడ్కోలు పలికారు. అతనికోసం కేక్ తెప్పించి కట్ చేశారు. ఆసీస్ ఆటగాళ్లు కమిన్స్, లియోన్ వచ్చి తమ జట్టు ఆటగాళ్లంతా కలిసి సంతకాలు చేసిన జెర్సీని అశ్విన్‌కు అందజేశారు. ఇక, తీవ్ర భావోద్వేగానికి గురైన అశ్విన్.. 'రోహిత్, విరాట్, గౌతీ భాయ్‌కు థ్యాంక్స్. ఈరోజు సంతోషంగా ఉంది. ఇప్పుడే మొదటిసారి ఆస్ట్రేలియాలో పర్యటించినట్టు అనిపిస్తోంది. కెరీర్ ఆరంభంలో దిగ్గజాలతో కలిసి ఆడా. క్రమంగా రాహుల్ పాజీ (ద్రవిడ్), సచిన్ పాజీ ఇలా.. ఒక్కొక్కరు రిటైర్ అయ్యారు. ప్రతి ఒక్కరికీ వీడ్కోలు సమయం వస్తుంది. ఈరోజు నాకొచ్చింది. నేను తిరిగి ఇంటికి వెళ్తున్నా. మీరు మెల్‌బోర్న్‌లో ఎలా ఆడతారో టీవీలో చూస్తా..మీకెప్పుడైనా నాతో అవసరమనిపిస్తే ఫోన్ కాల్‌కు అందుబాటులో ఉంటా' అని సహచరులతో వీడ్కోలు సందేశంలో అశ్విన్ పేర్కొన్నాడు. ఈ వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

రిటైర్మెంట్‌కిదా సమయం: సన్నీ

అశ్విన్ అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడాన్ని సునీల్ గవాస్కర్ తప్పుపట్టాడు. సిరీస్ మధ్యలో ఇలాంటి నిర్ణయాల వల్ల జట్టు ప్రణాళికలు దెబ్బతింటాయన్న సన్నీ.. సిరీస్ ముగిశాక గుడ్‌బై చెబితే బాగుండేదన్నాడు. 'గతంలో ధోనీ కూడా ఇలాగే చేశాడు. నాలుగోటెస్ట్ వేదిక మెల్‌బోర్న్ పిచ్ ఎలా ఉందో తెలియదు. కానీ సిడ్నీ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. కాబట్టి, ఆ టెస్టులో భారత్ ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగొచ్చు. అప్పుడు అశ్విన్‌కు ఆడే అవకాశం వచ్చేదేమో' అని గవాస్కర్ అన్నాడు.

నీకు నీవే సాటి..

బౌలింగ్ ప్రయోగాలు చేయడంలో, బ్యాటింగ్‌లో మార్పులను అర్థం చేసుకోవడంలో నీకు నీవే సాటి.
- సచిన్ టెండూల్కర్

ఆడిన తొలి మ్యాచ్ మొదలు ఆఖరి వరకు మ్యాచ్ విన్నర్ అనే ముద్ర వేసి వెళ్లావు.
- రోహిత్ శర్మ

రిటైర్మెంట్ విషయం చెప్పగానే ఉద్వేగానికి లోనయ్యా. ఒక్కసారిగా మనం కలిసి ఆడిన క్షణాలన్నీ గుర్తొచ్చాయి. ఈ ప్రయాణంలో నీతో కలిసి ఆడిన ప్రతి క్షణాన్ని ఆస్వాదించా. **- విరాట్ కోహ్లీ**

బంతితో మాయ చేసే మాంత్రికుడు. ఆటను చదవగలిగే ప్రజ్ఞాశీలి. **- జైషా (ఐసీసీ చైర్మన్)**



క్రికెట్ మాస్టర్ మైండ్

అశ్విన్ ఓ క్రికెట్ మేధావి. శక్తిని.. యుక్తిని కలగలిపి.. మైదానంలో బ్యాటర్ల బుర్రలతో బంతులాడుతాడు. కొందరు అతడు అతిగా ఆలోచిస్తాడని అంటే.. కాదు లోతుగా ఆలోచిస్తానని కౌంటరిస్తాడు. క్రికెట్ సైంటిస్ట్‌లా వినూత్న ఆవిష్కరణలతో అభిమానులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తూనే ఉంటాడు.

వికెట్‌తో సంబంధంలేదు.. వాతావరణం గురించి పట్టించుకోడు..ఆటను వేగంగా చదువుతాడు.. పక్కాగా లెక్కలేస్తాడు.. ఎత్తులు.. జిత్తులతో ప్రత్యర్థులను ఉచ్చులో బిగిస్తాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఆపద్బాంధవుడి అవతారం ఎత్తుతాడు.. గెలుపు కోసం బ్యాట్‌తోనూ పోరాడతాడు. 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో అనేక పాత్రలు పోషించిన అశ్విన్.. విలువలను వదలడు.. విమర్శలకు బెదరడు.. సవాళ్లకు వెరవడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

అభద్రతా భావంలో జీవించడం అంటే.. మన శక్తిసామర్థ్యాలను మనమే తక్కువ చేసుకోవడం. దీన్ని చిన్ననాడే అధిగమించిన అశ్విన్.. కెరీర్ ఆసాంతం డేర్‌డెవిల్‌గానే సాగాడు. ఒడిదుడుకులు ఎదురైనా.. వాటిని సానుకూల దృక్పథంతో అధిగవించాడు. సమస్య మూలాలకు వెళ్లి శోధించాలి.. సాధించాలి అనేది అతడి నైజం. అలాంటి మనస్తత్వంతోనే మ్యాచ్ మ్యాచ్‌కూ తన నైపుణ్యాలను మెరుగులు దిద్దుకొంటూనే ఉన్నాడు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకొంటాడు.. ఎప్పుడూ నిత్యనూతనంగా ఉండేందుకు శ్రమిస్తూనే ఉంటాడు. జట్టులో చోటు కోల్పోయినా పట్టువదలకుండా ప్రయత్నించి ఎన్నోసార్లు పునరాగమనం చేశాడు.

పేసర్‌గా మొదలెట్టి..

మీడియం పేసర్, ఓపెనింగ్ బ్యాటర్ అశ్విన్‌ను ఆఫ్ స్పిన్నర్‌గా మార్చడంలో కోచ్ విజయ్ కుమార్ పాత్ర ఎంతో ఉంది. ఇంటర్ చదువుతున్న రోజుల్లో ఓసారి నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ అలసిపోయాడు. దీంతో ఆఫ్ స్పిన్ ట్రై చేస్తానని కోచ్‌ను అడగడంతో సరేనన్నాడు. అయితే, బంతిపై అతడి నియంత్రణ చూసిన విజయ్ ఆశ్చర్యపోయాడు. దీంతో అశ్విన్‌ను ఇష్టం లేకపోయినా.. స్పిన్ బౌలర్‌గా మార్చాడు. దేశానికి గొప్ప బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను అందించాడు. మురళీధరన్, షేన్ వార్న్ తరహాలో బంతికి ఎక్కువగా స్పిన్ చేయకపోయినా.. తన ఎత్తును ఆసరాగా చేసుకొని అదనపు బౌన్స్‌ను రాబడుతూ ప్రత్యర్థులకు సింహస్వప్నంలా కనిపించేవాడు. బంతిని ఎక్కడైతే వేయాలనుకొంటాడో.. అక్కడే కచ్చితంగా ల్యాండ్ చేయడం అతడి ప్రత్యేకత. ఈ క్రమంలో తన రనప్, సీమ్, వివిధ రకాల ట్రిక్కులతో ప్రయోగాలు చేస్తుంటాడు.

సొంత పిచ్‌లపై ఎదురులేదు..

2010లో శ్రీలంకతో వన్డే సిరీస్‌లో అరంగేట్రం చేసిన అశ్విన్.. 2011లో స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్‌లకు తొలిసారిగా ఎంపికయ్యాడు. అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. కేవలం సొంతగడ్డపై 383 వికెట్లు పడగొట్టడం విశేషం. 2021లో సిడ్నీ టెస్ట్‌లో హనుమ విహారితో కలసి జట్టును ఓటమి నుంచి తప్పించాడు. ఎడమచేతి వాటం బ్యాటర్లకు అశ్విన్ అంటే దడ. కేవలం టెస్టుల్లోనే 268 సార్లు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లను పెవిలియన్ చేర్చాడు. ఇక జడేజాతో జోడీగా వికెట్ల జాతర చేశాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకు వీరిద్దరూ కలసి 45 టెస్టులు ఆడగా.. అందులో భారత్ 34 మ్యాచ్‌లు గెలిచింది. కోహ్లీ కెప్టెన్సీలో ప్రాధాన్యం కోల్పోయినా.. ఆశ వదులుకోకుండా టీమ్‌లోకి రావడానికి శ్రమించాడు. 2015 చెన్నై వరదల్లో తన కుటుంబం చిక్కుకున్నప్పుడు కూడా అతడు విదేశాల్లో ఎంతో ధైర్యంగా జట్టు కోసం పోరాడాడు. గతేడాది తల్లికి గుండెపోటు వచ్చినప్పుడు కూడా బ్రేక్ తీసుకొని వచ్చి మళ్లీ జట్టులో చేరాడు. బ్యాటర్‌గా అశ్విన్ సత్తాచాటాడు.

క్యారమ్ బాల్‌తో..

సమకాలీన క్రికెట్‌లో తెలివైన బౌలర్‌గా అశ్విన్ గుర్తింపు పొందాడు. తన నైపుణ్యాలకు నిత్యం సానబెడుతూనే ఉంటాడు. బంతులతో కొత్తకొత్త ప్రయోగాలు చేస్తుంటాడు. అలా కనిపెట్టిందే క్యారమ్ బాల్. ఫింగర్ స్పిన్నర్లు కేవలం దూస్రాలు మాత్రమే వేయగలరన్న అభిప్రాయాన్ని అతడు మార్చిచూపాడు. తనదైన రాంగ్ వన్ 'క్యారమ్ బాల్'ను సృష్టించి అందరినీ ఆశ్చర్యపర్చాడు. దీంతో కుడి చేతి వాటం బ్యాటర్లకు వణుకుపుట్టించాడు. రానురాను అదే అతడి ట్రంప్ కార్డ్‌గా మారింది.

ప్రపంచకప్ సాధించడంలో..

ఐసీసీ టోర్నీల్లోనూ అశ్విన్ ఎంతో గొప్పగా రాణించాడు. 2011 వన్డే వరల్డ్‌కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీలను భారత్ నెగ్గడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. 2010, 2016 ఆసియాకప్ నెగ్గిన జట్టులో సభ్యుడు. 2023 వరల్డ్‌కప్, 2017 చాంపియన్స్ ట్రోఫీ, 2014 టీ20 వరల్డ్‌కప్, 2019-21, 2021-23 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లోనూ ఆడాడు.

వరుణుడు అడ్డుపడ్డాడు

ఆసీస్‌తో భారత్ మూడో టెస్ట్ డ్రా

బ్రిస్బేన్: భారత్-ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్ట్‌లో ఊహించిన ఫలితమే వచ్చింది. ఎక్కువ భాగం వర్షార్పణమైన మ్యాచ్‌లో కీలక డ్రాతో రోహిత్ సేన గట్టెక్కింది. 5 టెస్ట్‌ల బోర్డర్-గవాస్కర్ సిరీస్ ప్రస్తుతం 1-1తో సమంగా ఉండగా..బాక్సింగ్ డే టెస్ట్ ఈనెల 26న మెల్‌బోర్న్‌లో ప్రారంభమవుతుంది. భారీ వర్షం..ఉరుములు, మెరుపులతో చివరి రోజు 22 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఇక..ఓవర్‌నైట్ 252/9 స్కోరుతో బుధవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ మరో 24 బంతులు ఆడి 260 పరుగులకు ఆలౌటైంది. దాంతో 185 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకున్న ఆసీస్.. రెండో ఇన్నింగ్స్‌లో 89/7 స్కోరుతో డిక్లేర్ చేసి సవాలు విసిరింది. ఆపై 275 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్..వెలుతురు లేమి, వర్షం వల్ల ఆట ఆపివేసే సమయానికి వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది.

ఆసీస్ సవాల్: నాలుగు ఓవర్లలోనే భారత ఇన్నింగ్స్‌కు ముగింపు పలికిన ఆస్ట్రేలియాను బుమ్రా, ఆకాశ్‌దీప్, సిరాజ్ కలిపి 11 ఓవర్లలో ఐదు వికెట్లు తీసి దెబ్బకొట్టారు. కాగా చివర్లో కేరీ, కమిన్స్ దూకుడుగా ఆడారు. కమిన్స్ అవుటయ్యాక ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దాంతో 54 ఓవర్లలో 275 పరుగుల లక్ష్యంతో భారత్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. కానీ మూడు ఓవర్లు కూడా పూర్తి కాకముందే వెలుతురు మందగించడం..ఆపైన భారీ వర్షంతో ఇక ఆట సాధ్యం కాలేదు. కాగా ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా బుమ్రా (53) నిలిచాడు. ఈ క్రమంలో కపిల్ దేవ్ (51 వికెట్లు) రికార్డును దాటేశాడు.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445; భారత్ తొలి ఇన్నింగ్స్: 260; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: మెక్‌స్వీనే (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 4; ఖవాజా (బి) బుమ్రా 8; లబుషేన్ (సి) పంత్ (బి) బుమ్రా 1; మార్ష్ (సి) పంత్ (బి) ఆకాశ్‌దీప్ 2; హెడ్ (సి) పంత్ (బి) సిరాజ్ 17; స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 4; కేరీ (నాటౌట్) 20; కమిన్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22; స్టార్క్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: 18 ఓవర్లలో 89/7 డిక్లేర్డ్; వికెట్ల పతనం:**1-11, 2-16, 3-16, 4-28, 5-33, 6-60, 7-85 ; **బౌలింగ్ :** బుమ్రా 6-1-18-3; సిరాజ్ 7-0-36-2; ఆకాశ్‌దీప్ 5-1-28-2; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (నాటౌట్) 4; రాహుల్ (నాటౌట్) 4; **మొత్తం:2.1 ఓవర్లలో 8/0; బౌలింగ్:** స్టార్క్ 1.1-0-4-0; కమిన్స్ 1-0-4-0.

ఎస్‌బీఐ ఎండీగా తెలుగు బిడ్డ రామమోహన రావు



న్యూఢిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా తెలుగువాడైన అమర రామమోహన రావు నియమితులయ్యారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన సంస్థాగత ఆర్థిక సేవల బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ఈ ఏడాది సెప్టెంబరులో ఈ పదవికి ఆయన పేరును సిఫారసు చేసింది. నియామకాల కేంద్ర కేబినెట్ కమిటీ బుధవారం ఇందుకు ఆమోద ముద్ర వేసింది. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇంజినీరింగ్ పట్టభద్రుడైన రామ మోహన రావు 1991లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఎస్‌బీఐలో చేరారు. ప్రస్తుతం బ్యాంకు డిప్యూటీ ఎండీగా పని చేస్తున్నారు. గత 33 సంవత్సరాలుగా ఆయన ఎస్‌బీఐకు చెందిన వివిధ విభాగాల్లో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది ఆగస్టు వరకు ఎస్‌బీఐ అనుబంధ సంస్థ ఎస్‌బీఐ కార్డ్స్‌కు ఎండీ, సీఈఓగానూ పని చేశారు. అంతకు ముందు ఎస్‌బీఐ భోపాల్ సర్కిల్ సీజీఎంగానూ సేవలు అందించారు. సింగపూర్, అమెరికా దేశాల ఎస్‌బీఐల్లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. పనితీరు ఆధారంగా రామమోహన రావు పదవీ కాలాన్ని రిటైర్మెంట్ వయసు 2028 ఫిబ్రవరి 29 వరకు పొడిగించే అవకాశం కూడా ఉందని భావిస్తున్నారు. మరో తెలుగువారైన శ్రీనివాసులు శెట్టి ఇప్పటికే ఎస్‌బీఐ చైర్మన్‌గా పని చేస్తున్నారు. ఎస్‌బీఐ చరిత్రలో ఇద్దరు తెలుగు వారు ఒకే సమయంలో రెండు కీలక బాధ్యతలు నిర్వహించడం ఇదే మొదటిసారి. శ్రీనివాసులు శెట్టిని ఎస్‌బీఐ చైర్మన్‌గా నియమించడంతో ఏర్పడిన ఎండీ పోస్టులోనే రామ మోహన రావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

రియల్టీలో సంస్థాగత పెట్టుబడులు రూ.75,395 కోట్లు



2007 తర్వాత అత్యధికం

న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ రంగంలోకి సంస్థాగత పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 2024 సంవత్సరంలో ఇప్పటివరకు ఈ రంగంలోకి 887 కోట్ల డాలర్ల (రూ.75,395 కోట్లు) మేరకు సంస్థాగత పెట్టుబడులు వచ్చినట్టు జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో వచ్చిన 587 కోట్ల డాలర్ల (రూ.49,895 కోట్లు) కన్నా ఇది 51 శాతం అధికం. భారత రియల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడుల్లో ఇది ఒక మైలురాయి అని జేఎల్ఎల్ తాజా నివేదికలో పేర్కొంది. మొత్తం 78 డీల్స్ చోటు చేసుకున్నాయి. డీల్స్ సంఖ్య కూడా గత ఏడాదితో పోల్చితే 47 శాతం పెరిగింది. 2007లో వచ్చిన 840 కోట్ల డాలర్ల తర్వాత నమోదైన అధిక పెట్టుబడులివే. గృహ, కార్యాలయ, వేర్‌హౌసింగ్ ప్రాపర్టీలకు ఏర్పడిన డిమాండును సొమ్ము చేసుకునేందుకు సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు పెడుతున్నట్టు జేఎల్ఎల్ తెలిపింది. భారత రియల్టీ రంగంలో పెట్టుబడులు పెట్టిన వాటిలో 63 శాతం విదేశీ సంస్థలేనని పేర్కొంది. ప్రధానంగా రెసిడెన్షియల్ విభాగంలో 45% పెట్టుబడులు రాగా కార్యాలయ భవనాల విభాగంలో 28% , వేర్‌హౌసింగ్‌లో 23% పెట్టుబడులు వచ్చాయి. దేశీయ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరగడం కూడా ఒక విశేషమని జేఎల్ఎల్ సీనియర్ ఎండీ లతా పిళ్లై అన్నారు.

నవంబరులో పీఈ/వీసీ పెట్టుబడుల జోరు

పీఈ/వీసీ పెట్టుబడులు నవంబరు నెలలో భారీగా పెరిగాయి. గత ఏడాది నవంబరుతో పోల్చితే 156 శాతం పెరిగి 400 కోట్ల డాలర్లకు (రూ.34 వేల కోట్లు) చేరాయి. అక్టోబరుతో పోల్చితే వృద్ధి 15% ఉంది. మొత్తం 87 డీల్స్ చోటు చేసుకున్నాయని ఈవై ఒక నివేదికలో తెలిపింది. విభాగాల వారీగా చూసినట్టయితే 100 కోట్ల డాలర్లతో పారిశ్రామికోత్పత్తి రంగం అగ్రస్థానంలో ఉండగా 72.3 కోట్ల డాలర్లతో సర్వీసులు, 55 కోట్ల డాలర్లతో ఈ కామర్స్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

మూడో రోజూ మార్కెట్‌కు నష్టాలే

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ మరో 502.25 పాయింట్లు పతనమై 80,182.20 వద్దకు జారుకుంది. నిఫ్టీ 137.15 పాయింట్లు క్షీణించి 24,198.85 వద్ద స్థిరపడింది. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణం. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు సైతం తరలిపోతుండటం మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచింది.

జీవితకాల కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి క్షీణించింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 3 పైసలు నష్టపోయి రూ.84.94 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతోపాటు దిగుమతిదారుల నుంచి డాలర్‌కు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమైందని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి.

● క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా సంస్థాగత ఇన్వెస్టర్లకు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,000 కోట్లు సమీకరించినట్లు కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ (కేపీఐఎల్) వెల్లడించింది.

మార్చి నాటికి ఏపీ, తెలంగాణల్లో వొడాఫోన్ ఐడియా 5జీ సేవలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే ఏడాది మార్చిలోగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 5జీ సేవలు ప్రారంభించేందుకు వొడాఫోన్ ఐడియా సిద్ధమవుతోంది. కంపెనీ ఏపీ, తెలంగాణ, కర్ణాటక క్లస్టర్ బిజినెస్ హెడ్ ఆనంద్ దాని ఈ విషయం వెల్లడించారు. దీనికి సంబంధించి రెండు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే ప్రయోగాత్మక పరీక్షలు జరుపుతున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఉన్న 4జీ మౌలిక సదుపాయాలను ఇందుకోసం రూ.4,122 కోట్లతో మరింత ఆధునీకరిస్తున్నట్టు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 4జీ సేవల డౌన్‌లోడ్ స్పీడ్, వీడియో ఎక్స్‌పీరియన్స్, లైవ్ వీడియో ఎక్స్‌పీరియన్స్, వాయిస్ యాప్ ఎక్స్‌పీరియన్స్ అంశాల్లో మిగతా ఆపరేటర్ల కంటే వొడాఫోన్ ఐడియా ముందున్నట్టు ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం 11,500కు పైగా టవర్లతో ఏపీ, తెలంగాణల్లోని 96 శాతం జనాభాకు వొడాఫోన్ ఐడియా 4జీ సేవలు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్‌లో త్వరలో మరో 11 సొంత స్టోర్లు ప్రారంభించనున్నట్టు ఆనంద్ తెలిపారు. రాత్రి 9 గంటల నుంచి ఉదయం ఆరింటి వరకు ఉచిత డేటా, రూ.299 రీచార్జిపై అదనంగా 10 జీబీ డేటా ప్యాకేజిలకు ఖాతాదారుల నుంచి మంచి స్పందన లభిస్తున్నట్టు చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,840 ▼	71,350 ▼	1,00,000 ▼
విజయవాడ	79,000 ▼	72,700 ▲	91,500 ▼
విశాఖపట్నం	77,050 ▲	70,630 ▲	90,630 ▲
రాజమండ్రి	77,840 ▼	71,350 ▼	91,900 ▼
ప్రొద్దుటూరు	78,700 ▼	72,880 ▲	91,070 ▼
ముంబై	76,650 ▲	70,220 ▲	89,060 ▲

బిజినెస్

ఫెడ్ రేటు 0.25% తగ్గింపు

ఈ ఏడాది మూడోసారి

న్యూయార్క్: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును మరో 0.25 శాతం తగ్గించింది. ఫెడ్ రిజర్వు చైర్మన్ జెరోం పావెల్ అధ్యక్షతన రెండ్రోజుల పాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ (ఎఫ్ఓఎంసీ) ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఫెడ్ రేట్ల శ్రేణి 2022 డిసెంబరు నాటి స్థాయి 4.25-4.50 శాతానికి తగ్గింది. ఈ ఏడాదిలో ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించడం వరుసగా ఇది మూడోసారి. 2025లో మాత్రం వడ్డీ రేట్లను మరో రెండు సార్లే తగ్గించే అవకాశం ఉందని ఫెడ్ రిజర్వ్ సంకేతాలిచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	610
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	


ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	99
వరంగల్	91	గుంటూరు	102
కరీంనగర్	91	ఒంగోలు	102
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	97
కర్నూలు	91	నెల్లూరు	97
విశాఖపట్నం	108	అనంతపురం	97
గోదావరి	99		

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 19 డిసెంబరు 2024

అమరజీవిగా ఆంధ్రుల గుండెల్లో గూడు కట్టుకున్న సమరయోధుడు... ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష బూని... ప్రాణాలు అర్పించిన మహాత్ముడు... భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడు... పొట్టి శ్రీరాములు. తాతతో తనకున్న జ్ఞాపకాలు, అనుబంధాలు, నాటి పరిస్థితుల గురించి... పొట్టి శ్రీరాములు మనవరాలు... 82 ఏళ్ల ప్రొఫెసర్ రేవతి తంగుడు 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



'అలాగైతే నీతో రాను' అన్నాను

"ఆ రోజు ఇంకా గుర్తుంది. అది 1952. పిఠాపురం దగ్గర గొల్లప్రోలులో ఉంటున్నాం. సత్యాగ్రహం మొదలుపెట్టే ముందు తాతగారు (పొట్టి శ్రీరాములు) మా ఇంటికి వచ్చారు. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు. అమ్మ అనంతలక్ష్మి, నాన్న ఎస్ఆర్ గుప్తా, చెల్లి అనూరాధ, నేను... అంతా కూర్చొని ఉన్నాం. అప్పుడు... 'నేను సత్యాగ్రహం చేయబోతున్నాను. ఆ సమయంలో నువ్వు నాతోనే ఉండాలి. నాకు మరణం సంభవించినా సరే... ఎవరూ నా దీక్షకు ఆటంకం కలిగించకుండా చూసుకోవాలి' అని తాతగారు మా నాన్నతో అన్నారు. అందుకు నాన్న సరేనన్నారు. దీక్ష ప్రారంభించే సమయానికి చెల్లిని తీసుకొని అమ్మానాన్న మద్రాసు వెళ్లిపోయారు. నా చదువు చెడిపోకూడదని నన్ను రాజమండ్రిలో తెలిసినవాళ్ల ఇంట్లో వదిలిపెట్టారు. అక్కడ స్కూల్లో చేరాను. 1952 అక్టోబరు 19న తాతగారు మద్రాసులోని బులుసు సాంబమూర్తి గారి ఇంట్లో ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు.

మామయ్య ఇంట్లో...

నేను మా మేనమామ టీపీబీఎస్ గుప్తా ఇంట్లో పెరిగాను. అమ్మానాన్న అహ్మదాబాద్ సబర్మతీ ఆశ్రమంలో ఉన్నప్పుడు పుట్టాను. తొమ్మిది నెలల వయసులోనే నన్ను మా మామయ్యకు అప్పగించి, వాళ్లిద్దరూ స్వాతంత్ర్య ఉద్యమంలోకి వెళ్లిపోయారు. 'నువ్వే పెంచు. మేం బతికుంటే వచ్చి తీసుకువెళతాం' అని మామయ్యకు చెప్పారట. అప్పట్లో వారు బ్రిటిషర్ల కంట పడకుండా రహస్య సమాచారం చేరవేసేవారట. రెండుసార్లు జైలు జీవితం కూడా గడిపారు. మా మామయ్య హైదరాబాద్‌లో డీబీఆర్ మిల్స్ మేనేజర్‌గా చేసేవారు. అక్కడి నుంచి ఆయన బాంబే మిల్స్‌కు, సూరత్ మిల్స్‌కు వెళ్లారు. తరువాత భివాండీలోని బిర్లా కాలేజీ ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అలా నా బాల్యం వివిధ ప్రాంతాల్లో సాగింది. మేనమామ చనిపోయాక అమ్మానాన్న వచ్చి నన్ను తీసుకువెళ్లారు. అప్పటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. అంతకముందు ఒకసారి ఢిల్లీలో గాంధీ గారిని కలిసే అవకాశం లభించింది. అక్కడ పెద్ద మైదానంలో ఒక గుడిసెలాగా ఉండేది. అందులో మహాత్మా గాంధీ ఉండేవారు. అమ్మానాన్నతో కలిసి ఆయన దగ్గరకు వెళ్లాను. గాంధీ గారు నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకున్నారట. అప్పుడు ఆయన్ను అడిగానట... 'నా భుజం మీద చెయ్యి వేసుకొని నడుస్తారా' అని! దానికి గాంధీ 'నువ్వు పెద్దయ్యాక అలానే నడుస్తా' అన్నారట.

అలాగైతే నేను రానన్నాను...

స్వాతంత్ర్య వచ్చాక.. నాన్న తన కుటుంబాన్ని పోషించుకొని, పిల్లల భవిష్యత్తు చూసుకోవాలని గొల్లప్రోలుకు వచ్చారు. అక్కడి ఒక వ్యాపారస్తుడి దగ్గర ఉద్యోగంలో చేరారు. అప్పట్లో నాకు తెలుగు అస్సలు వచ్చేది కాదు. దానికోసం మహంకాళి అనే మాస్టారు దగ్గర ఏడాది పాటు తెలుగు నేర్పించారు. నాకు ఇప్పటికీ గుర్తుంది... ఒకసారి తాతగారు గొల్లప్రోలు వచ్చినప్పుడు... 'అలా బజారుకు వెళదాం రా' అని అడిగితే... 'నువ్వు ఇలానే వస్తావా బజారుకు? అలాగైతే నేను నీతో రాను' అన్నాను. నేనేమో అప్పటివరకు మేనమామ దగ్గర పెరిగాను కదా! ఆయన సూటు బూటూ వేసుకొని టిప్‌టాప్‌గా ఉండేవారు. తాతగారు లుంగీ కట్టుకొని, పైపంచె వేసుకొనేవారు. ఎప్పుడూ ఆయన ఆహార్యం అదే. తాత అరిటాకులో భోజనం చేస్తే... అసలు తిన్నారా అనిపిస్తుంది! అంత శుభ్రంగా తినేవారు.

చెల్లి అదృష్టవంతురాలు...

తాతగారు ఆమరణ నిరాహారదీక్ష చేపట్టినప్పుడు అమ్మానాన్నతో పాటు చెల్లి కూడా అక్కడే ఉంది. ఆయన మంచం పక్కన కుర్చీ వేసుకొని కూర్చొనేది. అప్పుడు తనకు ఐదేళ్లు. తాతగారికి రోజూ కొబ్బరి నీళ్లు ఇచ్చేవారు. నీళ్లు తీసుకొని, కొబ్బరి ముక్కలు కప్పులో వేసిచ్చి చెల్లిని తినమనేవారట. దాంతోపాటు ఆయనకు తేనె, నిమ్మ రసం కలిపిన నీళ్లు కూడా ఇచ్చేవారు. దీక్షసాగిన 58 రోజులూ చెల్లి తాత పక్కనే ఉంది. ఆ విషయంలో తను అదృష్టవంతురాలు.

మొదట చూసింది తనే...

ముప్పై రోజుల దీక్ష తరువాత తాతగారి ఆరోగ్యం మరింత క్షీణించింది. దాంతో ఎవర్నీ లోపలకు రానీయలేదట. గడప దగ్గర నుంచే చూసి వెళ్లిపోవాలని చెప్పారట. చెల్లి గడప దగ్గర కూర్చొనేదట ఆడుకొంటూ. పక్కనే కేర్‌టేకర్‌లా ఒకరు ఉండేవారు. తాతగారి శరీరం వేడెక్కినప్పుడు చల్లబరచడానికి ఆయన ఒళ్లంతా మట్టి రాస్తుండేవారు. చివర్లో తాత చనిపోవడం చెల్లే చూసింది. ఆ రోజు 1952 డిసెంబరు 15. కేర్‌టేకర్ మట్టి రాస్తుంటే... తాత తల పక్కకు వాలిపోయిందట. వెంటనే పరుగెత్తుకొంటూ మేడ మీదకు వెళ్లి చెప్పిందట. దీక్ష చేపట్టి చాలా రోజులు అయింది కదా... ఏంచేద్దామనే విషయం మీద నాన్న, వైద్యులు మేడ మీద చర్చిస్తున్నారట. కిందకి వచ్చి చూసేసరికి తాతగారు చనిపోయారట. వెంటనే ఆయన్ను కుర్చీలో కూర్చోబెట్టారు. 'ఎందుకలా తాతను కడుతున్నారు' అని చెల్లి అడిగితే 'అందరికీ కనపడాలని అలా కట్టాం' అని చెప్పారట. విషయం తెలిసి చాలామంది వచ్చి చూసిపోతూనే ఉన్నారు. తరువాత రోజు బండి మీద కూర్చోబెట్టారు. పక్కన మా నాన్న, అమ్మ, రంగయ్య గుప్తా గారు, చెల్లి కూడా కూర్చున్నారు. ఘంటసాల గారు నిరంతరాయంగా ఆవేదనతో పాడుతూనే ఉన్నారు. ఎంతోమంది జనం అంతిమయాత్రలో పాల్గొన్నారు. సాయంత్రానికి అంతిమసంస్కారాలు ముగిశాయి.

'దీక్ష భగ్నం కాకూడదు...'

పొట్టి శ్రీరాములు గారు సత్యాగ్రహదీక్షకు కూర్చొనే ముందు ఇంట్లోవాళ్లకు ఒకటే చెప్పారట... 'తెలుగువాళ్లకంటూ ఒక గుర్తింపు లేదు. అందరూ మనల్ని మద్రాసీలని అంటున్నారు. తెలుగువాళ్లకు రాష్ట్రం వచ్చేవరకు నేను నిరాహారదీక్ష చేస్తాను. నా ప్రాణం పోయేవరకూ పోరాడతాను. అదృష్టం ఉంటే ఆంధ్రా వస్తుంది. నా దీక్షను భగ్నం చేయడానికి ఎవర్నీ అనుమతించవద్దు' అని మా నాన్నతో అన్నారట. నాన్న ధైర్యవంతులు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా ఇచ్చిన మాటకు కట్టుబడతారు. తాతగారితో పాటు అన్ని ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్నారు. రాజాజీ దీక్షను వ్యతిరేకించారు. ముప్పై రోజుల తరువాత 'రాష్ట్రం ఇచ్చేస్తున్నారు. దీక్ష విరమించండి' అంటూ ఎవరితోనో సందేశం పంపారట. ఏదోరకంగా సత్యాగ్రహాన్ని ఆపేయాలనేది వారి ఆలోచన. అయితే ఆయనను కలవడానికి తాత నిరాకరించారట. 58 రోజుల దీక్ష అనంతరం శ్రీరాములు గారు మరణించాక పెద్దఎత్తున గొడవలు జరిగాయి. ఆ తదనంతర పరిణామాల్లో ఆంధ్ర రాష్ట్రం సిద్ధించింది.

అది మనకే గౌరవం...

నేను పెరుగుతున్న క్రమంలో ఆంధ్ర రాష్ట్రం వచ్చింది. 1956లో హైదరాబాద్‌తో కలిపి ఆంధ్రప్రదేశ్‌గా అవతరించింది. చిన్నపిల్లను కావడంతో 1955 వరకు నాకు పరిస్థితుల తీవ్రత తెలియదు. ఆ తరువాతే తెలిసింది... తాతయ్య ప్రాణ త్యాగం విలువ. ఆయన పోయిన తరువాత మేం హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డాం. ఆస్తులు పాస్తులు ఏమీ లేవు. నాన్న ఏవేవో వ్యాపారాలు ప్రయత్నించి, వాటిల్లో నష్టం రావడంతో చివరకు పౌల్ట్రీ ఫామ్ పెట్టారు. అప్పటి నుంచి మా పరిస్థితి కాస్త మెరుగుపడింది. బిర్లామందిర్ దగ్గర ఉండేవాళ్లం. అక్కడ తాతగారి విగ్రహం ఉండేది. రాష్ట్ర అవతరణ దినోత్సవంనాడు నాన్న పూల మాల వేసేవారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం లేదు. అలాగే హైదరాబాద్‌లోని 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం' పేరు మారుస్తున్నారని విన్నాను! వేరొకరికి గౌరవం ఇవ్వాలనుకొంటే... ఎన్నో కొత్త ప్రాజెక్టులు చేపడుతున్నారు. వాటికి వాళ్ల పేర్లు పెట్టుకొనే అవకాశం ఉంది కదా. తాతగారి దీక్ష ఫలితంగా తెలుగు మాట్లాడేవారి కోసం ఒక రాష్ట్రం ఏర్పడింది. ఈ స్ఫూర్తితో దేశంలో మరికొన్ని భాషాప్రయుక్త రాష్ట్రాలు అవతరించాయి. దీనికి నాంది పలికింది శ్రీరాములు గారే కదా. అలాంటప్పుడు తెలంగాణ విడిపోయినంతమాత్రాన ఆయన జ్ఞాపకాలు లేకుండా చెరిపేయడం, ఆయనకు ప్రాధాన్యత లేకుండా చేయడం సరైంది కాదనేది నా అభిప్రాయం. మూలాలు మరిచిపోకూడదు. అందుకే హైదరాబాద్‌లో తెలుగు వర్సిటీ పేరు మార్చవద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాం. అయితే ఆంధ్రాలోని తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు అలాగే కొనసాగిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు. ఇది సంతోషకరం. ఆంధ్ర రాష్ట్రఅవతరణ సందర్భంగా ఏపీలో పలు సంస్థలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. వాటికి రమ్మని మాకు ఆహ్వానం అందుతుంటుంది. అలా తాతయ్యను తలచుకొనే అవకాశం మాకు లభిస్తోంది."

• హనుమా

ప్రొఫెసర్‌గా ప్రయాణం...

మేం 1953లో హైదరాబాద్ వచ్చాక తమ్ముడు పుట్టాడు. వాడికి తాత పేరు శ్రీరాములు పెట్టాం. నాకు ముగ్గురు చెల్లెళ్లు, ఒక తమ్ముడు. మొదటి చెల్లి అనూరాధ ఇక్కడే ఉంటోంది. రెండో చెల్లి గీత అమెరికాలో స్థిరపడింది. మావారు భాస్కర్‌రావు. కొన్నేళ్ల కిందట చనిపోయారు. రెండేళ్ల కిందట తమ్ముడు కూడా మాకు దూరమయ్యాడు. నేను రెడ్డి కాలేజీలో పీయూసీ చేశాక బీఎస్సీ హోమ్‌సైన్స్, ఎంఎస్సీ హోమ్‌సైన్స్ బరోడాలో చదివాను. తిరిగివచ్చి ఇక్కడి సెయింట్‌ఆన్స్‌లో బీఈడీ చేశాను. 1972లో 'ఠాకూర్ రాజప్రసాద్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద మెంటల్లీ హ్యాండీక్యాప్డ్'లో లెక్చరర్‌గా చేరాను. తరువాత దానికి డైరెక్టర్ జనరల్ అయ్యాను. రిటైర్ అయినా ప్రస్తుతం అందులోనే కొనసాగుతున్నాను. వృత్తిలో భాగంగా చాలా దేశాలు తిరిగాను.

తాతతోనే నాన్న...

మా నాన్న చిన్నప్పటి నుంచి మద్రాసులో తాతగారి ఇంట్లోనే పెరిగారు. శ్రీరాములు గారికి మా నాన్న స్వయానా మేనల్లుడు. నాన్నకు రెండున్నరేళ్లప్పుడు వాళ్లమ్మ చనిపోయారు. దాంతో శ్రీరాములు గారు నాన్నను పెంచి పెద్ద చేశారు. నాన్న... తాతగారికి పెంపుడు కొడుకులాగా. ఎందుకంటే పొట్టి శ్రీరాములు గారి భార్య, కొడుకు చనిపోయారు. అప్పటి నుంచి మా నాన్నను కొడుకులా చూసుకున్నారు. తాతగారి తమ్ముడు రంగయ్య గుప్తా. ఆయనకూ పిల్లలు లేరు. ఇంకో తమ్ముడు నారాయణ.

ఆ రాతలు బాధ కలిగించాయి...

కొంతమంది వాస్తవాలు తెలియకుండా ఏదేదో రాసేస్తున్నారు. చివరి దశలో తాతగారి నోట్లో నుంచి, ముక్కుల్లో నుంచి పురుగులు వచ్చాయని, మోయడానికి నలుగురు మనుషులు కూడా లేరని... ఇలా ఎవరో రాశారు. వారికి నేను గట్టిగా చెప్పాను... 'ఇలాంటి తప్పుడు సమాచారం ప్రచారం చేయవద్ద'ని. మా నాన్నతోపాటు ఆ రోజు అక్కడున్నవారికి తెలుసు కదా... ఏంజరిగిందో. తిండి తినక తాతగారి ఆరోగ్యం క్షీణించింది కానీ, వాళ్లందరూ చెబుతున్నట్టు ఏమీ జరగలేదు. దీక్ష చేపట్టే నాటికి ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. తాతగారు చనిపోయిన రోజు టంగుటూరి ప్రకాశంపంతులు, ఇతర ప్రముఖులంతా వచ్చారు. ఎంతోమంది ఆయన పార్థివదేహాన్ని సందర్శించారు. తరువాత నేను రాజమండ్రిలో థియేటర్‌కు వెళితే... సినిమాకు ముందు తాతగారికి సంబంధించి ఒక డాక్యుమెంటరీ ప్రదర్శించేవారు. అందులో ఆయన అంతిమయాత్ర దృశ్యాలు కూడా ఉన్నాయి. దాన్లో చాలామంది ప్రజలు కనిపిస్తారు.





కౌన్సెలింగ్

పసి వయసు ప్యూబర్టీ ఎందుకు?

డాక్టర్! మా అమ్మాయికి పదేళ్లు. అప్పుడే తొలి నెలసరి మొదలైపోయింది. ఇంత చిన్న వయసులో రుతుక్రమం మొదలైపోవడం ఆశ్చర్యంగా, కాస్త భయంగా ఉంది. ఇది ఆరోగ్యకరమైన మార్పేనని అంటారా?

- ఓ సోదరి, హైదరాబాద్.

ఆడపిల్లలు 13, 14 ఏళ్లకు రజస్వల అయ్యే పరిస్థితి కొన్నేళ్ల క్రితం ఉండేది. కానీ ఏళ్ల గడిచేకొద్దీ ఆ వయోపరిమితి పదేళ్లకు తగ్గిపోయింది. ఆరేళ్లకే రజస్వల అయిపోతున్న ఆడపిల్లలు కూడా ఉంటున్నారు. ఈ వయసులో రుతుక్రమం పిల్లల్లో రకరకాల సమస్యలకు కారణమవుతుంది. భౌతిక ఎదుగుదల ఆగిపోవచ్చు. బదుల్లో హేళనలు, ఫలితంగా మానసిక సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి పదేళ్లలోపు ఆడపిల్లలో ఎలాంటి అసహజ భౌతిక మార్పులు కనిపించినా వెంటనే వైద్యులను కలవడం అవసరం. ఇలా ముందస్తుగానే వైద్యులను సంప్రతిస్తే, చికిత్సతో నెలసరిని వాయిదా వేయవచ్చు.



నష్టాలు ఇవే!

ఎనిమిదేళ్ల లోపు ఆడపిల్లల్లో నెలసరి మొదలైతే, ఈస్ట్రోజన్ హార్మోన్ ఉత్పత్తి పెరుగుతుంది. దాంతో ఎముకల ఎదుగుదల ఆగిపోతుంది. ఫలితంగా పిల్లలు ఎదగడం మానేస్తారు. 8, 9 ఏళ్లకే లైంగికపరమైన భౌతిక లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తూ, ఎదిగిన పిల్లల్లా మారిపోతారు. కానీ వారి మానసిక ఎదుగుదల వయసుకు తగ్గట్టుగా పరిమితంగానే ఉండిపోతుంది. ఇలాంటి ఆడపిల్లలు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కాబట్టి ఎనిమిదేళ్ల లోపు ఆడపిల్లల్లో రొమ్ములు పెద్దవి కావడం, మర్మాంగాల దగ్గర రోమాలు పెరగడం లాంటి లక్షణాలు బయల్పడుతున్నట్టు అనుమానం వస్తే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రతించి, అవసరమైన పరీక్షలు చేయించాలి. అవసరాన్ని బట్టి వైద్యులు ప్యూబర్టీని వాయిదా వేసే చికిత్సను సూచిస్తారు. మీ అమ్మాయి ఇప్పటికే నెలసరి మొదలైపోయింది కాబట్టి పాపకు నెలసరి పట్ల అవగాహన కల్పించడం అవసరం. అలాగే క్రమం తప్పకుండా వైద్యులకు చూపిస్తూ, మార్పులను వైద్యుల దృష్టికి తీసుకువెళ్తూ ఉండాలి.

డాక్టర్ మంజుల అనగాని,
క్లినికల్ డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్,
విమెన్ అండ్ చైల్డ్ ఇన్‌స్టిట్యూట్,
కేర్ హాస్పిటల్స్, బంజారాహిల్స్, హైదరాబాద్.

ఇంట్లో స్నేక్ ప్లాంట్ పెంచవచ్చా?

ఇంటి అందాన్ని పెంచే ఇండోర్ ప్లాంట్స్ అంటే అందరికీ ఇష్టమే. అందులోనూ ఆరోగ్యాన్ని, అదృష్టాన్ని తెచ్చే మొక్కలకు విపరీతమైన ఆదరణ ఉంటోంది. ఈ కోవలోనే ఇటీవల స్నేక్ ప్లాంట్‌ని పెంచేవారి సంఖ్య పెరుగుతోంది. ఇంటి వాతావరణాన్ని పరిశుభ్రం చేసి సానుకూల శక్తిని పెంచడంతోపాటు వాస్తు ప్రకారం అదృష్టాన్ని, సంపదను అందిస్తుంది ఈ మొక్క. స్నేక్ ప్లాంట్‌ను ఇంట్లో పెంచితే కలిగే ఇతర ప్రయోజనాల గురించి తెలుసుకుందాం!

ఇంట్లో గాలి శుభ్రం: స్నేక్ ప్లాంట్‌కి గాలిని శుభ్రం చేసే గుణం ఉందని నాసా ప్రకటించింది. ఈ మొక్కని ఇంట్లో పెంచడం వల్ల మనం తరచూ ఉపయోగించే రూం ఫ్రెషనర్స్, మస్కిటో కాయిల్స్ నుంచి వెలువడే రసాయనాలను పీల్చుకుని లోపలి గాలి విషపూరితం కాకుండా చేస్తుంది. పరిశ్రమల నుంచి వెలువడే ఫార్మాల్డిహైడ్, బెంజీన్, కార్బన్‌డయాక్సైడ్ వంటి వాయువులను కూడా సులభంగా గ్రహిస్తుంది.



ఆక్సిజన్‌ని ఇస్తుంది: శీతాకాలంలో చలిగా ఉంటుందనీ ఎండాకాలంలో దోమలు వస్తాయనీ మనం గది కిటికీలు, తలుపులు వేసుకుని నిద్రిస్తుంటాం. గదికి వెంటిలేషన్ లేని పక్షంలో మనం పీల్చే గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గి ఇబ్బంది కల్గుతుంది. ఇలాంటి సమస్యలు ఎదురవకుండా ఉండాలంటే గదిలో కనీసం ఎనిమిది అంగుళాల పొడవున్న ఉన్న స్నేక్ ప్లాంట్‌ని ఉంచుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. రాత్రిపూట మూసి ఉన్న గదిలో పెరిగే కార్బన్‌డయాక్సైడ్‌ని వేగంగా పీల్చుకుని అధిక మొత్తంలో ఆక్సిజన్‌ని విడుదల చేస్తుంది.

పొడిగాలి నుంచి రక్షణ: వాతావరణంలో మార్పుల కారణంగా పొడిగాలులు వీస్తూ ఉంటాయి. ఇలాంటపుడు ఇంట్లో ఉండే గాలిలో తేమ శాతం తగ్గిపోతుంది. దీంతో చెవులు, ముక్కు, గొంతు తడారిపోయి దురదగా అనిపిస్తుంటాయి. దగ్గు, వికారం, కండరాల నొప్పి, నీరసం వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ఇంట్లోని ప్రతి గదిలో చిన్న స్నేక్ ప్లాంట్ కుండీలు అమర్చుకుంటే ఈ సమస్యలు ఏర్పడవు. ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత కలుగుతుంది.

ఆయుర్వేద ఔషధం: ఈ మొక్క ఆకుల్ని ఆయుర్వేద చికిత్సలో భాగంగా ఉపయోగిస్తుంటారు. చర్మ వ్యాధుల నివారణకు, పాము కాటు విరుగుడి మందుగా, కుష్టు వ్యాధిని నయం చేసేందుకు, కీళ్ల నొప్పులను తగ్గించేందుకు ఈ మొక్క ఆకులు బాగా పనిచేస్తాయి. ఈ ఆకులు అత్యంత విషపూరితమైనవి కాబట్టి చిన్న పిల్లలు, పెంపుడు జంతువులకు అందకుండా జాగ్రత్తగా కుండీలు అమర్చుకోవాలి.

అదృష్టానికి, సంపదకు: స్నేక్ ప్లాంట్ కుండీని ఇంట్లో సరైన దిశలో ఉంచినపుడు అదృష్టం, సంపద కలిసి వస్తాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు. కుండీని ఆగ్నేయంలో పెడితే సంపద, నైరుతిలో పెడితే ఆరోగ్యం, తూర్పులో పెడితే సానుకూల శక్తి పెరుగుతాయి. ఈశాన్యం, ఉత్తరం దిశల్లో స్నేక్ ప్లాంట్ కుండీని పెట్టకూడదు. ఇంటి సింహ ద్వారానికి సమీపంలో, లివింగ్ రూమ్‌లో ఈ మొక్క కుండీని పెట్టడం వల్ల సానుకూల ప్రయోజనాలు కలుగుతాయి.



గోల్ఫ్ అనగానే వాణిజ్యవేత్తలు తమ స్నేహితులతో ఆడే ఆట గుర్తుకొస్తుంది. గోల్ఫ్ ఆడే మహిళలు అరుదు. అలాంటి అరుదైన గోల్ఫర్ వాణీకపూర్. గోల్ఫ్‌తో ముడిపడిన వాణీ ప్రస్థానం ఆమె మాటల్లోనే...



సరదాగా మొదలెట్టి... సత్తా చూపుతోంది

"నాన్న మంచి గోల్ఫర్. చిన్నప్పటి నుంచి నాన్నతో పాటు క్లబ్‌కు వెళ్తూ ఉండేదాన్ని. నాకు ఆడాలనే ఉత్సుకత ఉండేది. కానీ ఎక్కడ చూసినా పురుషులే ఉండేవారు. అమ్మాయిలు కనిపించేవారు కాదు. వారి కోసం శిక్షణ ఇచ్చేవారు కూడా లేరు. దీనితో చాలా కాలం సరదాగా గోల్ఫ్ ఆడేదాన్ని. నా ఉత్సాహం చూసి అమ్మ,నాన్న నన్ను గోల్ఫ్ ఆడమని ప్రోత్సహించారు. పదేళ్ల వయస్సులో గోల్ఫ్ నేర్చుకోవటం కోసం కోచ్ దగ్గర చేరాను. ఆ సమయంలో ఢిల్లీలోని డీఎల్ఎఫ్ గోల్ఫ్‌క్లబ్‌లో నేనొక్కదాన్నే అమ్మాయిని ఉండేదాన్ని. మా కోచ్ దగ్గర మిగిలిన వారందరూ అబ్బాయిలే! గోల్ఫ్ వ్యక్తిగతంగా ఆడాల్సిన క్రీడ. దీనికి ఓపిక , ఏకాగ్రత ఎక్కువగా కావాలి. ఎక్కువ సమయం గ్రౌండ్‌లో వెచ్చించాల్సి వస్తుంది. దీనితో అమ్మ,నాన్న నన్ను మా కోచ్‌కు అప్పచెప్పారు. నాకు గోల్ఫ్ నేర్పటంతో పాటుగా నన్ను కనిపెట్టుకొని ఉండటం కూడా ఆయన పని. నేను గోల్ఫ్ ఆడటం ప్రారంభించిన సమయంలో అత్యున్నత స్థానాల్లో అందరూ పురుషులే ఉండేవారు. మహిళలు అతి తక్కువగా ఉండేవారు.

సహనం నేర్పింది...

చిన్నప్పుడు నేను చాలా చురుకుగా ఉండేదాన్ని. ఒక చోట కూడా కుదురుగా కూర్చోలేకపోయేదాన్ని. అటూ ఇటూ తిరుగుతూ ఉండేదాన్ని. గోల్ఫ్ నా వ్యక్తిత్వానికి పూర్తిగా భిన్నమైన క్రీడ. దీనిలో సహనమే ప్రధానం. లక్ష్యం చేరుకొనే దాకా గంటల తరబడి ఒకే బంతిని కొడుతూ ఉండాలి. కొద్దిగా ఏకాగ్రత కోల్పోయినా ఓడిపోతాం. అందువల్ల క్రమశిక్షణతో ప్రతి రోజూ సాధన చేయాల్సిందే! ఈ క్రమశిక్షణ నాలో సహనం నేర్పించింది. ఇప్పుడు గంటల కొలది సమయం ఏకాగ్రతతో ఉండగలుగుతాను. మొదటి సారి నేను అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొన్నప్పుడు విపరీతంగా భయపడ్డాను. కానీ నాకు ఆ సమయంలో కొన్ని వేల గంటల శిక్షణ ఎంతో పనికొచ్చింది. ఇక్కడ ఇంకో విషయాన్ని నేను ప్రస్తావించాలి. మిగిలిన క్రీడల మాదిరిగానే గోల్ఫ్‌లో కూడా మహిళలు తక్కువే! అయితే పురుషులతో పోలిస్తే భారతీయ మహిళా గోల్ఫర్స్ మంచి ప్రజ్ఞ కనబరుస్తున్నారు. యూరప్ సర్క్యూట్స్‌లో కూడా పాల్గొంటున్నారు. నేను ఆడటం మొదలుపెట్టినప్పుడు అంతర్జాతీయ పోటీలకు అతి కొద్ది మంది మాత్రమే వెళ్లేవారు. ఆస్ట్రేలియా లేడీస్ పీజీఏ టూర్‌లో పాల్గొన్నప్పుడు- అక్కడ చాలా మంది నన్ను ఆశ్చర్యంగా చూశారు. దానికి వారికి తప్పుపట్టాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వారు అప్పటి దాకా అలాంటి ముఖ్యమైన టూర్‌లలో భారతీయ మహిళా క్రీడాకారులను ఎవరిని చూడలేదు. ఈ మధ్యకాలంలో అదితి అశోక్ వంటి గోల్ఫర్లు అంతర్జాతీయ పోటీలలో కూడా తమ సత్తా చూపిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే భారతీయ గోల్ఫర్లకు మంచి రోజులు వస్తున్నాయి.

> సాధారణంగా పురుషుల కన్నా మహిళలలో ఏకాగ్రత ఎక్కువగా ఉంటుంది. సహనం కూడా ఎక్కువే. అందువల్ల వారు మంచి గోల్ఫర్స్ అవుతారు. అయితే ఈ క్రీడ ఇంకా అందరికీ అందుబాటులో లేదు. కొన్ని నగరాలలో మాత్రమే అందుబాటులో ఉంది. ఈ మధ్యకాలంలో అనేక పట్టణాలలో గోల్ఫ్ క్లబ్‌ల నిర్మాణం ప్రారంభమయింది. అందువల్ల భవిష్యత్తులో మహిళా గోల్ఫర్స్ అనేక మంది పోటీలలో మెరుస్తారనుకుంటున్నా! 'టైగర్ ఉడ్స్, రోరీ మెక్‌ఇల్రాయ్, జేసన్ డే నాకిష్టమైన గోల్ఫ్ క్రీడాకారులు.

అయినా వివక్షే...

టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ వంటి అనేక క్రీడా విభాగాలలో మహిళలు అద్భుతమైన ప్రతిభను చూపిస్తున్నారు. ఒలింపిక్స్ వంటి కఠినమైన పోటీలలో కూడా పతకాలు సాధిస్తున్నారు. అయినా ఇప్పటికీ క్రీడలలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగానే కనిపిస్తుంది. ఎక్కువ మంది మహిళలకు క్రీడలంటే ఆసక్తి కనిపించదు. బహుశా అది మన సంస్కృతి, సంప్రదాయాల వల్ల కలిగే భావన కావచ్చు. కానీ నా ఉద్దేశంలో మహిళలు మంచి క్రీడాకారిణులుగా ఎదగగలుగుతారు. మన దేశానికి పేరు తేగలుగుతారు. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అవసరం.


ఢిల్లీలో జరిగిన ఓ సదస్సులో కరెన్సీ నోట్లపై అంబేడ్కర్‌ ఫొటో ముద్రించాలని డిమాండ్‌ చేస్తూ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న తెలుగు రాష్ట్రాల ఎంపీలు

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్‌ ఫొటో ముద్రించాల్సిందే

▸▸ పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తుతాం: తెలుగు ఎంపీలు

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ స్ఫూర్తి ప్రదాత బీఆర్‌ అంబేడ్కర్‌ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించాలని రెండు తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్‌ చేశారు. కరెన్సీపై అంబేడ్కర్‌ ఫొటో సాధన సమితి అధ్యక్షుడు జే పరశురామ్‌ అధ్యక్షతన బుధవారం ఏపీ/తెలంగాణ భవన్‌లోని గురజాడ సమావేశ మందిరంలో ఓ సదస్సు జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు... టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బీజేపీ, టీడీపీ రాజ్యసభ సభ్యులు ఆర్‌ కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, తెలంగాణ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌ కుమార్‌రెడ్డి తదితరులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ న్యాయమైన డిమాండ్‌ను ఉభయ సభల్లో ప్రస్తావిస్తామని, రాష్ట్రపతికి లేఖ రాస్తామని పేర్కొన్నారు.

ఫైళ్ల క్లియరెన్స్‌ల్లో ఎడతెగని జాప్యం

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించి విజిలెన్స్‌ కమిషన్‌ క్లియరెన్స్‌ లేకపోతే ఆర్థిక ప్రయోజనాలు కోల్పోవాల్సి వస్తుందని పదవీ విరమణ గడువుకు దగ్గర పడ్డ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల్లో పదుల సంఖ్యలో ఉద్యోగుల ఫైళ్లు విజిలెన్స్‌ కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఫైళ్ల క్లియరెన్స్‌ కోసం అధికారుల చుట్టూ తిరిగినా.. కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వయసు పైబడిన ఓ పురుష ఉద్యోగిపై ఓ మహిళ లైంగిక వేధింపుల కేసు పెట్టింది. కానీ కోర్టులో కేసు వీగిపోయింది. అయినా సదరు ఉద్యోగికి పోస్టింగ్‌ రావాలంటే విజిలెన్స్‌ కమిషన్‌ నివేదిక అవసరమైంది. అయితే నెలల తరబడి తిరుగుతున్నా ఫైలు కదడం లేదు.

'ఇన్వెస్ట్‌మెంట్‌ ట్రాకర్‌'తో పరిశ్రమల ఏర్పాటు: సీఎస్‌

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇన్వెస్ట్‌మెంట్‌ ట్రాకర్‌ అనే డిజిటల్‌ ప్లాట్‌ఫామ్‌ ద్వారా నిరంతర పర్యవేక్షణతో సకాలంలో పరిశ్రమలు ఏర్పాటయ్యే విధంగా కృషి చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌ కుమార్‌ ప్రసాద్‌ వెల్లడించారు. బుధవారం సచివాలయంలో వివిధ అంశాలపై సీఎస్‌ సమీక్షించారు. పరిశ్రమల ఏర్పాటులో డీపీఆర్‌ స్థాయి నుంచి ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్‌ ట్రాకర్‌ అనేది ఒక సమర్థవంతమైన డిజిటల్‌ ప్లాట్‌ఫామ్‌ అని, దీని ద్వారా రాష్ట్రంలో వివిధ విభాగాల ద్వారా ఏర్పాటవుతున్న ప్రాజెక్టులను ట్రాక్‌ చేయడం, ఎక్కడైనా వాటి ఏర్పాటులో అడ్డంకులుంటే సకాలంలో గుర్తించి పరిష్కరించడానికి ఈ విధానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.

అంగన్వాడీలకు 52 కోట్లు: మంత్రి సంధ్యారాణి

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11,003 అంగన్వాడీ కేంద్రాలకు రూ.52.68 కోట్ల నిధులు విడుదల చేసినట్లు మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఇందులో తాగునీటి సౌకర్యానికి రూ.19.39కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ33.29 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. 7387 అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్‌ కోసం సీఎండీలకు లేఖలు రాసినట్లు తెలిపారు. అల్లూరి, ఏలూరు, మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల(పీవీటీజీ) కోసం పీఎం జన్‌మన్‌ కింద 139 కొత్త అంగన్వాడీ కేంద్రాలు ప్రారంభించామని పేర్కొన్నారు.

జగన్‌ పరువు నష్టం పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగూరు నారాయణ తనపై వేసిన పరువునష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ సీఎం జగన్‌ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు జనవరి 9కి వాయిదా వేసింది. బుధవారం ఈ వ్యాజ్యం విచారణకురాగా నారాయణ తరఫున న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపించారు. కౌంటర్‌ వేసేందుకు మరింత సమయం ఇవ్వాలని, పిటిషనర్‌, సాక్షి పత్రికకు సంబంధాలు ఉన్నాయని నిరూపించేందుకు ఆధారాలను కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు. జగన్‌ తరఫు న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. తమ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించాలని కోరారు. వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్‌ వీఆర్‌కే కృపాసాగర్‌ విచారణను జనవరి 9కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అల్ట్రాటెక్‌కు లీజు గడువు మరో 30 ఏళ్లు పొడిగింపు!

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అల్ట్రాటెక్‌ సిమెంట్‌ కంపెనీకి ఇచ్చిన సున్నపురాయి గనుల లీజు గడువును మరో 30 ఏళ్లు పొడిగించారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామంలో 2255 ఎకరాల సున్నపురాయి గనులను వైఎస్‌ ప్రభుత్వం 2004లో 20 ఏళ్ల కాలానికి కేటాయించింది. లీజు గడువు ఈ ఏడాది ఏప్రిల్‌లో ముగిసింది. లీజు కాల పరిమితిని మరో 30 ఏళ్ల పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది.

ఉత్తమ పోలీసులకు అవార్డులు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు డీజీపీ ద్వారకా తిరుమలరావు అవార్డులు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో జరిగిన నేరాలను చాకచక్యంగా పరిష్కరించిన పోలీసుల నుంచి ఏపీసీఐడీ అధికారులు వివరాలు తెప్పించుకున్నారు.చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం నుంచి రూ.26లక్షలు దోచుకెళ్లిన దొంగలను టెక్నాలజీ సాయంతో పట్టుకున్న పోలీసులకు అవార్డ్‌ ఫర్‌ బెస్ట్‌ క్రైమ్‌ డిటెక్షన్‌(ఏబీసీడీ)లో మొదటి బహుమతిగా రూ.లక్ష రివార్డును అందజేశారు. గుంతకల్లు-హిందూపురం మధ్య రైళ్లలో కూల్‌ డ్రింకుల్లో మత్తు పదార్థాలు కలిపి ఇచ్చి.. బంగారం, నగదు, ఫోన్లు, ల్యాప్‌ ట్యాప్‌లు తస్కరిస్తున్న ముఠా ఆట కట్టించిన జీఆర్‌పీ పోలీసులకు రెండో బహుమతి కింద రూ.60వేలు లభించింది.

8, 9 తేదీల్లో ఏపీ డిజిటల్‌ టెక్నాలజీ సదస్సు

విశాఖపట్నం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖలో జనవరి 8, 9 తేదీల్లో ఏపీ డిజిటల్‌ టెక్నాలజీ సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ డిజిటల్‌ టెక్నాలజీ ఇండస్ట్రీ లీడర్‌షిప్‌ ఫోరం కన్వీనర్‌ శ్రీధర్‌ కొసరాజు తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ఏడు రంగాల్లో ఐటీ ఎలా అభివృద్ధి చెందుతున్నదీ, డీప్‌ టెక్నాలజీ ప్రాముఖ్యత, స్టార్టప్‌లు వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చ ఉంటుందన్నారు. ఐటీ మంత్రి నారా లోకేశ్‌, ఎంఎస్‌ఎంఈల మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌, కేంద్ర ఐటీ సెక్రటరీ వంటి ప్రముఖులు వస్తారన్నారు.

కోన శశిధర్‌కు నైపుణ్యాభివృద్ధి శాఖ బాధ్యతలు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌కు నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి బాధ్యతలను కూడా అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో నైపుణ్యాభివృద్ధిశాఖ కూడా విద్యాశాఖలో భాగంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించడంతో ఈ మేరకు మార్పులు చేశారు.

ఇంజనీరింగ్‌ సిబ్బంది వేతనాలు పెంచండి

▸▸ సీడీఎంఏకు మున్సిపల్‌ కార్మిక సంఘాల వినతి

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌ శాఖలో ఇంజనీరింగ్‌ ఆఫీసు సిబ్బంది, స్కూల్‌ స్వీపర్లకు జీవో 36 ప్రకారం వేతనాలు పెంచాలని, ఈ ఏడాది జనవరిలో జరిగిన సమ్మెలో సంఘాల డిమాండ్‌ను ఆనాటి ప్రభుత్వం అంగీకరించి 9 మంది ఐఏఎస్‌లతో కమిటీని నియమించిందని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు తెలిపారు. ఈ కమిటీ కేటగిరీల వారీగా రూ.18,500, రూ.24,500, రూ.29,000 వేతనాలను ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగ, కార్మికులకు చెల్లించాలని నివేదిక ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంతో సంప్రదించి వేతనాలు పెంచాలని కోరారు. బుధవారం మున్సిపల్‌ సీడీఎంఏ హరినారాయణ్‌తో కార్మిక సంఘాల నాయకులు సమావేశమయ్యారు.

కార్పొరేట్‌కు దీటుగా బీసీ సివిల్‌కోచింగ్‌: సవిత

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌ ఐఏఎస్‌ కోచింగ్‌ సెంటర్లకు దీటుగా బీసీ యువతకు సివిల్‌ సర్వీసెస్‌ శిక్షణ ఇస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. విజయవాడలోని గొల్లపూడిలో తాత్కాలిక బీసీ స్టడీ సర్కిల్‌ భవనంతోపాటు సివిల్‌ సర్వీసెస్‌ కోచింగ్‌ సెంటర్‌ను మంత్రి సవిత బుధవారం ప్రారంభించారు. వచ్చే ఏడాది అమరావతిలో బీసీ స్టడీ సర్కిల్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు.

అమరావతికి రారండి..!



- జాతీయ, అంతర్జాతీయ కాంట్రాక్టర్లకు సీఆర్‌డీఏ ఆహ్వానం
- రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపు
- రూ.100 కోట్ల పైబడి ప్యాకేజీ పనుల అప్పగింతకు సిద్ధం
- రాష్ట్రంలో కాంట్రాక్టు సంస్థల రిజిస్ట్రేషన్‌కూ సహకారం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

నూతన సంవత్సరం నుంచి అమరావతి 2.0 పనులకు సీఆర్‌డీఏ భారీ ఎత్తున శ్రీకారం చుట్టనుంది. రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యానికి దేశీయ, అంతర్జాతీయ కాంట్రాక్టు సంస్థలను ఆహ్వానిస్తోంది. అమరావతిలో ఒక మహాయజ్ఞంలా జరిగే పనుల్లో భాగమయ్యేందుకు తరలి రావాలని కోరుతోంది. కాంట్రాక్టు సంస్థలను సమీకరించుకునేందుకు సీఆర్‌డీఏ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. సింగిల్‌ డెస్క్‌ విధానంలో ఆయా సంస్థలకు రాష్ట్రంలో రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను పూర్తి చేయించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టింది. తమ విజన్‌ ప్లాన్‌ను ఆహ్వానంలో పొందుపరిచింది. ప్రపంచ స్థాయి రాజధాని నగరంగా అమరావతిని నిర్మించే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సమర్థ పరిపాలనతో, సాంస్కృతిక ఏకీకరణతో ఆధునిక పట్టణ సూత్రాలకు అనుగుణంగా సమ్మిళిత రాజధానిని నిర్మించనున్నట్టు సీఆర్‌డీఏకు నిర్దేశించింది. సామాజిక ఆర్థిక అభివృద్ధి, జీవనోపాధి కేంద్రంగా, పెట్టుబడిదారులు, వ్యాపారాలు, విద్య, పర్యాటకం తదితర రంగాలకు కేంద్ర స్థానంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సాగుతున్నాయి. రానున్న రోజుల్లో అమరావతిలో టౌన్‌షిప్‌ల నిర్మాణం, బహుళ అంతస్థుల భవనాలు, మెగా టవర్లు, రోడ్లు, డ్రెయిన్లు, నీటి సదుపాయాలు, మురుగునీటి వ్యవస్థలతో కూడిన మెగా ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ప్రణాళికాబద్ధమైన లేఅవుట్లలో ఐకానిక్‌ భవనాలు, ఎస్‌టీపీలు, విద్యుత్‌ కోసం యుటిలిటీ డక్ట్‌లు తదితర రూ.100 కోట్లకు పైబడి పనులను ప్యాకేజీల వారీగా అప్పగించటానికి సీఆర్‌డీఏ సిద్ధమవుతోంది.

'జల్‌జీవన్‌'లో జనం భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి)

పటిష్ఠమైన ప్రణాళిక ఉండాలని అధికారులకు పవన్‌ కల్యాణ్‌ సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే బృహత్తర ప్రణాళికతో అంతాకలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. జల్‌జీవన్‌ మిషన్‌ పనులు ఎలా మొదలుపెట్టాలి, ఎలాముందుకు తీసుకెళ్లాలి, పటిష్ఠంగా ఎలా పూర్తి చేయాలనే విషయాలపై అధికార యంత్రాంగం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, పనులు చేసి వదిలేయడం కాకుండా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలు వినడానికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి ముందుకెళ్లాలని కోరారు. జల వనరుల లభ్యత, వాటి నుంచి పొందాల్సిన ప్రయోజనం, ఇతర అంశాలను నిశితంగా పరిశీలించి శాశ్వతంగా ఫలితాలు అందేలా జల్‌జీవన్‌ మిషన్‌ పనులను మొదలుపెట్టాలన్నారు. ఇంకా పవన్‌ కల్యాణ్‌ ఏమన్నారంటే..


జల్‌ జీవన్‌ మిషన్‌ అమలుపై నిర్వహించిన వర్క్‌ షాపులో ఏర్పాటు చేసిన స్టాల్‌ వద్ద డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌

ఇప్పటికీ తాగునీటి వెతలు..

స్వాతంత్ర్యానంతరం తాగునీటిని అందించేందుకు రూ.లక్షల కోట్లు ప్రభుత్వాలు ఖర్చు చేశాయి. అయినా ఇప్పటికీ తాగునీటి వెతలు తప్పడం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకునే 2019లో జల్‌జీవన్‌ మిషన్‌ పథకం మేరకు మొదలైంది. ప్రతి మనిషికీ సగటున 55 లీటర్లు రక్షిత తాగునీరు అందించాలనేది పథకం లక్ష్యం. నేను ఏ జిల్లా పర్యటనకు వెళ్లినా.. తాగునీరు అందడం లేదని జనం చెబుతున్నారు. జల్‌జీవన్‌ పనుల్లో గత ప్రభుత్వం అసలేం చేసిందనేదానిపై పల్స్‌ సర్వేను యుద్ధ ప్రాతిపదికన చేయాలని అధికారులకు చెప్పాం. గత పాలకులు చెప్పిన లెక్కల్లో 70.04 లక్షల కుటుంబాలకు నీటి కుళాయిలు ఇచ్చారు... ఇంకా 25.40 లక్షల కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వాలి. కానీ, 85.22లక్షల కుటుంబాలకుగాను 55.37 లక్షల కుటుంబాలకు ఇంకా కుళాయిలు బిగించాల్సి ఉన్నదని పల్స్‌ సర్వేలో తేలింది.

కేరళ కంటే తక్కువగా ప్రతిపాదనలు....

"నేను వ్యక్తిగతంగా చాలా సార్లు జల్‌జీవన్‌ మిషన్‌ పనులను సమీక్షించాను. కానీ, ప్రజలందరికీ మేలు చేసే ఇంత కీలకమైన పథకం విషయంలో రాష్ట్రంలో అనుకున్నంత విజయవంతంగా పనులు జరగడంలేదు. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించే ముందు... ఎంతమేర నిధులు అవసరమవుతాయని కేంద్రం.. రాష్ట్రాలను అడిగాయి. ఉత్తరప్రదేశ్‌ రూ.1.50 లక్షల కోట్లు, మధ్యప్రదేశ్‌ రూ.83 వేల కోట్లు, గుజరాత్‌ రూ.32 వేల కోట్లు, కేరళ రూ.45 వేల కోట్లు కావాలని అడిగాయి. ఆంధ్రప్రదేశ్‌ కంటే కేరళ చాలా చిన్నది. అయినా, భవిష్యత్‌ అవసరాలు, ప్రజలకు అందాల్సిన పూర్తి తాగునీటి పనులు పూర్తి కావాలంటే నిధులు ఎక్కువ అవసరం అనే కోణంలో ఆలోచించి అంత మొత్తం ఆ రాష్ట్రం అడిగింది. కానీ, గత ప్రభుత్వ పాలకులు మాత్రం ఏపీకి రూ.26వేల కోట్లు చాలంటూ ప్రతిపాదనలు పంపారు. దీంతో కేంద్రం మొదటి దశలో రూ.4,787 కోట్ల పనులు మంజూరుచేసింది. కేంద్ర పథకాల్లో కచ్చితంగా రాష్ట్ర వాటాగా మ్యాచింగ్‌ గ్రాంట్‌ కేటాయించాలనే నిబంధన ఉంటుంది. జల్‌జీవన్‌ మిషన్‌ పనులకు మ్యాచింగ్‌ గ్రాంట్‌ విడుదల చేయకపోవడంతో కేంద్రమిచ్చిన నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేకపోయాం."

పథకం ఆశయాలకు తూట్లు....

"గత ప్రభుత్వం జల్‌జీవన్‌ మిషన్‌లో సమీపంలోని రిజర్వాయర్లు, ఇతర అతి పెద్ద నీటి వనరుల నుంచి నీటిని గ్రామాలకు ఇవ్వాల్సిందిపోయి భూగర్భ జలాలను బోర్ల ద్వారా అందించే ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో 38 మేజర్‌ రిజర్వాయర్ల ద్వారా 95.44 లక్షల తాగునీటి కుళాయిలకు అనుసంధానం చేయాల్సి ఉంది. అయితే గత పాలకులు మాత్రం జల్‌జీవన్‌ మిషన్‌ నిబంధనలకు వ్యతిరేకంగా రూ.4 వేల కోట్లు ఖర్చు చేసి బోర్ల ద్వారా నీటిని అందించేందుకు ఇష్టానుసారంగా పనులు చేశారు. కూటమి ప్రభుత్వం దీన్నంతా సరిదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. కేంద్ర పెద్దలకు రూ.70 వేల కోట్లు అవసరమని చెప్పాం. దీనికి సంబంధించి డీపీఆర్‌ దృష్టి సారించాం. జనవరిలోగా రిపోర్టును రూపొందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం."

ఫలాలు అందరికీ అందేలా..

"జల్‌జీవన్‌ మిషన్‌ నిధులు ఇన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నా...క్షేత్రస్థాయిలో మాత్రం దారుణమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం కనీసం ఫిల్టర్‌ బెడ్స్‌ కూడా చాలా చోట్ల మార్చలేదు. రూ.5 లక్షలు వెచ్చిస్తే అయిపోయే పని ఇది. అది కూడా చేయలేదు. మనం రాష్ట్ర ప్రజలందరికీ ఫలాలు అందించేందుకు శ్రమించాలి. డిప్యూటీ సీఎంగా నేను మిమ్మల్ని ఆదేశించడం లేదు. అందరం కలిసి రాష్ట్రంలోని కోటి మంది ప్రజల తాగునీటి కలను నిజం చేద్దాం" అని పవన్‌ కల్యాణ్‌ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌, ఆ శాఖ కమిషనర్‌ కృష్ణతేజ, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఇంజనీర్‌ ఇన్‌ చీఫ్‌ సంజీవరెడ్డి, సీఈ హరిరామ నాయక్‌, జలవనరుల చీఫ్‌ ఇంజనీర్‌ వెంకటేశ్వర్లు, అన్నీ జిల్లాల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈలు, ఈఈలు, డీఈఈలు పాల్గొన్నారు.

1 నుంచి ఇంటర్‌ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం

▸▸ నేడు క్యాబినెట్‌ ముందుకు ప్రతిపాదన

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్‌ కాలేజీల్లో వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రారంభించనుంది. జనవరి 1 నుంచి ఇంటర్‌ విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను నేడు మంత్రిమండలి సమావేశం ముందుకు రానున్నాయి. ఇప్పటికే పథకం పునరుద్ధరణకు ఇంటర్‌ విద్యాశాఖ చర్యలు ప్రారంభించింది. రాష్ట్రంలో 475 ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలున్నాయి. వాటిలో 300 కాలేజీలు ఉన్నత పాఠశాలల ప్రాంగణాలతో కలిసి ఉన్నాయి. ఆ పాఠశాలల్లోని వంటవారి ద్వారానే విద్యార్థులకు భోజనం అందిస్తారు. మిగిలిన 175 కాలేజీలకు సమీపంలోని పాఠశాలల నుంచి పంపిస్తారు. అందుకు కుక్‌లకు రవాణా ఖర్చులు ఇవ్వనున్నారు. ఈ పథకం పునరుద్ధరణతో ప్రభుత్వ జూనియర్‌ కాలేజీల్లోని 1.41 లక్షల మంది విద్యార్థులకు మేలు జరగనుంది. వైసీపీ అధికారంలోకి రాక ముందు జూనియర్‌ కాలేజీల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమల్లో ఉండేది. వైసీపీ అధికారంలోకి రాగానే అమ్మఒడి నగదు ఇస్తున్నందున ఆ పథకాన్ని రద్దుచేసింది. విద్యార్థులు ఇబ్బంది పడ్డా వెనకడుగు వేయలేదు.

కార్పొరేట్‌ తరహా స్టడీ మెటీరియల్స్‌

ప్రభుత్వ జూనియర్‌ కాలేజీలు ప్రస్తుతం ఇంటర్‌ విద్యకే పరిమితం కాగా ప్రైవేటు జూనియర్‌ కాలేజీలు జేఈఈ, నీట్‌ అంటూ అదనపు కోచింగ్‌ ఇస్తున్నాయి. వాటిపై విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా ఆసక్తిగా ఉన్నారు. ఇది కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఇకపై ప్రభుత్వ కాలేజీల్లోనూ అదే విధానం అమలు చేయాలని నిర్ణయించింది. కార్పొరేట్‌ కాలేజీల సలహాలు తీసుకుని స్టడీ మెటీరియల్స్‌ తయారుచేసింది. వాటిని విద్యార్థులకు అందించే కిట్‌తో పాటు అందిస్తారు. వచ్చే ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు, రికార్డ్‌ బుక్‌, జేఈఈ, నీట్‌ మెటీరియల్‌ అందించాలని నిర్ణయించారు. గణితం, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులున్న విద్యార్థులకు మెటీరియల్‌ ఇస్తారు. ఈ అంశం కూడా నేడు క్యాబినెట్‌ ముందుకు రానుంది. ప్రైవేటు కాలేజీల తరహాలో పోటీ పరీక్షలకు రోజూ తరగతులు నిర్వహించనున్నారు. రోజూ ఇంటర్‌ సబ్జెక్టులు బోధిస్తూనే అదనంగా జేఈఈ, నీట్‌కు సమయం కేటాయిస్తారు. వచ్చే ఏడాది నుంచి సవరించిన కరిక్యులమ్‌ అమల్లోకి వచ్చాక మిగిలే సమయాన్ని కొత్తగా రూపొందించిన పోటీ పరీక్షల మెటీరియల్స్‌ బోధనకు కేటాయిస్తారు.

హోంగార్డులకు పచ్చజెండా

▸▸ నెరవేరనున్న కానిస్టేబుల్‌ కల

▸▸ తొలగిన న్యాయపరమైన చిక్కులు

▸▸ ప్రారంభమైన హాల్‌ టికెట్ల జారీ

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలీసు విభాగంలో పనిచేస్తున్న హోంగార్డుల కానిస్టేబుల్‌ కల హైకోర్టు తీర్పుతో నెరవేరబోతోంది. కానిస్టేబుల్‌ పోస్టుల నియామకంలో హోంగార్డుల రిజర్వేషన్‌ సమస్యకు బుధవారం హైకోర్టు తీర్పుతో పరిష్కారం లభించింది. దీంతో ఏడాదిన్నరకు పైగా ఆగిపోయిన కానిస్టేబుల్‌ నియామక ప్రక్రియను వడివడిగా ముందుకు తీసుకెళ్లేందుకు పోలీసు రిక్రూట్‌మెంటు బోర్డు సిద్ధమైంది. జగన్‌ ఐదేళ్ల పాలనలో ఒక్క కానిస్టేబుల్‌ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదు. దీంతో నిరుద్యోగుల్లో వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీనిని గమనించిన ప్రభుత్వం 2022, నవంబరు చివరి వారంలో 6,100 పోలీసు కానిస్టేబుల్‌ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేశారు. ఆన్‌లైన్‌ ద్వారా 4.58లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 2023, జనవరి చివరి వారంలో ప్రిలిమ్స్‌ నిర్వహించి 95,208 మంది అర్హత సాధించినట్లు బోర్డు ప్రకటించింది. తొలి దశలో ప్రాథమిక రాతపరీక్ష పూర్తయ్యాక రెండో దశలో దేహదారుఢ్య (పీఈటీ), శారీరక సామర్థ్య పరీక్షలు (పీఎంటీ) నిర్వహించాల్సి ఉంది. ఈ పరీక్షలు మార్చి 13నుంచి 20 దాకా నిర్వహిస్తామని హాల్‌టికెట్లు జారీ చేసింది. అదే సమయంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో ఈ పరీక్షలను వాయిదా వేశారు. ఆ ఎన్నికల తర్వాత ప్రక్రియ కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. జగన్‌ ప్రభుత్వం పట్టించుకోలేదు.

గత సర్కారు నిర్లక్ష్యం

కానిస్టేబుల్‌ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ విడుదల చేసిన వైసీపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా సివిల్‌ హోంగార్డులకు 15%, ఏపీఎస్పీ హోంగార్డులకు 25% రిజర్వేషన్‌ ఇచ్చింది. దీని ప్రకారం మొత్తం 6,100 కానిస్టేబుల్‌ ఉద్యోగాల్లో 1100 హోంగార్డులకే కేటాయించాలి. అయితే, ప్రాథమిక పరీక్ష 3వేల మంది హోంగార్డులు రాయగా ఫలితాల తర్వాత 382 మంది మాత్రమే అర్హత సాధించారు. దీంతో పలువురు హోంగార్డులు తమకు కటాఫ్‌ తగ్గించాలని, అందరినీ అర్హులుగా ప్రకటించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడంతో నియామక ప్రక్రియకు బ్రేక్‌ పడింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభ్యర్థులు తమ గోడు ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నారు. న్యాయపరమైన చిక్కులు అధిగమించి ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు 2నెలల క్రితం డీజీపీ, పోలీసు రిక్రూట్‌మెంట్‌ బోర్డు ఛైర్మన్‌ను ఆదేశించడంతో ఎట్టకేలకు మార్గం సుగమమైంది.

ఆన్‌లైన్‌లో హాల్‌ టికెట్లు

ఓవైపు కోర్టు తీర్పుకోసం ఎదురు చూస్తూనే మరోవైపు అర్హులైన 95,208 మందికి దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలకు నియామక బోర్డు రెండోదశ దరఖాస్తులు ఆహ్వానించింది. వారికి బుధవారం మధ్యాహ్నం 3గంటల నుంచి హాల్‌టికెట్లు జారీ చేస్తున్నారు. ఈ నెల 29వరకు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్‌ చేసుకునే అవకాశం ఉంది. 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు 13 ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో రెండోదశ పరీక్షలు నిర్వహించనున్నారు. అర్హత సాధించిన వారికి తుది విడత రాత పరీక్ష నిర్వహించి ఎంపికైన 6,100 మందిని ఉద్యోగాల్లో నియమిస్తారు.

ప్రత్యేక కేటగిరీగా హోంగార్డులు

▸▸ కానిస్టేబుళ్ల నియామకాల్లో ప్రాధాన్యం

▸▸ 6 వారాల్లో ప్రత్యేక మెరిట్‌ లిస్ట్‌ సిద్ధం

▸▸ పోలీసు రిక్రూట్‌మెంట్‌ బోర్డుకు హైకోర్టు ఆదేశం

రాష్ట్ర హోం శాఖ పరిధిలో పనిచేస్తున్న హోంగార్డులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. పోలీస్‌ కానిస్టేబుళ్ల నియామకాల్లో సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా వారిని ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని ఏపీ పోలీస్‌ రిక్రూట్‌ మెంట్‌ బోర్డును హైకోర్టు ఆదేశించింది. ప్రాథమిక పరీక్షలో హోంగార్డులకు వచ్చిన మార్కులు ఆధారంగా ప్రత్యేక మెరిట్‌ లిస్ట్‌ తయారు చేయాలని స్పష్టం చేసింది. ఆరు వారాల్లో ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపింది. మెరిట్‌ లిస్ట్‌ తయారీకి తాము ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అడ్డంకికాబోవని స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ సత్తి సుబ్బారెడ్డి బుధవారం తీర్పు ఇచ్చారు. కానిస్టేబుళ్ల నియామకాల్లో సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా తమను ప్రత్యేక కేటగిరీగా పరిగణించేలా ఆదేశించాలని కోరుతూ పలువురు హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించారు. సామాజిక రిజర్వేషన్లను వర్తింపజేసి ప్రాథమిక పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్‌ మార్కులు రాలేదంటూ తదుపరి ఫిజికల్‌, తుది రాతపరీక్షకు అనుమతించలేదని పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాలపై గతంలో విచారణ జరిపిన న్యాయమూర్తి సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పిటిషనర్లను ఫిజికల్‌, తుదిరాత పరీక్షకు అనుమతించాలని పోలీస్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డును ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. వ్యాజ్యాలపై ఇటీవల న్యాయమూర్తి తుది విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు శీనా కుమార్‌, శివరామ్‌, ఆంజనేయులు వాదనలు వినిపించారు. పోలీసు నియామక బోర్డు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. "కానిస్టేబుల్‌ పోస్టులు భర్తీకోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కానీ, అందులో నిబంధనలను కానీ హోంగార్డులు సవాల్‌ చేయలేదు. రాతపరీక్షలో కనీస మార్కులు సాధించి, తదుపరి ప్రక్రియకు ఎంపిక కానందుకే వ్యాజ్యాలు దాఖలు చేశారు. నోటిఫికేషన్‌ జారీ చేశాక, ఎంపిక ప్రక్రియ మధ్యలో నిబంధనలు మార్చడానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో పిటిషన్లు చెల్లుబాటు కావు" అని వివరించారు. ఇరు పక్షాల వాదనలు ముగియడంతో ఇటీవల తీర్పును రిజర్వ్‌ చేసిన న్యాయమూర్తి బుధవారం నిర్ణయం వెల్లడించారు.

న్యాయ నిపుణుల సలహాతోనే బన్నీ రాలేదు



▸▸ శ్రీతేజ్‌ కోలుకునేందుకు ఏం చేయడానికైనా సిద్ధం: అల్లు అరవింద్‌

హైదరాబాద్‌ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): న్యాయ నిపుణుల సూచనల మేరకే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ చూడడానికి అర్జున్‌(బన్నీ) రాలేదని అల్లు అరవింద్‌ అన్నారు. సంధ్య థియేటర్‌ ఘటనలో గాయపడ్డ శ్రీతేజ్‌ ఆరోగ్య పరిస్థితి తెలుకోవడానికి బుధవారం ఆయన కిమ్స్‌ ఆస్పత్రికి వచ్చారు. శ్రీతేజ్‌ ఆరోగ్య స్థితి గురించి వైద్యులను అడిగి, తెలుసుకున్నాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. "శ్రీతేజ్‌ పరిస్థితి పదిరోజులుగా మెరుగవుతోంది. పూర్తి స్థాయిలో కోలుకోవడానికి సమయం పట్టవచ్చని వైద్యులు చెప్పారు. శ్రీతేజ్‌ కోలుకోవడానికి ఏం చేయడానికైనా సిద్ధమే. ప్రభుత్వం కూడా శ్రీతేజ్‌ కోలుకోవడానికి సహకరించడం అభినందనీయం" అని వ్యాఖ్యానించారు. ఘటన జరిగిన మర్నాడే ఆస్పత్రికి వద్దామని బన్నీ అనుకున్నాడని, ఇక్కడ తొక్కిసలాట జరిగే ప్రమాదముందని ఆస్పత్రి నిర్వాహకులు చెప్పడం.. కేసు నమోదు కావడంతో న్యాయనిపుణుడు నిరంజన్‌ బన్నీని వెళ్లొద్దని చెప్పాడన్నారు. శ్రీతేజ్‌ పరిస్థితిని తెలుసుకున్న అల్లు అరవింద్‌.. ఆయన కుటుంబసభ్యులను కలవకుండానే వెళ్లిపోయారు. కాగా, శ్రీతేజ్‌కు వెంటిలేటర్‌ తొలగించి, ట్రాకియోస్టోమీ ట్యూబ్‌ ప్లేస్‌మెంట్‌ చేశారు. తక్కువ డోస్‌ ఇనొట్రోప్‌లతో చికిత్స చేస్తున్నారు. శ్రీతేజ్‌ ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ఆస్పత్రి వర్గాలు బుధవారం విడుదల చేసిన మెడికల్‌ బులెటిన్‌లో వివరించాయి.

జడ్జీల సంఖ్య పెంపునకు పిల్‌ అవసరంలేదు

▸▸ పరిపాలనాపరంగా నిర్ణయం తీసుకుంటాం: హైకోర్టు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టులో జడ్జీల సంఖ్య పెంపుపై తాము పరిపాలనాపరంగా నిర్ణయం తీసుకుంటామని సీజే నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్‌) అవసరం లేదని పేర్కొంది. పిల్‌ ద్వారా ఈ వ్యవహారంలో ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేమంటూ పిల్‌ను పరిష్కరించింది. జడ్జీల సంఖ్యను పెంచాలని 2022లోనే తాము ప్రభుత్వానికి లేఖ రాశామని, అయితే మౌలిక సదుపాయాలు లేవనే కారణంతో అప్పటి ముఖ్యమంత్రి పెంపునకు విముఖత చూపారని తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ధీరజ్‌సింగ్‌ ఠాకూర్‌, జస్టిస్‌ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టులో జడ్జీల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకొనేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి ఈ పిల్‌ దాఖలు చేశారు. బుధవారం ఈ పిల్‌ విచారణకు రాగా పార్టీ ఇన్‌పర్సన్‌ శివప్రసాద్‌ రెడ్డి వాదనలు వినిపించారు. దీనిపై పరిపాలనాపరంగానే నిర్ణయం తీసుకుంటామంటూ ధర్మాసనం వ్యాజ్యాన్ని పరిష్కరించింది.

మామిడి బీమా మార్గదర్శకాలు జారీ

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మామిడి రైతులకు 2024-25, 2025-26 రబీ సీజన్లలో వాతావరణ ఆధారిత పంట బీమా పథకం అమలుకు ప్రభుత్వం బుధవారం మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాల వారీగా హెక్టారుకు బీమా మొత్తం అనంతపురం రూ.82,500, చిత్తూరు, తిరుపతి రూ.87,500, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి రూ.90,000, కాకినాడ, విజయనగరం, తూర్పుగోదావరి రూ.1,00,000, ఎన్టీఆర్‌ జిల్లా రూ.1,02,500, కడప రూ.1,05,000, అనకాపల్లి రూ.1,10,000, ఏలూరు, నంద్యాల, అన్నమయ్య నెల్లూరు రూ.1,12,500గా నిర్ణయించారు. జిల్లాల వారీగా బీమా ప్రీమియంను ఖరారు చేశారు. నంద్యాల 10%, శ్రీసత్యసాయి 14%, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, శ్రీకాకుళం, ఏలూరు 15%, కాకినాడ 16%, ఎన్టీఆర్‌, అన్నమయ్య, విజయనగరం 18%, తూర్పుగోదావరి, తిరుపతి, అనకాపల్లి 20 శాతంగా బీమా ప్రీమియంగా నిర్ణయించారు. ఈ స్థూల ప్రీమియంలో 5% రైతు చెల్లిస్తే... మిలిగిన ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. 2024-25 రబీ సీజన్‌లో మామిడి పంటకు బీమా వర్తింపు కోసం రైతులు ఈ నెలాఖరులోగా పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. నోటిఫైడ్‌ ఏరియాల్లో మామిడి సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులకు కూడా బీమా వర్తింపజేయనున్నారు. అగ్రికల్చర్‌ ఇన్సురెన్స్‌ కంపెనీ ఆఫ్‌ ఇండియా లిమిడెడ్‌కు బీమా అమలు బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది.

బియ్యపు మధుసూదన్‌రెడ్డి కేసు వివరాలు ఇవ్వండి

▸▸ పోలీసులకు హైకోర్టు ఆదేశం

తనపై శ్రీకాళహస్తి పోలీసులు పెట్టిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వేసిన క్వాష్‌ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసుకి సంబంధించి పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. క్వాష్‌ పిటిషన్‌లో అరెస్ట్‌ నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. విచారణను 24కి వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్‌ వీఆర్‌కె కృపాసాగర్‌ ఉత్తర్వులు ఇచ్చారు.

దర్యాప్తునకు సహకరించాలి: తలశిలకు ఆదేశం

▸▸ ఎమ్మెల్సీ ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

టీడీపీ నేత కారంపూడి రవీంద్ర ఆత్మహత్య ఘటనలో నమోదైన కేసులో పోలీసు దర్యాప్తునకు సహకరించాలని వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాంను హైకోర్టు ఆదేశించింది. ఆయన వేసిన ముందస్తు బెయిల్‌ పిటిషన్‌పై విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు ఎమ్మెల్సీ విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేసింది. కౌంటర్‌ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ వీఆర్‌కె కృపాసాగర్‌ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రవీంద్ర ఆత్మహత్యకు తలశిల రఘురాం, మరికొందరు కారణమని పేర్కొంటూ మృతుడి సోదరుడు రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.



నల్లబడిన సాగర తీరం

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖలో సముద్ర తీరం వెంబడి అనేక ప్రాంతాల్లో ఇసుక తిన్నెలు నలుపు రంగులోకి మారాయి. ముఖ్యంగా ఆర్కే బీచ్‌రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న చిల్డ్రన్ పార్కు వరకూ ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. మురుగునీరు సముద్రంలో కలుస్తుండడం వల్లనే తీరమంతా నల్లగా మారిందని నగరవాసులు భావిస్తున్నారు. అయితే, ఇసుక తిన్నెలపై నల్లగా చేరినవన్నీ వ్యర్థాలు కావని, అత్యంత విలువైన ఖనిజాలని నిపుణులు చెబుతున్నారు. లైట్, హెవీ మినరల్స్ విడిపోవడం వల్ల తీరం నల్లగా మారిందని ఆంధ్ర యూనివర్సిటీ జియాలజీ విభాగ సీనియర్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తెలిపారు. వాతావరణ మార్పుల వల్ల అలల ఉధృతి పెరిగినప్పుడు తీరంలో ఉండే లైట్ మినరల్స్ నీటితోపాటు సముద్రంలోకి వెళ్లిపోతాయని, హెవీ మినరల్స్ అక్కడే ఉండిపోతాయన్నారు. అందులో ఇలమనైట్, రుటైల్, గార్నెట్, సిలిమినైట్ వంటివి ఉంటాయని ధనుంజయరావు వెల్లడించారు. ప్రస్తుతం అల్పపీడనం ప్రభావంతో అలల ఉధృతి అధికంగా ఉందని, దీనివల్లే హెవీ మినరల్స్ తీరంలో ఇసుక తిన్నెలపైకి చేరి ఉండిపోతున్నాయన్నారు. ఆ కారణంగానే తీరంలోని అనేక ప్రాంతాల్లో ఇసుక తిన్నెలు నల్లగా మారుతున్నట్టు వెల్లడించారు.



ఆక్రమిత భూమిని కొలిచి రాళ్లను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆక్రమించి.. అమ్మేసి!

- ప్రకాశంలో వైసీపీ నేత చెరువు దోపిడీ.. దర్జాగా ప్లాట్లు వేసి విక్రయం
- జగన్ హయాంలో రూ.5 కోట్ల విలువైన భూమిని కాజేసిన వైనం

మార్కాపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అది చెరువు భూమి. దానిపై వైసీపీకి చెందిన ఓ మండలస్థాయి ప్రజాప్రతినిధి కన్నేశారు. 1.20 ఎకరాల చెరువును తన భూమిలో కలుపుకొని వెంచర్ వేసి అమ్మేసుకున్నారు. బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించేందుకు నడుం బిగించారు. ప్రకాశం జిల్లా మార్కాపురానికి ఆనుకుని ఉండే దరిమడుగులో ఎకరా ధర రూ.5కోట్లకు చేరింది. ఈ గ్రామానికి చెందిన వైసీపీ మాజీ జెడ్పీటీసీ జె.రంగారెడ్డి కన్ను జాతీయరహదారిని ఆనుకుని ఉండే మహ్మద్‌సాహెబ్ కుంట(చెరువు)పై పడింది. నియోజకవర్గస్థాయి వైసీపీ నాయకుడి ఆశీస్సులు తీసుకుని చెరువు స్థలం పక్కనున్న 2ఎకరాల పొలాన్ని కొని వెంచర్ వేశారు. ఈ భూమికి తోడు చెరువు స్థలం 1.20 ఎకరాలను కూడా కలిపేసుకుని, సుమారు రూ.5 కోట్ల విలువచేసే చెరువు స్థలాన్ని పక్క సర్వే నెంబర్లు వేసుకుని రంగారెడ్డి అమ్మేసుకున్నారు. చెరువు భూమిని ఆక్రమించి రంగారెడ్డి అమ్మేసుకున్నారని దరిమడుగు గ్రామస్థులు వైసీపీ హయాంలోనే ఫిర్యాదు చేశారు. అయితే, అధికారులు కన్నెత్తి చూడలేదు. అయితే బుధవారం దరిమడుగులో నిర్వహించిన సదస్సుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు చెరువు ఆక్రమణ వ్యవహారాన్ని ఆయనకు వివరించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. రెవెన్యూ అధికారులతో కలిసి చెరువు స్థలాన్ని పరిశీలించారు. సుమారు 1.20 ఎకరాల మేర చెరువు స్థలాన్ని సదరు వైసీపీ నేత ఆక్రమించినట్లు గుర్తించి వెంటనే రాళ్లను తొలగించారు. కాగా, ఈ ఆక్రమణకు సంబంధించి రంగారెడ్డిపై కేసు పెట్టేదిశగా అధికారులు సిద్ధమవుతున్నారు.

అరెస్టు అక్రమమైనదిగా ప్రకటించలేం

- హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో తన కుమారుడు పప్పులు వెంకటరామిరెడ్డికి అరెస్ట్ సమయంలో పోలీసులు ఎలాంటి కారణాలు చెప్పలేదని, ఈ కేసులో రిమాండ్ విధిస్తూ వినుకొండ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుబాటుకావంటూ నిందితుడి తండ్రి చలమారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అక్రమ అరెస్ట్‌గా ప్రకటించేందుకు నిరాకరించింది. రిమాండ్ రిపోర్టులో అరెస్టు కారణాలను దర్యాప్తు అధికారి పేర్కొన్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తన కుమారుడిని పల్నాడు జిల్లా, ఐనవోలు పోలీసులు అక్రమంగా నిర్బంధించి, కేసు పెట్టారని, మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటుకావంటూ చలమారెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసింది. ఆ తీర్పు వెలువరిస్తూ.. మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 వర్తింపజేయాలంటే గత పదేళ్లలో నిందితుడు ఇదే తరహా నేరాలకు పాల్పడి, ఆ కేసుల్లో కనీసం రెండు చార్జ్‌షీట్లను సంబంధిత కోర్టు పరిగణనలోకి తీసుకొని ఉండాలని, ఈ కేసులో దర్యాప్తు అధికారి దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో ఆ వివరాలేవీ లేవని పేర్కొంది. అయినప్పటికీ కేసులో సెక్షన్ 111 వర్తింపుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపింది. పిటిషనర్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌కు విచారణార్హత ఉంటుందని స్పష్టం చేసింది.

టీడీపీలో ఆళ్ల నాని చేరిక వాయిదా

- సీఎం చంద్రబాబు అందుబాటులో లేనందునే!

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని తెలుగుదేశం పార్టీలో చేరిక వాయిదా పడింది. ముందుగా అనుకున్న ప్రకారం ఆయన బుధవారమిక్కడ సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరాల్సి ఉంది. కానీ సీఎం అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేశారు. మంచి ముహూర్తం చూసుకుని మరో రోజు పార్టీ తీర్థం పుచ్చుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి. కాగా.. గురువారం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. శుక్రవారం ఆయన కృష్ణా జిల్లా ఈడ్పుగల్లులో రెవెన్యూ సదస్సులో పాల్గొంటారు.

టీడీపీ యూ ట్యూబ్ చానెల్‌కు అంతరాయం

టీడీపీ అధికారిక యూ ట్యూబ్ చానెల్‌కు బుధవారం అంతరాయం ఏర్పడింది. దీని ప్రసారాలను నిలిపివేసినట్లు బుధవారం ఆ చానెల్ తెరపై ఒక సందేశం మాత్రం కనిపిస్తోంది. ఈ చానెల్‌పై ప్రత్యర్థులు పదేపదే ఫిర్యాదులు చేసినప్పుడు ఈ సమస్య ఏర్పడుతోందని, యూ ట్యూబ్ యాజమాన్యాన్ని సంప్రదించి తిరిగి ప్రసారాలు ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నామని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

టీడీపీ తలుపులు తెరిస్తే వైసీపీ ఖాళీ: రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ తలుపులు తెరిస్తే వైసీపీ ఖాళీ కావడం ఖాయమని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'అవకాశమిస్తే టీడీపీలో చేరేందుకు వైసీపీ ఎమ్మెల్యేలు అందరూ సిద్ధంగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ముఖ్య నేతలు టీడీపీలో చేరబోతున్నారు. కూటమి పార్టీల సత్తా ఏమిటో సాగునీటి సంఘాల ఎన్నికల్లో చూపించాం. కడప జిల్లాలోనూ వైసీపీ ఖాళీ కావడం ఖాయం' అని రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.

లంచాలు తీసుకొని రాష్ట్ర పరువు తీసిన జగన్

- అదానీకి ముడుపులపై ఏసీబీ విచారణకు ఆదేశించాలి: షర్మిల

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): లంచాలు తీసుకుని వైసీసీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రం పరువు తీశారని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఆంధ్రరత్న భవన్‌లో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా... జగన్, స్వలాభం కోసం విద్యుత్తును ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేసి జనం నెత్తిన రూ.లక్షన్నర కోట్ల భారం వేశారని, సోలార్ విద్యుత్తు కొనుగోలు పెద్ద కుంభకోణం అంటూ తీవ్ర ఆరోపణలు చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు ప్రధాని మోదీ, అదానీకి భయపడి మౌనం పాటిస్తోంది. అదానీ, జగన్ మధ్య ముడుపుల వ్యవహారంపై నిజానిజాలు నిగ్గుతేల్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అదానీపై తక్షణం చర్యలు తీసుకోవాలి. కేంద్రం ఇప్పటికైనా అదానీపై విచారణకు జేపీసీ వేయాలి. రాష్ట్రంలో రూ.1,750 కోట్ల ముడుపుల వ్యవహారంపై ఏసీబీ విచారణకు ఆదేశించాలి' అని షర్మిల అన్నారు.

ఎంపీ విజయసాయి రాజీనామా చేయాలి: వర్ల

వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి వ్యక్తిగత ప్రవర్తనపై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇప్పటికైనా ఆయన తన సత్య శీలతను నిరూపించుకోవాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య సూచించారు. దీనిలో నిజానిజాలు తేలేవరకూ ఆయన ఎంపీ పదవికి రాజీనామా చేయాలన్నారు. బుధవారం ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'మదన్ మోహన్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి.. తన భార్యకు పుట్టిన బిడ్డకు విజయసాయి రెడ్డే తండ్రి అని ఆరోపించారు. ఆ బిడ్డకు తండ్రి ఎవరో తేల్చడానికి విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలని కూడా కోరారు. రూ.1500 కోట్ల దేవదాయ భూముల ఆక్రమణ వ్యవహారం కూడా ఇందులో ముడిపడి ఉందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై విజయసాయి ఎందుకు నోరు తెరవడం లేదు?. ఆయనను వైసీపీ అధిష్ఠానం సస్పెండ్ చేయాలి' అని వర్ల డిమాండ్ చేశారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి: సీపీఐ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడటం దుర్మార్గమని బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. కాగా, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడంపై రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

తెలుగు భక్తుల కోసం భూమి కేటాయించండి

- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఎంపీ కలిశెట్టి విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అయోధ్య, వారాణసీ పుణ్యక్షేత్రాల్లో తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగపడేలా తెలుగు సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. బుధవారం లక్నోలోని సీఎం నివాసంలో ఆయనను ఎంపీ కలిశెట్టి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవనాయుడు కలిసి ఈమేరకు వినతిపత్రం ఇచ్చారు. అయోధ్య రామమందిరం సమీపంలో తెలుగు భక్తుల వసతి ఆహార అవసరాలను తీర్చడానికి భవన నిర్మాణానికి భూమి కేటాయించాలని కోరారు.

వచ్చే బడ్జెట్ స్వర్ణాంధ్ర సాధన దిశగా ఉండాలి

- ఏపీ 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్

వచ్చే ఏడాది కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్.. వికసిత భారత్-స్వర్ణాంధ్ర సాధన దిశగా ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం కేంద్ర మంత్రికి ఆయన వినతిపత్రం ఇచ్చారు. స్కిల్ సెన్సెస్ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.

కేంద్ర మంత్రి గడ్కరీతో సత్యకుమార్ భేటీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ భేటీ అయ్యారు. ఏపీలో కీలకమైన హైవే ప్రాజెక్టులు, సీఆర్ఎఫ్ పనులకు అనుమతుల అంశంపై కేంద్ర మంత్రితో చర్చించారు. ధర్మవరంలోని పలు అభివృద్ధి పనులపై మాట్లాడారు. మంత్రి వెంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కూడా ఉన్నారు. వశిష్ట గోదావరిపై కోడేరు- గన్నవరాన్ని కలుపుతూ వారధి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పితాని ఎక్స్ వేదికగా తెలిపారు.

రామ్మోహన్‌నాయుడికి శుభాకాంక్షల వెల్లువ

- ప్రధాని మోదీని కలిసి ఆశీస్సులందుకున్న కేంద్రమంత్రి

కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బుధవారం తన జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం.. దీర్ఘాయుష్షుతో, ఆయురారోగ్యాలతో జీవించాలని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, పీయూష్ గోయల్, నితిన్‌గడ్కరీ, కిషన్‌రెడ్డి, లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఎక్స్ వేదికగా రామ్మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్ర మంత్రి కార్యాలయానికి వివిధ రంగాలకు చెందిన వందలాది మంది వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఎంపీలు కేంద్ర మంత్రితో బర్త్‌డే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

ఛత్తీస్ టు ఆంధ్రా!

- ఇదేం 'రేషన్' లింకు బాబోయ్
- ఛత్తీస్‌గఢ్ కంపెనీ సత్యం బాలాజీ లీలలెన్నో

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

అది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బియ్యం ఎగుమతి కంపెనీ. పేరంతా అక్కడే అయినా వ్యాపారం కాకినాడలోనే. ఇక్కడినుంచే ఆఫ్రికా దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తున్న ఈ కంపెనీ, ఆ ముసుగులో రేషన్‌బియ్యాన్ని భారీగా సముద్రాలు దాటించేస్తోంది. రేషన్ బియ్యం లోడింగ్ చేస్తూ గత నెల్లో స్టెల్లా నౌకలో పట్టుబడ్డ బియ్యం అంతా ఈ కంపెనీదేనని తాజాగా నిర్ధారణ అయింది. దీంతో ఛత్తీస్‌గఢ్ కంపెనీ సత్యం బాలాజీ.. బాగోతం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నిజానికి, ఈ ఏడాది జూన్‌లో 6,332 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఆ కంపెనీ గోదాముల్లో అధికారులు సీజ్ చేశారు. కంపెనీ యజమాని ప్రదీప్ అగర్వాల్‌పై కేసు నమోదు చేసి క్రిమినల్ చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. మళ్లీ ఐదు నెలలు దాటక ముందే నౌకలో రేషన్ బియ్యంతో దొరికిపోయింది. దీంతో అసలు ఈ కంపెనీకి అంత భారీ మొత్తంలో కాకినాడలో రేషన్ బియ్యం ఎలా చేతికి చిక్కుతున్నాయనేది ఆసక్తికరంగా మారింది. ఈ కంపెనీ కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి గడచిన ఐదేళ్లలో రూ.4,788కోట్ల విలువైన 19లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి చేసింది. ఇందులో ఎన్ని వందల కోట్ల విలువైన రేషన్ బియ్యం ఉందోనన్న అనుమానాలున్నాయి.

దర్జాగా దొంగ వ్యాపారం...

వైసీపీ పాలనలో కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు వేలకోట్ల విలువైన రేషన్ బియ్యం తరలిపోయింది. ప్రభుత్వ ప్రత్యక్ష, పరోక్ష సహకారంతో అనేకమంది బియ్యం ఎగుమతి ముసుగులో పేదల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌ల్లో ఆఫ్రికా దేశాలకు తరలించి వందలకోట్లు సంపాదించారు. ఈ బాగోతాన్ని కూటమి ప్రభుత్వం



స్టెల్లా షిప్‌లో లోడైన బియ్యం

బట్టబయలు చేయడంతో ఇప్పుడు ఒక్కో తివింగలం బయటకు వస్తోంది. అప్పట్లో అధికారం అండతో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం, ఆయన అనుచరులు వేలకోట్ల విలువైన రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఎగుమతిచేసి కోట్లకు కోట్లు సంపాదించిన వైనం ప్రభుత్వం తాజాగా గుర్తించింది. ద్వారంపూడి సోదరుడైన వీరభద్రారెడ్డి.. మానస కంపెనీ పేరుతోను, ఆయన అనుచరుడు వినోద్‌అగర్వాల్ సరళ ఫుడ్స్ పేరుతోను రూ.4,995 కోట్ల విలువైన 13.41లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేసినట్లు లెక్కలు తేలాయి. ఇందులో రేషన్ బియ్యం ఎన్ని వందల కోట్లు ఉంటుందోననే లెక్కలు ప్రభుత్వం నియమించిన 'సిట్' త్వరలో తేల్చనుంది. తాజాగా సత్యం బాలాజీ రైస్ కంపెనీ బాగోతం కూడా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని అధికారికంగా మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ధ్రువీకరించారు.

లక్షల టన్నుల బియ్యం ఎక్కడివి?

సత్యం బాలాజీ కంపెనీ గడచిన ఐదేళ్లలో కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతి చేసింది. ఇందులో 2019-2020లో 3లక్షల మెట్రిక్ టన్నులు, 2020-2021లో 5లక్షల మెట్రిక్ టన్నులు, 2021-2022లో 4.10లక్షలు, 2022-2023లో 4లక్షలు, 2023-2024లో 4లక్షలు, 2024-2025లో ఇప్పటివరకు 89వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేసింది.

అవి రేషన్ బియ్యమే!

- పలు సంస్థలపై క్రిమినల్ కేసులు

విశాఖపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కంటెయినర్ ఫ్రైట్ స్టేషన్ (సీఎ్ఫఎస్) గోదాములో ఈ నెల తొమ్మిదో తేదీన పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీల సందర్భంగా సీజ్ చేసిన బియ్యం రేషన్ డిపోల నుంచి సేకరించినవేనని స్పష్టమైంది. దీనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా యంత్రాంగం ఆదేశించడంతో మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో రెండు సంస్థలు, వాటి యాజమాన్యాలపై కేసు నమోదైంది. అప్పట్లో మంత్రి మనోహర్ 483 టన్నుల బియ్యాన్ని సీజ్ చేయించారు. వాటిలో కొన్ని నమూనాలు తీసి, అవి రేషన్ బియ్యమా? కాదా? అనేది తెలుసుకునేందుకు పౌర సరఫరాల శాఖ...ప్రయోగశాలకు పంపించింది. అక్కడ పరీక్షలన్నీ నిర్వహించి, అవి రేషన్ బియ్యమేనంటూ నివేదిక ఇచ్చారు.

ఐటీ ఉద్యోగులకు

'సూపర్ ఇన్సెంటివ్'

- దేశంలో ఒక్క ఏపీ ప్రభుత్వమే ప్రకటించింది
- టాప్-5 ఐటీ సిటీల్లో విశాఖను నిలబెడతాం
- ఏపీ డీటీఐఎల్ఎఫ్ కన్వీనర్ శ్రీధర్ కొసరాజు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దేశంలో ఇంతవరకూ ఏ రాష్ట్రం కూడా ఐటీ రంగంలో ఉద్యోగులకు రాయితీలు ఇవ్వలేదని, కేవలం యాజమాన్యాలకే ఇస్తున్నారని ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) పూర్వ అధ్యక్షుడు, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ లీడర్‌షిప్ ఫోరం (ఏపీ డీటీఐఎల్ఎఫ్) కన్వీనర్ శ్రీధర్ కొసరాజు చెప్పారు. తొలిసారిగా ఏపీ ప్రభుత్వం ఉద్యోగులకు కూడా 'సూపర్ ఇన్సెంటివ్' ప్రకటించడం గర్వకారణమని అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ, ఐటీఈఎస్‌తో పాటు డిజిటల్ సాంకేతికతలను అన్ని రంగాల్లోకి తీసుకువెళ్లడానికి ఫోరం తరఫున ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

సూపర్ ఇన్సెంటివ్ అంటే...?

ఇంతవరకూ ఐటీ యాజమాన్యాలకు తక్కువ ధరకు భూములు, అద్దె రాయితీ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సంఖ్యను బట్టి ఇన్సెంటివ్‌లు ఇచ్చారు. ఉద్యోగులకు ఎవరూ ఇన్సెంటివ్‌లు ఇవ్వలేదు. ఒకటీ అరా ఇతర ప్రాంతాల్లో ఉన్నా అవి రూ.వేలల్లోనే ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ఐటీ పాలసీలో ఎవరైనా సీనియర్ ఉద్యోగి (కనీసం పదేళ్ల సర్వీసు) ద్వితీయ శ్రేణి నగరాల్లో పనిచేయడానికి ముందుకొస్తే వారికి ఏడాదికి రూ.లక్ష ఇంటి అద్దె అలవెన్స్ లేదా వారి పిల్లల చదువుకు ఏటా రూ.లక్ష ఇన్సెంటివ్ ప్రకటించింది. ఇలా వరుసగా మూడేళ్లు నేరుగా ఉద్యోగి ఖాతాకే జమ చేస్తారు. దీనివల్ల విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లో పనిచేయడానికి చాలామంది ముందుకొస్తారు. విశాఖలో 150 వరకు ఐటీ కంపెనీలు ఉన్నాయి. వాటిలో సగటు వార్షిక జీతం రూ.2.5లక్షల నుంచి రూ.3లక్షలే. కానీ నెలకు రూ.2లక్షల జీతం ఇచ్చే కంపెనీలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు 'పెన్నాట్' అనే సంస్థ రూ.5 లక్షలు ఇస్తోంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌లో ఇంజనీరింగ్ చేసినవారికి సెమీ కండక్టర్స్ కంపెనీలు నెలకు రూ.2 లక్షల జీతం ఇస్తున్నాయి. ఉద్యోగార్థుల్లో నైపుణ్యాలు కూడా ఉండాలి.



ఐటీ పాలసీ ఎలా ఉంది?

పాలసీ ఎలా ఉంటే బాగుంటుందో, పరిశ్రమకు ఏమేం అవసరమో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్నారు. డ్రాఫ్ట్ తయారు చేసినప్పుడు, తర్వాత వ్యక్తిగతంగానూ మాట్లాడారు. ఇది పూర్తిగా పరిశ్రమకు అనుకూల విధానం. చాలా బాగుంది.

ఐటీ రంగాన్ని అమరావతికి తరలిస్తున్నారా?

అదంతా దుష్ప్రచారం. అమరావతి రాష్ట్ర రాజధాని. అక్కడ అన్ని రంగాలకు ప్రాధాన్యం ఉండాలి. ఆ విధంగా కొంత ఐటీ కేటాయింపులు ఉంటాయి. అయితే ఐటీ డెస్టినేషన్ సెంటర్ విశాఖపట్నమే అని పాలసీలో స్పష్టంగా ప్రకటించారు. అందుకే టీసీఎస్, గూగుల్ కంపెనీలు ఇక్కడ పెడుతున్నారు.

హైదరాబాద్, బెంగళూరుతో విశాఖ పోటీ పడగలదా?

అలా పోటీ పడేలా చేయాలనేదే మా ఫోరం ప్రయత్నం. ప్రస్తుతం ఏపీ వార్షిక ఐటీ ఎగుమతుల విలువ రూ.5 వేల కోట్లు. అదే హైదరాబాద్‌లో రూ.2 లక్షల కోట్లు. 2030 నాటికి ఏపీ నుంచి రూ.లక్ష కోట్ల విలువైన ఎగుమతులు సాధించి, టాప్-5 ఐటీ నగరాల్లో ఒకటిగా విశాఖను నిలపాలనేది లక్ష్యం. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు గమనిస్తూ అందుకు అనుగుణంగా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలు పెంచాలని కోరాం. కొత్తగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కూడా పెంచనున్నారు. గతంలో బీపీఓ కంపెనీలు ప్రపంచంలో ఎక్కడో ఉండి భారత్‌లో ఖర్చు తక్కువని ఇక్కడ బ్యాక్ ఆఫీసులు నిర్వహించేవి. తరువాత ఇక్కడే సొంత కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇప్పుడు అక్కడే కొత్త ఆలోచనలకు రూపకల్పన జరుగుతోంది. అవన్నీ ఇన్నోవేషన్ కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి ప్రత్యామ్నాయ హెడ్ క్వార్టర్లుగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి 5వేల కేంద్రాలు ఉండగా వాటిలో ఒక్క భారత్‌లోనే 1,500 వరకూ ఉన్నాయి. రాష్ట్రంలోనూ వాటిని అభివృద్ధి చేయాలనేది లక్ష్యం.

5 లక్షల మందికి ఉపాధి కల్పన సాధ్యమా?

ప్రస్తుతం ఏపీలో 50వేల మంది ఐటీ ఉద్యోగులు ఉంటే 35వేల మంది ఒక్క విశాఖలోనే ఉన్నారు. ఇప్పుడు ఐటీ అర్థం మారిపోయింది. డీప్ టెక్నాలజీని అన్ని రంగాల్లో వాడుతున్నారు. రోబోటిక్స్, డ్రోన్లు వంటివన్నీ ఈ కోవలోకే వస్తాయి. ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో కొత్త ఆవిష్కరణలన్నీ టెక్నాలజీ వల్లనే సాధ్యమవుతున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ, భోగాపురం ఇలా కొత్త ప్రాంతాల్లో ఐటీని అభివృద్ధి చేస్తే ఉద్యోగ కల్పన సాధ్యమే.

గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు జోగి వస్తున్నారని మాకు తెలియదు

- అంతరాయం కలుగుతుందని అక్కడే ఉండిపోయా
- ఇది ఉద్దేశపూర్వకంగా చేయలేదు: కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో జరిగిన సర్దార్ గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ సభకు వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేశ్ హాజరవుతారని తనకు తెలియదని టీడీపీ సీనియర్ నేత, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు చెప్పారు. విగ్రహావిష్కరణకు అంతరాయం కలుగకూడదనే భావంతో చివరి వరకు అక్కడే ఉన్నానని బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో చెప్పారు. విగ్రహావిష్కరణ కమిటీ ప్రతినిధులు ఆహ్వానిస్తే తనతో పాటు మంత్రి మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే గౌతు శిరీష, మరికొందరు గౌడ సంఘ నాయకులం వెళ్లామన్నారు. ఆ సభకు జోగి రమేశ్ వస్తున్నట్లు తనకు తెలియదని.. తెలిస్తే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవారిమని చెప్పారు. ఇలాంటివి ఇక పునరావృతం కాకుండా జాగ్రత్తపడతామన్నారు. టీడీపీ శ్రేణులు అర్థం చేసుకోవాలని కోరారు. అవగాహనా లోపం వల్ల సోషల్ మీడియాలో కొన్ని కథనాలు వస్తున్నాయని, దీనివల్లే వివరణ ఇస్తున్నానన్నారు. తనకు, జోగికి ఏ విధమైన సంబంధాలూ లేవని చెప్పారు. బందరు మండలం కొత్తపూడిలో మాజీ మంత్రి పేర్ని నాని గిడ్డంగి నుంచి అక్రమంగా రూ.కోటి 70 లక్షల విలువ గల రేషన్ తరలించిన కేసులో ప్రభుత్వం ఆయనపై చట్ట రీత్యా చర్యలు తీసుకోక తప్పదన్నారు. డబ్బు చెల్లించినంత మాత్రాన ప్రభుత్వం వదిలిపెట్టదని చెప్పారు.

గాడి తప్పిన పాలనను దారిలో పెట్టాం

- ఇక అభివృద్ధిలో దూసుకుపోతాం
- జూలైలోపు మున్సిపల్ ఎన్నికలు: మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జూలైలోపు రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. గోదావరి పుష్కరాల నాటికి పట్టణాల్లో దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మున్సిపాల్టీలు స్వయంపాలనతో ముందుకు వెళ్లాలని, 2014లో తాము ఒక పైసా పన్ను కూడా పెంచలేదన్నారు. గత ప్రభుత్వం చాలా పెంచిందన్నారు. గత ప్రభుత్వంలో గాడితప్పిన పాలనను ఈ ఆరు నెలలో గాడిలో పెట్టామని, ఇక అభివృద్ధిలో దూసుకుపోతామని చెప్పారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మంచినీరు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పనులను రెండేళ్లలో 80 శాతం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో రోజుకు 7 వేల టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందని, చెత్త నుంచి సంపద సృష్టించేందుకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నంలలో చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. రాజమండ్రి-కాకినాడ, కడప-అనంతపురం, నెల్లూరు-గూడూరు మధ్య ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించామని, త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. అమరావతిని గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మంత్రి నారాయణ కాకినాడలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో రాజధాని అమరావతిలో పనులను పరుగులు తీయిస్తామని చెప్పారు. అమరావతిని పూర్తిస్థాయిలో నిర్మిస్తామన్నారు.

రంగంలోకి ఈడీ!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి కాకినాడ సీపోర్టులో ఇటీవల సీఐడీ అధికారుల బృందం సోదాలు జరిపింది. బలవంతపు డీల్ వెనుక జరిగిన లావాదేవీలపై కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంది. కేవీరావు వాటాను కారుచౌకగా కొట్టేయడం, అరబిందో కంపెనీ పేరిట షేర్లను బలవంతంగా రాయించిన ఘటనలో వందల కోట్లు చేతులు మారాయని... మనీలాండరింగ్ జరిగిందని ఈడీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో... ఈ డీల్‌లో కీలక పాత్ర పోషించిన విక్రాంత్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ఇదీ విషయం...: కాకినాడ సీపోర్టులోని తన వాటాలను బలవంతంగా రాయించుకున్న వైనంపై కేవీ రావు సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదు చేశారు. 'పోర్టులో 2500 కోట్ల వాటాను 494కోట్లకు లాక్కున్నారు' అని తెలిపారు. జగన్ సీఎం అయిన తర్వాతే తమకు ఇక్కట్లు మొదలయ్యాయని, మారిటైమ్ బోర్డు సహకారం కరువైందని చెప్పారు. "చెన్నైకి చెందిన శ్రీధర్ అండ్ సంతానం కంపెనీతో ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం నుంచి సమాచారం వచ్చింది. ముంబైకి చెందిన మరో సంస్థతోనూ ఆడిట్ అంటూ సమాచారం ఇచ్చారు. రెండు సంస్థలకూ మేం సహకరించాం. రికార్డులన్నీ వారి ముందుంచాం. మా సంస్థ ప్రభుత్వానికి 994కోట్ల రూపాయలు ఎగ్గొట్టినట్లు ఆడిట్ కంపెనీ వైసీపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఇదే సమయంలో... మాకు విజయసాయి రెడ్డి ఫోన్ చేశారు. జగన్ బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డిని కలవాలని సూచించారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న విక్రాంత్ ఇంటికెళ్లి కలిసి మాట్లాడగా.. 'మీరు ప్రభుత్వానికి వెయ్యి కోట్లు ఎగ్గొట్టారు. మొత్తం కుటుంబం జైలుకు వెళ్లకూడదు అనుకుంటే మీ కంపెనీ షేర్లన్నీ విక్రయించేయండి. ఇది నా మాట కాదు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశం' అని భయపెట్టారు. 41.14శాతానికి 494కోట్ల రూపాయలు ఖరారు చేశామని, డీల్ సెట్ చేసుకోమని ఏకపక్షంగా చెప్పారు" అని కేవీరావు తన ఫిర్యాదులో తెలిపారు. వేలకోట్ల ఆస్తులను కొట్టేసిన అనంతరం... వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌కు తనను తీసుకెళ్లారని.. 'ఇది చాలా అన్యాయం' అని చెప్పబోతుండగా... 'విక్రాంత్ చెప్పినట్లు చెయ్యండి' అంటూ జగన్ హుకుం జారీ చేశారని తెలిపారు. అంతకుముందు తాము ప్రభుత్వానికి రూ.994 కోట్లు ఎగ్గొట్టామని నివేదిక ఇచ్చిన శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ... ఆ తర్వాత పన్ను ఎగవేత తొమ్మిది కోట్లే అని తేల్చిందని వెల్లడించారు.

ఇప్పటికే సీఐడీ కేసు...

కేవీ రావు ఫిర్యాదు మేరకు సీఐడీ వైవిక్రాంత్ రెడ్డి (వైవీ సుబ్బారెడ్డి కుమారుడు)ని ఏ1గా పేర్కొంటూ కేసు నమోదు చేసింది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, శరత్ చంద్రారెడ్డి, శ్రీధర్ అండ్ సంతానం ఆడిట్ కంపెనీ, అరబిందో సంస్థను నిందితులుగా చేర్చింది. ప్రస్తుతానికి విక్రాంత్ రెడ్డికి మాత్రమే ఈడీ నోటీసులిచ్చినట్లు తెలిసింది.



ముంబై సముద్రతీరంలో పడవ ప్రమాదం

» 13 మంది మృతి, ప్రాణాలతో బయటపడిన 101 మంది

» ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొన్న నేవీ బోటు

ముంబై, డిసెంబరు 18: ముంబై సముద్రతీరంలో బుధవారం విషాద ఘటన చోటుచేసుకుంది. 'గేట్‌వే ఆఫ్ ఇండియా' నుంచి ప్రసిద్ధి చెందిన ఎలిఫెంటా దీవులకు ప్రయాణికులతో వెళ్తున్న నీల్‌కమల్ అనే పడవను నేవీకి చెందిన బోటు ఢీకొట్టిన ఘటనలో 13 మంది దుర్మరణం చెందారు. ఈ ఘటనలో 101 మందిని కాపాడినట్టు మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ తెలిపారు. ప్రయాణికులతో నీల్‌కమల్ ఫెర్రీ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన నేవీ స్పీడ్ బోటు ఢీకొట్టింది. దీంతో ఆ ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. నేవీ బోటుకు ఇటీవలే కొత్త ఇంజన్‌ను బిగించారు. దాన్ని పరీక్షిస్తున్న సమయంలో అది నియంత్రణ కోల్పోయి నీల్‌కమల్ ఫెర్రీని ఢీకొట్టింది. నేవీ బోటులో ఆరుగురున్నారని, వీరిలో ఇద్దరు నేవీ సిబ్బంది కాగా నలుగురు ఇంజన్ సరఫరా చేసిన కంపెనీకి చెందిన వారని తెలుస్తోంది. నీల్‌కమల్ ఫెర్రీలో 110 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు.

సరిహద్దులో చొచ్చుకొస్తున్న చైనా

» డోక్లాం సమీపంలో వేగంగా గ్రామాల నిర్మాణం

న్యూఢిల్లీ, డిసెంబరు 18: భారత సరిహద్దుల్లో చైనా ఘర్షణ పెంచే చర్యలకు పాల్పడుతోంది. డోక్లాం సమీపంలో జోరుగా ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తూ కవ్విస్తోంది. గత ఎనిమిదేళ్ల నుంచి చూస్తే ఇప్పటి వరకు ఆ వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతానికి సమీపంలో 22 గ్రామాలు, జనావాసాలను ఏర్పాటు చేసింది. 2020 నుంచి ఇప్పటి వరకు అక్కడ 8 గ్రామాలు నిర్మించినట్లు ఉపగ్రహ చిత్రాల ద్వారా తెలుస్తోంది. ఈ గ్రామాలను డోక్లాం సమీపంలో భూటాన్ భూభాగంలోని పశ్చిమ ప్రాంతంలో కడుతున్న చైనా.. ఆ భూమి తమదేనంటూ చెప్పుకుంటోంది. ఈ గ్రామాలు భూటాన్ పశ్చిమ భాగంలోనే ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. కాగా, 2017లో డోక్లాం సరిహద్దులో చైనా రోడ్డు నిర్మిస్తున్న సమయంలో భారత్ అడ్డుకుంది. అప్పుడు ఇరు పక్షాల మధ్య ఘర్షణ నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ వ్యూహాత్మక పీఠభూమిలో భారత్ సరిహద్దువైపు చొచ్చుకురావడానికి చైనా ప్రయత్నిస్తోంది. దానిలో భాగంగా భూటాన్ భూగాన్ని ఆక్రమించి గ్రామాలు నిర్మిస్తూ తన ప్రజలను అక్కడకి తరలిస్తోంది.

హైకోర్టు విశ్రాంత జడ్జీలకు పెన్షన్ రూ.15 వేలేనా..?: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 18: హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు మాత్రమే నెలవారీ పెన్షన్ అందుతుండటంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దయనీయమని విచారం వ్యక్తం చేసింది. ఇలాంటి విషయాల్లో చట్టపర విధానాలకు బదులుగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అధికార వర్గాలకు సూచించింది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు వేర్వేరు పెన్షన్లు చెల్లించాలనే అంశాన్ని లేవనెత్తుతూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం బుధవారం విచారించింది. 13 ఏళ్ల జిల్లా కోర్టు జ్యుడీషియల్ అధికారిగా సేవలందించానని.. అనంతరం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి రిటైరైన తనకు రూ.15 వేలే పెన్షన్ అందుతోందని ఓ పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. దీంతో కోర్టు ఈ విషయాన్ని అటార్నీ జనరల్ వెంకటరమణి ముందు ప్రస్తావించగా.. ఆయన ఈ కేసును జనవరికి వాయిదా వేయాలని కోరారు. సమస్య పరిష్కారానికి కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు.

డమ్మీ పిస్టల్‌తో బెదిరించి.. బంగారం దోచేసి..!

కాకినాడ జ్యూయలరీ షాపులో ఘటన



నిందితుడు సతీష్

కాకినాడ క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): డమ్మీ తుపాకితో బెదిరించి నగల దుకాణంలో బంగారం దోచేసిన దొంగను ట్రాఫిక్ పోలీసులు వెంటాడి పట్టుకున్న ఉదంతం కాకినాడలో చోటు చేసుకుంది. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామానికి చెందిన 26 ఏళ్ల నూకల సతీష్ వ్యవసనాలకు బానిసై జులాయిగా తిరుగుతూ దొంగతనాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో సతీష్ బుధవారం కాకినాడ దేవాలయం వీధిలోని తనిష్క్ జ్యూయలరీ షాప్‌లోకి వెళ్లాడు. బంగారం చైన్లు చూపించమని సేల్స్‌మ్యాన్‌ను కోరాడు. అతడు పలు మోడళ్ల బంగారపు చైన్లు చూపిస్తుండగా.. తన జేబులో ఉన్న పిస్టల్‌ను తీసి సేల్స్‌మ్యాన్‌కు పాయింట్ బ్లాంక్‌లో గురిపెట్టి బెదిరించాడు. దీంతో సేల్స్‌మ్యాన్ బిత్తర చూపులు చూస్తూ ఉండిపోగా, సతీష్ చేతికి అందిన బంగారాన్ని లాక్కుని పరుగు లంకించుకున్నాడు. వెంటనే తేరుకున్న సేల్స్‌మ్యాన్.. నిందితుడి వెనకాల పరిగెడుతూ పెద్దగా కేకలు వేయగా, సమీపంలో ట్రాఫిక్ పోలీసులు నిందితుడిని వెంబడించి పట్టుకున్నారు. అతడు తస్కరించిన 39 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని జ్యూయలరీ షాపు యాజమాన్యానికి అప్పగించారు. నిందితుడు ఉపయోగించింది డమ్మీ పిస్టల్‌గా గుర్తించి వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కెనడాలో విశాఖ యువకుడి మృతి



పిల్లి ఫణికుమార్

పెదగంట్యాడ(విశాఖపట్నం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులకు కెనడా వెళ్లిన విశాఖ యువకుడు అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. నగరంలోని పెదగంట్యాడ దయాళ్‌నగర్‌కు చెందిన పిల్లి ఫణికుమార్(33) ఈ ఏడాది ఆగస్టులో కెనడా వెళ్లి సదరన్ ఆల్బెర్టా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎంబీఏ కోర్సులో చేరారు. అయితే, ఫణికుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు బుధవారం ఉదయం రూమ్‌మేట్ నుంచి తండ్రి పిల్లి నాగప్రసాద్‌కు ఫోన్ వచ్చింది. ఫణికుమార్ మరణవార్త వినగానే తండ్రి నాగప్రసాద్ కుప్పకూలిపోయారు. మృతదేహాన్ని కెనడా వైద్య బృందం అంబులెన్స్‌లో తీసుకెళ్లినట్టు రూమ్‌మేట్ తెలిపారు. మృతదేహాన్ని విశాఖ తెచ్చేందుకు సహకరించాలని నాగప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును, జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంలో ఊరట

» తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే

న్యూఢిల్లీ, డిసెంబర్18(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం స్టేటస్ కో విధించింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది. తదుపరి విచారణ జనవరి 22కు వాయిదా వేసింది. 2002లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే, ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ క్రమంలో అర్హత లేని 1200 మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తూ 2012లో రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత బాధితుల విజ్ఞప్తి మేరకు తొలగించిన 1200 మందిని కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాల్లోకి తీసుకుంటూ 2013లో మరో జీవో జారీ చేసింది. అయితే, 2013లో కాంట్రాక్ట్ పద్ధతిలోకి తీసుకుంటూ ఇచ్చిన జీవో చెల్లదని ఇటీవల తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనివల్ల భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హైకోర్టు పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తే, ప్రభుత్వం చేసిన తప్పే తామూ చేసినట్టు అవుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. 90 రోజుల్లో అర్హతతో కూడిన మరో జాబితాను సిద్ధం చేయాలని తీర్పులో ఆదేశించింది. హైకోర్టు తీర్పును బాధితులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.

అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టే కుట్రలు!

కాంగ్రెస్ బండారాన్ని అమిత్‌షా బయటపెట్టారు.. దాంతోనే కొత్త నాటకాలు.. ప్రధాని మోదీ ఆగ్రహం

» హోం మంత్రి వ్యాఖ్యలకు సమర్థన

» అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఎన్నటికీ మాట్లాడను: అమిత్‌షా

న్యూఢిల్లీ, డిసెంబరు 18: ప్రతి దానికీ అంబేడ్కర్ పేరు ప్రస్తావించడం కాంగ్రెస్‌కు ఫ్యాషన్‌గా మారిందని.. ఆయన పేరు కాకుండా దేవుడిని స్మరించుకుంటే ఏడు జన్మలు స్వర్గం లభిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ గట్టిగా సమర్థించారు. అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు ఆ పార్టీ పన్నని కుట్ర లేదని విమర్శించారు. బాబాసాహెబ్‌ను అవమానించిన ఆ పార్టీ చరిత్రను, వాస్తవాల చిట్టాను షా రాజ్యసభలో బయటపెట్టారని.. అది చూసి కాంగ్రెస్ నేతలు బిత్తరపోయారని అన్నారు. అందుకే అంబేడ్కర్‌ను ఆయన అవమానించారని, కేబినెట్ నుంచి బహిష్కరించాలంటూ కొత్త నాటకాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. 'వారి దురదృష్టం ఏమిటంటే.. ప్రజలకు నిజం తెలుసు' అని ప్రధాని బుధవారం 'ఎక్స్'లో వరుస ట్వీట్లు చేశారు. అటు కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్, కిరెన్ రిజిజు కూడా షాకు అండగా నిలిచారు. తాను అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా ఒక్కనాటికీ మాట్లాడనని షా తేల్చిచెప్పారు. 'అంబేడ్కర్‌ను అవమానించిన, ఎస్సీ, ఎస్టీలను నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ చీకటి చరిత్రను అమిత్‌షా పార్లమెంటులో బట్టబయలు చేశారు. ఏళ్ల తరబడి అధికారం అనుభవించి.. ఎస్సీ, ఎస్టీల సాధికారతకు చేసింది శూన్యం' అని ప్రధాని విరుచుకుపడ్డారు. అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ చేసిన 'పాపాల' జాబితాను ఆయన విడుదల చేశారు. 'ఎన్నికల్లో ఒకసారి కాదు.. రెండు సార్లు ఆయన్ను ఓడించారు. ఎలాగైనా ఆయన్ను ఓడించాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నెహ్రూయే స్వయంగా వ్యతిరేక ప్రచారం చేశారు. ఆయనకు భారతరత్నను తిరస్కరించారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో ఆయన చిత్రపటాన్ని కూడా పెట్టలేదు. ఓ కుటుంబం సారథ్యంలోని ఒకానొక పార్టీ.. డాక్టర్ అంబేడ్కర్ చరిత్రను తుడిచిపెట్టేందుకు పన్నిన పన్నాగాలను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారు' అని తెలిపారు.



పార్లమెంటు ఆవరణలో ఇండియా కూటమి నిరసన

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం చేసిన పనులను ప్రధాని ప్రస్తావించారు. బాబాసాహెబ్‌తో సంబంధం ఉన్న ఐదు చారిత్రక స్థలాలను.. 'పంచతీర్థ' పేరిట అభివృద్ధి చేశామన్నారు. 'చైత్యభూమి వ్యవహారంలో దశాబ్దాల తరబడి స్థలం సమస్య పెండింగ్‌లో ఉంటే.. మేం దానిని పరిష్కరించాం. అక్కడకు నేనే వెళ్లి ప్రార్థన చేసి వచ్చాను. ఢిల్లీలో అంబేడ్కర్ చివరి సంవత్సరాల్లో గడపిన ఇంటిని అభివృద్ధి చేశాం. లండన్‌లో ఆయన నివసించిన ఇంటిని కూడా భారత ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇవాళ మేమీ స్థాయిలో ఉన్నామంటే అంబేడ్కర్ వల్లనే' అని ప్రధాని స్పష్టం చేశారు.

నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది: షా

అంబేడ్కర్‌పై తాను చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరిస్తోందని అమిత్‌షా విరుచుకుపడ్డారు. బాబాసాహెబ్‌కు వ్యతిరేకంగా తాను ఎన్నటికీ మాట్లాడనని తేల్చిచెప్పారు. బుధవారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కాంగ్రెస్ అంబేడ్కర్ వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. రిజర్వేషన్ల వ్యతిరేక పార్టీ. రాజ్యాంగ విలువలను మసకబార్చిన చరిత్ర కాంగ్రెస్‌ది' అని దుయ్యబట్టారు. తన రాజీనామాకు ఖర్గే డిమాండ్ చేయడాన్ని ప్రస్తావించగా.. 'అది ఆయన్ను సంతృప్తిపరిచేటట్లయితే పదవి నుంచి వైదొలుగుతా. కానీ దానివల్ల ఆయన సమస్యలు తీరవు. మరో 15 ఏళ్లు ఆయన ప్రతిపక్షంలోనే ఉండాల్సి ఉంటుంది' అని షా తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించడాన్ని దేశం సహించదు

» అమిత్‌షా క్షమాపణ చెప్పాలి: రాహుల్

» కేబినెట్ నుంచి తొలగించాలి: ఖర్గే

» పార్లమెంటు ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, డిసెంబరు 18: బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను అవమానించడాన్ని దేశం సహించదని లోక్‌సభలో ప్రధానప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా ఇండియా కూటమి ఎంపీలు బుధవారం పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ ఫొటోలను రాహుల్ ఫేస్‌బుక్‌లో, ప్రియాంక 'ఎక్స్'లో పోస్టు చేశారు. అంబేడ్కర్‌కు, ఆయన సిద్ధాంతాలకు బీజేపీ వ్యతిరేకమని ఆ పోస్టు కింద రాహుల్ హిందీలో రాశారు. అలాగే, పార్లమెంటు ఆవరణలో రాహుల్ మీడియాతో మాట్లాడుతూ 'రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ సేవలను తుడిచిపెట్టేసేందుకు వారంతా(బీజేపీ) పనిచేస్తున్నారు. ఇది దేశం మొత్తానికీ తెలుసు' అన్నారు. కాగా, అంబేడ్కర్ పేరు చెబితే ఎవరికైనా హక్కులు లభిస్తాయని ప్రియాంక హిందీలో పోస్టు చేశారు. 'మానవుల గౌరవానికి అంబేడ్కర్ ప్రతీక. కోట్లాదిమంది దళితులు, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక' అని ప్రియాంక పేర్కొన్నారు. ప్రధాని మోదీకి అంబేడ్కర్‌పై ఏ మాత్రం గౌరవమున్నా.. తక్షణమే కేంద్ర కేబినెట్ నుంచి అమిత్‌షాను తొలగించాలని ఖర్గే డిమాండ్ చేశారు. 'అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు ఖండించదగినవి. దళిత నాయకుడిని ఆయన అవమానించారు. వారికి ఆయన పూజ్యనీయులు. అమిత్‌షా వ్యాఖ్యలను మోదీ తప్పుబట్టకుండా సమర్థిస్తున్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ఎంపీ లేదా మంత్రి దానిని అవమానిస్తే, తక్షణమే కేబినెట్ నుంచి తొలగించాలి. లేకుంటే ప్రజలు నిరసన తెలుపుతారు. నినాదాలు చేస్తారు. బాబాసాహెబ్ కోసం తమ ప్రాణాలను అర్పించడానికీ ప్రజలు సిద్ధం' అన్నారు. మరోవైపు రాజ్యసభలో అమిత్‌షా చేసిన ప్రసంగం వీడియోను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ప్రధాని మోదీని కలిసిన పవార్



న్యూఢిల్లీ, డిసెంబరు 18 : నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ-ఎస్పీ) అధినేత శరద్ పవార్ ప్రధాని నరేంద్ర మోదీని బుధవారం కలిశారు. పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో వీరి భేటీ జరిగింది. మహారాష్ట్రకు చెందిన పలువురు దానిమ్మ రైతులతో కలిసి పవార్ ప్రధానిని కలిశారు. సదరు రైతులు తమ తోటలో పండించిన దానిమ్మకాయలను ప్రధానికి ఇచ్చారు. అనంతరం పవార్ కాసేపు ప్రధానితో మాట్లాడారు. కాగా, తమ మధ్య రాజకీయాల ప్రస్తావన రాలేదని, దానిమ్మ రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మోదీ దృష్టికి తీసుకెళ్లానని ప్రధానితో భేటీ అనంతరం పవార్ పేర్కొన్నారు. అలాగే, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా పవార్ బుధవారం కలిశారు. కాగా, కాంగ్రెస్, ఎన్‌సీపీ-ఎస్పీ, శివసేన (యూబీటీ)తో కూడిన మహావికాస్ అఘాడీ కూటమి నవంబరులో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-శివసేన- ఎన్‌సీపీతో కూడిన మహాయుతి చేతిలో ఘోర ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే.

జమిలి ఎన్నికల బిల్లు జేపీసీలో ప్రియాంక!



న్యూఢిల్లీ, డిసెంబర్18(ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలి ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణల బిల్లుపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించారు. ఈ కమిటీలో ఉభయసభలకు చెందిన 31 మంది సభ్యులు ఉంటారు. లోక్ సభకు చెందిన 21 మంది సభ్యుల పేర్లను బుధవారం న్యాయశాఖమంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రకటించారు. వీరిలో ఏపీకి చెందిన బీజేపీ సభ్యుడు సీఎం రమేశ్, టీడీపీ సభ్యుడు జీఎం హరీశ్ బాలయోగి, జనసేన సభ్యుడు వల్లభనేని బాలశౌరి ఉన్నారు. ఇతర సభ్యుల్లో పీపీ చౌదరి, బాన్సురీస్వరాజ్, పురుషోత్తం రూపాలా, విష్ణుదయాల్ రామ్, భర్తృహరి మెహతా, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదయాళ్ శర్మ, ప్రియాంకాగాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖ్ దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వగణపతి, సుప్రియా సూలే, శ్రీకాంత్ షిండే, చందన్ చౌహాన్ ఉన్నారు. ఇక మిగతా 10 మంది రాజ్యసభ నుంచి ఉంటారని, వారి పేర్లను గురువారం ప్రకటిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

జమిలి బిల్లుల సమయంలో.. గడ్కరీ, సింధియా డుమ్మా

న్యూఢిల్లీ, డిసెంబరు 18: మోదీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా లోక్‌సభలో మంగళవారం 'ఒక దేశం-ఒకే ఎన్నిక' సంబంధ బిల్లులు ప్రవేశపెట్టింది. ఆ సందర్భంగా సభకు తప్పకుండా హాజరు కావాలని తన ఎంపీలకు విప్ కూడా జారీచేసింది. అయినా కూడా కేంద్ర మంత్రి గడ్కరీ సభకు రాకపోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆయన, మరో ముగ్గురు కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, గిరిరాజ్ సింగ్, సీఆర్ పాటిల్ సహా మొత్తం 20 మంది ఎంపీలు సభకు రాలేదు. వారందరికీ నోటీసులు జారీ చేయాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. తమ గైర్హాజరుపై వారు పార్టీకి ముందస్తు సమాచారం ఇచ్చారో లేదో తెలియరాలేదు.

వారి నుంచి 17,750 కోట్లు తిరిగి రాబట్టాం: నిర్మల

న్యూఢిల్లీ, డిసెంబరు 18: బ్యాంకుల వద్ద అప్పు తీసుకుని తిరిగి కట్టకుండా దేశం వదిలి పారిపోయిన ప్రముఖ వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ నుంచి ఈడీ రూ. 17,750 కోట్లు తిరిగి వసూలు చేసి బ్యాంకులకు చెల్లించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం ఓ ప్రశ్నకు నిర్మలా సీతారామన్ బదులిస్తూ, విజయ్ మాల్యా నుంచి రూ. 14,131 కోట్లు, నీరవ్ మోదీ నుంచి రూ.1,052.58 కోట్లు, మెహుల్ చోక్సీ నుంచి రూ.2,565.90 కోట్లు తిరిగి వసూలు చేసి బ్యాంకులకు చెల్లించామని తెలియజేశారు. బ్యాంకులను ముంచిన ఆర్థిక నేరస్థుల నుంచి మొత్తంగా రూ.22,280 కోట్లు తిరిగి వసూలు చేశామని ఆమె వెల్లడించారు.

అధిక పెన్షన్ పథకం.. వివరాల సమర్పణ గడువు పెంపు

జనవరి 31 వరకు అవకాశం: ఈపీఎఫ్‌వో

న్యూఢిల్లీ, డిసెంబరు 18: అధిక పింఛన్‌కు సంబంధించిన వివరాలను సమర్పించేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) గడువు పెంచింది. వచ్చేనెల (జనవరి) 31 వరకు ఉద్యోగుల వేతన వివరాలను అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొంది. 2023 ఫిబ్రవరి 26న ఈ పథకం ప్రారంభమవ్వగా.. గడువు(2023 జూలై 11) లోగా మొత్తం 17.49 లక్షల మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే.. ఉద్యోగుల వేతన వివరాలను అప్‌లోడ్ చేసే విషయంలో యాజమాన్యాల నుంచి ఆలస్యం జరుగుతోంది. దీంతో.. ఇంకా 3.1 లక్షల దరఖాస్తుదారులకు సంబంధించిన వివరాలు ఈపీఎఫ్‌వోకు అందలేదు. నిజానికి ఈ ఏడాది మే 31 కల్లా ఈ వివరాలను అందజేయాల్సి ఉండగా.. ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వచ్చే నెల 31 వరకు గడువును పొడిగించారు.


'సంగం'కు ఆస్తుల అప్పగింత

అమరావతి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా సంగం డెయిరీకి సంబంధించి, గత ప్రభుత్వం 2021, ఏప్రిల్ 27న జారీ చేసిన జీవో 19ని కూటమి సర్కార్ ఉపసంహరించింది. దీనితో పాటు గుంటూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘానికి డెయిరీ ఆస్తులను తిరిగి బదిలీ చేస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా 'సంగం' ఆస్తులను కట్టడి చేయడం లేదా అన్యాక్రాంతం చేయరాదని షరతు విధించింది. ఆస్తుల సంరక్షణకు ప్రభుత్వం విధించే ఏవైనా అదనపు షరతులకు లోబడి ఉండాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

హెచ్-1బీ రూల్స్ సరళతరం

ఎఫ్-1ను హెచ్-1బీగా మార్చుకునే చాన్స్.. బైడెన్ నిర్ణయం.. జనవరి 17 నుంచి అమలు

లక్షల మంది భారత ఐటీ నిపుణులకు లబ్ధి



వాషింగ్టన్, డిసెంబరు 18: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగం చేయాలని కలలు కనే భారతీయులకు ఇదో తీపికబురు! అమెరికాలోని కంపెనీలు విదేశీ నిపుణులను సులభంగా నియమించుకునే అవకాశం కల్పిస్తూ జో బైడెన్ ప్రభుత్వం వీసా నిబంధనలను సరళతరం చేసింది. ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను హెచ్-1బీ వీసాలుగా సులభంగా మార్చుకునే అవకాశం కల్పించింది. ఫలితంగా లక్షల మంది భారత ఐటీ నిపుణుల అమెరికా కల సాకారం కానుంది. ప్రస్తుతం ఉన్న హెచ్-1బీ వీసాలు నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు. వీటి ద్వారా అమెరికా కంపెనీలు విదేశీ నిపుణులను ప్రత్యేకమైన పనులకు నియమించుకుంటున్నాయి. ఏటా ఇలా భారత్, చైనా సహా విదేశాల నుంచి వేల మందిని ఐటీ కంపెనీలు తీసుకుంటున్నాయి. ఇప్పుడు చేసిన వీసా నిబంధనల సరళీకరణతో మరింత మందికి అవకాశం కల్పించే చాన్స్ ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్) ప్రకటించింది. తాజా సరళీకరణ ప్రకారం లాభాపేక్ష లేని సంస్థలు, ప్రభుత్వ పరిశోధన సంస్థల నిర్వచనం, నిబంధనల్లో మార్పు చేశారు. ఆయా సంస్థలు ఇక నుంచి వార్షిక హెచ్-1బీ వీసాల చట్టపరమైన పరిమితి నుంచి మినహాయింపు పొందనున్నాయి. ప్రస్తుతం చట్టబద్ధంగా ఏడాదికి 65 వేల హెచ్-1బీ వీసాలను అనుమతిస్తున్నారు. అడ్వాన్స్ డిగ్రీలు ఉన్న మరో 20 వేల మందికి ఇస్తున్నారు. అయితే, ఇక నుంచి పలు సంస్థలను ఈ పరిమితి నుంచి మినహాయించనున్నారు. ఎఫ్-1 వీసాలపై ఉన్న విద్యార్థులకు కూడా ఈ నిబంధన వర్తించనుంది. ఇక, గతంలోనే హెచ్-1బీ వీసాలు కలిగి ఉన్న వారి పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించనున్నారు. ఈ నిబంధనలు జనవరి 17 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటి వరకు హెచ్-1బీ వీసాలను లాటరీ విధానంలో ఏటా ఒకసారి(ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో) ఇస్తున్నారు. దీంతో ఎంతో మంది ఆశావహులు ఈ లాటరీ తగలక నీరుగారుతున్నారు. ఇప్పుడు నిబంధనల సరళీ కరణతో ఎక్కువ మంది అవకాశం లభించనుంది.

కెనడాలో జాబ్ ఆఫర్.. ఇమ్మిగ్రేషన్ పాయింట్ల ఎత్తివేత!

న్యూఢిల్లీ, డిసెంబరు 18: కెనడాలో శాశ్వత నివాసం పొందేందుకు జాబ్ ఆఫర్ల పేరిట మోసాలు జరుగుతున్నట్లు ఆ దేశ ప్రభుత్వం భావిస్తోంది. దీనిని కట్టడి చేసేందుకు నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం జాబ్ ఆఫర్‌తో ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ పొందే పాయింట్లను ఎత్తేసే ఆలోచన చేస్తున్నట్లు కెనడా ఇమ్మిగ్రేషన్ శాఖ మంత్రి మార్క్ మిల్లర్ తెలిపారు. సాధారణంగా దేశంలోని వివిధ సంస్థలు నిపుణులైన ఉద్యోగులను నియమించుకోవాలనుకున్నప్పుడు.. అందుకు అర్హత కలిగినవారు ఆ దేశ పౌరుల్లో, అప్పటికే శాశ్వత నివాసం ఉన్నవారిలో లేకపోతే విదేశీ వ్యక్తులను నియమించుకుంటాయి. ఇందుకోసం లేబర్ మార్కెట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఎల్ఎంఏఐ) కింద దరఖాస్తు చేసుకుంటాయి. ఈ విధంగా ఇచ్చే జాబ్ ఆఫర్ ద్వారా ఆయా వ్యక్తులకు ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ పేరుతో 50 పాయింట్లు అదనంగా లభిస్తాయి. దీంతో.. ఆ వ్యక్తులు కెనడాలో శాశ్వత నివాసం లేదా తాత్కాలిక నివాసం కోరుకుంటే ఈ పాయింట్ల ద్వారా వారికి అదనపు ప్రయోజనం చేకూరుతుంది. అయితే ఈ పేరుతో పలు సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయని, విదేశీ వ్యక్తులు వీటిని కొనుగోలు చేసి.. శాశ్వత నివాసాలు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నాయని జస్టిన్ ట్రూడో ప్రభుత్వం భావిస్తోంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

రచయిత 'కాటూరు' అస్తమయం

» 600కుపైగా కథలు, 400కుపైగా ఆధ్యాత్మిక వ్యాసాలు రాసిన రవీంద్ర



కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కథ, నవలా రచయిత, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం(అరసం) గౌరవ సలహాదారులు కాటూరు రవీంద్ర త్రివిక్రమ్(78) బుధవారం తెల్లవారుజామున విజయవాడలోని స్వగృహంలో కన్నుమూశారు. 1946 డిసెంబరు 18న కృష్ణా జిల్లాలో జన్మించిన త్రివిక్రమ్ పుట్టినరోజునే మరణించడం యాదృచ్ఛికం. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ఆయన తొలి కథ 1974 నవంబరు 10న ప్రచురితమయింది. ఆ తరువాత పలు పత్రికలు నిర్వహించిన దీపావళి కథల పోటీల్లో వరుసగా వీరి రచనలు బహుమతులు పొందాయి. కథ, కథానిక, నవల, నవలిక, హరికథ, గేయ రచన, నాటకం, వ్యాసాలు తదితర ప్రక్రియల్లో సాహితీ సృజన చేశారు. 600కుపైగా కథలు, కథానికలు, 400కుపైగా ఆధ్యాత్మిక వ్యాసాలు రాశారు. 'యుగ పురుషుడు గురుగోబింద్ సింగ్' జీవిత చరిత్ర, 'శివగీతామృతం' తదితర ఆధ్యాత్మిక గ్రంథాలతో పాటు 'వడ్డీకాసులు', 'కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ కథానికలు' పేరుతో పుస్తకాలుగా వెలువడ్డాయి. కార్గిల్ పోరాటాన్ని కళ్లకు కడుతూ రవీంద్ర త్రివిక్రమ్ రాసిన 'కార్గిల్ కథలు' ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి. వందకుపైగా నాటకాలు ఆకాశవాణిలో, మరికొన్ని నాటికలు దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. 'జురాహామ'(మహారాజు) హాస్యనాటికకు రవీంద్ర జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. కాలమిస్టుగా అనేక పత్రికలలో 'అంతర్యామి', 'లా' సలహాలు వంటి శీర్షికలు నాలుగు దశాబ్దాలుగా నిర్వహించిన కాటూరు, గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైమానిక దళంలో ఇంజనీరుగా సేవలందించిన ఆయన 1965, 71 నాటి భారత్-పాక్ యుద్ధాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత పంజాబ్ నేషనల్ బ్యాంకులోను, హైకోర్టు లాయర్‌గాను ఆయన పనిచేశారు. అరసంకు గత కొంతకాలంగా గౌరవ సలహాదారుగా ఆయన వ్యవహరిస్తున్నారు. కాటూరు మరణ వార్త తెలియగానే అరసంప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాశ్, కార్యదర్శి శర్మ సీహెచ్, ప్రముఖ విద్యావేత్త ఎంసీ దాస్, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచంద్ తదితరులు త్రివిక్రమ్ భౌతిక కాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కాటూరు అంత్యక్రియలు బుధవారం సాయంత్రం విజయవాడలో ముగిసాయి.

'గగన్‌యాన్' ప్రాజెక్టులో కీలక ఘట్టం

» హెచ్ఎల్‌వీఎం3-జీ1 రాకెట్ పనులు ప్రారంభం



రాకెట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కనే శాస్త్రవేత్తలు

సూళ్లూరుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గగన్‌యాన్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో హెచ్ఎల్‌వీఎం3-జీ1 రాకెట్ ప్రయోగ సన్నాహాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మానవరహిత గగన్‌యాన్ ప్రయోగం కోసం రూపొందిస్తున్న మొదటి రాకెట్ నిర్మాణ పనులను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం 8.45 గంటలకు ఎస్200 మోటరు పూర్తి ఫ్లెక్స్ సీల్ నాజిల్‌తో నాజిల్ ఎండ్ సెగ్మెంట్‌ను అమర్చారు. మూడు దశల్లో 10 టన్నుల పేలోడ్ సామర్థ్యం కలిగిన ఈ రాకెట్ 53 మీటర్ల పొడవు, 640 టన్నుల బరువు ఉంటుంది. ఈ రాకెట్ ద్వారా క్రూ మాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపి మళ్లీ సురక్షితంగా భూమిపైకి తీసుకురానున్నారు. కాగా, సరిగ్గా పదేళ్ల క్రితం 2014 డిసెంబరు 18న ఎల్‌వీఎం3-ఎక్స్ కేర్ మిషన్ ద్వారా క్రూమాడ్యూల్‌ను అంతరిక్షంలోకి పంపి సముద్రంలో దిగిన తరువాత మళ్లీ సురక్షితంగా తీసుకురావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు మొదటి విజయాన్ని అందుకొన్నారు. ఇప్పుడు మళ్లీ అదే రోజున రాకెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ప్రత్యేకతను సంతరించుకుంది. అప్పట్లో ఎల్వీఎం3-ఎక్స్ కేర్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న ఎస్.సోమనాథ్... ఇప్పుడు ఇస్రో చైర్మన్ హోదాలో ఉండటం విశేషం.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*